ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 03.06.2026 | సంపుటి :12 సంచిక : 314 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


# సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం



## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
## విజన్ -2047 లక్ష్యంగా ముందుకు..

- త్వరలోనే జాబ్ నోటిఫికేషన్లు విడుదల
- నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం
- అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేస్తాం
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టాం
- నాటి నుంచి రాష్ట్ర హితంకై శ్రమిస్తున్నాం
- రాచరికం, పెత్తనాన్ని సమాజం సహించదు
- నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదు
- ప్రజాకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వం
- రుణమాఫీతో రైతులను రుణ విముక్తి చేశాం
- తొలి ఏడాదిలోనే రూ.22 వేల కోట్లు జమ
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి
- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం చిత్తశుద్ధి
- కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తాం
- మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతాం
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు
- రాష్ట్ర మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకం
- ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ విషెస్
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్

**హైదరాబాద్, జూన్ 2(జనంసాక్షి):** తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిఫికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం... రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల



సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది,

మిగతా 2లో..

> రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలని నిర్ణయం తీసుకున్నాం - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అమరవీరుల త్యాగాలు, పోరాటాల ఫలితమే
## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం
గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

వార్త 2లో

# తెలంగాణపై ఆంధ్రా పవనాల దాడి

## అవతరణ పండుగ రోజే లేచిన కత్తి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం అనేది కేవలం పరిపాలనా విభజన కాదు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువత త్యాగాలు, కోట్లాది ప్రజల ఆకాంక్షల ఫలితం. అలాంటి తెలంగాణ గురించి ఎవరైనా నాయకుడు నిర్లక్ష్యంగా మాట్లాడినా, ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేసినా సహజంగానే స్పందన వస్తుంది. ఇటీవల పవన్ కల్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు తెలంగాణలో వివాదానికి దారితీశాయి. గతంలో ఆయన చేసిన "దిష్టి" వ్యాఖ్యలపై తెలంగాణ రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కూడా పలువురు డిమాండ్ చేశారు.

- హైదరాబాద్ వేదికగా రాజకీయ కుట్రలకు యత్నం
- నాడు, నేడు తెలంగాణపై ఆగని ఆధిపత్య ధోరణి
- నవ నిర్మాణ సంకల్ప సభ పేరిట రెచ్చగొట్టే చర్యలు
- గద్దర్‌కు సాయం చేశానని చెప్పకోవడం నీచమైన రాజకీయ నాటకం




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణను అవమానించే ప్రయత్నాలు కొత్తవి కావు. ఉమ్మడి రాష్ట్ర కాలంలోనూ ఈ ప్రాంత ప్రజలు వివక్షను ఎదుర్కొన్నారు. ఉద్యోగాలు, నీళ్లు, నిధుల విషయంలో అన్యాయం జరిగిందనే భావనతోనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఆ పోరాటం ఫలితంగానే 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. అందువల్ల తెలంగాణ ఆత్మగౌరవం విషయంలో ప్రజలు అత్యంత సున్నితంగా స్పందిస్తారు. ఈ నేల ప్రజలు తమ హక్కుల విషయంలో రాజీ పడరు. తెలంగాణను విమర్శించే ముందు ఆ పోరాట చరిత్రను, త్యాగాలను, ప్రజల ఆత్మగౌరవాన్ని గుర్తుంచుకోవాలి. తెలంగాణను గౌరవించడం అంటే కేవలం ఒక రాష్ట్రాన్ని గౌరవించడం కాదు; కోట్లాది ప్రజల స్వాభిమానాన్ని గౌరవించడం.

**రాజకీయంగా రెచ్చగొట్టుడు..**
జూన్ 2న కోట్లాది తెలంగాణ ప్రజలు ఆనందంతో ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న వేళ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో సభ పేరుతో చిచ్చు పెట్టే కుట్రకు దిగారు. ఇది యాదృచ్ఛికం కాదు, ఉద్దేశపూర్వకమైన రాజకీయ రెచ్చగొట్టుడు. గతంలో ప్రభుత్వ సొమ్ముతో అంజన్నకు మొక్కు చెల్లించుకొని, దాన్నే తన తెలంగాణ సభలో గొప్పగా ఎత్తిపొడవడం పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వానికి అద్దం పడుతోంది. ఏపీ ప్రజల పన్నుల డబ్బును సొంత భక్తి ప్రదర్శనకు వాడడం నైతికంగా దివాలాతనం కాదా? తెలంగాణ ఉద్యమ సజీవ చిహ్నం గద్దర్‌కు ఆంధ్రా బాబు వీపున కాల్చినప్పుడు తాను సాయం చేశానని పవన్ కళ్యాణ్ గొప్పలు చెప్పుకున్నారు. బతికి లేని మనిషిని సాక్షిగా

మిగతా 2లో..

## నాలుగు కోట్ల ప్రజల జాగీరు తెలంగాణ
- నీ అయ్య జాగీర్ కాదు మిస్టర్ పవన్..
- తెలంగాణపై అక్కసు వెళ్లగక్కడమే తెలుసు: మండిపడ్డ పొన్నం

2లో..

## మోదీ రాసిచ్చారు.. పవన్ చదివారు
ఆయన వ్యాఖ్యలు అర్థరహితం : జగదీశ్ రెడ్డి



# కర్ణాటక సీఎంగా నేడు శివకుమార్ ప్రమాణం

ఆయనతో పాటు మరో పదిమంది మంత్రులకూ అవకాశం

- లోక్‌భవన్‌లో సాయంత్రం 4గంటలకు కార్యక్రమం
- రాహుల్ సహా కాంగ్రెస్ నేతల హాజరు

**బెంగళూరు(జనంసాక్షి):** కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డీకే శివకుమార్ 3న బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు మరో 10 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో డీకే శివకుమార్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారంనాడు చర్చలు జరిపిన అనంతరం తొలివిడత క్యాబినెట్

మిగతా 2లో..

## సీడబ్ల్యూసీ సభ్యుడిగా సిద్ధరామయ్య
కీలకపదవిలో నియమించిన కాంగ్రెస్ అధిష్టానం

2లో..

# నిరుద్యోగులకు తీపికబురు

## 290 పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వివిధ శాఖల్లో 290 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. రోడ్లు భవనాల శాఖలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ సివిల్ ఇంజినీర్, 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కాలుష్య నియంత్రణ మండలిలో 19 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్

మిగతా 9లో..

## సీబీఎస్ఈ చీఫ్‌గా ప్రశాంత్ సీతారామ్

- కార్యదర్శిగా వరుణ్ భరద్వాజ్ నియామకం
- ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వివాదం నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం
- ఛైర్మన్ రాహుల్ సింగ్, బోర్డు సెక్రటరీ హిమాన్ను గుప్తాలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కి సంబంధించి కేంద్రం ప్రభుత్వం మంగళవారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. సీనియర్ ఐఏఎస్ అధికారి లోఖండే ప్రశాంత్ సీతారామ్ నూతన సీబీఎస్ఈ అధిపతిగా, అలాగే, సీనియర్ అధికారి వరుణ్ భరద్వాజ్ కొత్త కార్యదర్శిగా నియమితుస్తున్నట్లు ప్రకటించింది. అంతకుముందు, ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంపై వివాదం చెలరేగిన

మిగతా 2లో..



సీఎం పర్యటన.. పాలమూరు నీటిపారుదల గమనాన్ని
# నిర్దేశించే మైలురాయి

## జలసౌధలో సన్నాహక సమావేశం మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్(జనంసాక్షి):** సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లా పర్యటన దృష్ట్యా హైదరాబాద్ జలసౌధలో మంత్రి ఉత్తమ్ సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రులు జూపల్లి, శ్రీహరి, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఇంజినీర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. సీఎం పర్యటన.. పాలమూరు నీటిపారుదల గమనాన్ని నిర్దేశించే మైలురాయి అని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తికి సీఎం దిశానిర్దేశం చేస్తారని, కీలక ప్రాజెక్టుల విధాన నిర్ణయాలు, అనుమతులు, నిధుల విడుదలకు అవకాశం ఉందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నీటిపారుదల స్వరూపం మార్చే పర్యటనగా ఉత్తమ్ చెప్పుకొచ్చారు.

# 2028లో మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి

సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ: బీఆర్ఎస్ నేత కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ కళాకారులకు కేటీఆర్ సన్మానం

మిగతా 2లో..





ఈ విషయంలో వివాహితురాలైన కుమార్తెను మినహాయించడానికి వీల్లేదు
'సుప్రీం' కీలక వ్యాఖ్యలు

## పెళ్లయిన కుమార్తెలకు కారుణ్య నియామకం సబబే..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కారుణ్య నియామకాల విషయంలో మంగళవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. వాటి విషయంలో వివాహితురాలైన కుమార్తెను మినహాయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ నియామకాలకు సంబంధించి కుటుంబ నిర్వచనంలో

మిగతా 9లో..



# చల్లని కబురు

- రేపు కేరళను తాకనున్న నైరుతి
- రుతుపవనాల ప్రవేశానికి అనుకూల పరిస్థితులు

**హైదరాబాద్(జనంసాక్షి):** భానుడి భగభగలతో జనం అల్లాడుతున్న వేళ వాతావరణశాఖ చల్లని కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు గురువారం కేరళను తాకేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లు అంచనా వేసింది. ఇవి కేరళను తాకిన వారం రోజులకు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఉపరితల ఆవర్తనం, ద్రోణుల ప్రభావంతో రాష్ట్రంలో నేడు, రేపు, ఎల్లుండి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నట్లు తెలిపారు. మంగళవారం

మిగతా 2లో..

## విద్యాశాఖ మంత్రిని తొలగించడమే సరైన న్యాయం
అధికారుల బదిలీపై కాంగ్రెస్ విమర్శలు

2లో..

# కుదిరిన సయోధ్య

- ఇజ్రాయిల్-హిజ్బుల్ కాల్పుల విరమణ
- ఇది శాశ్వతంగా కొనసాగాలి
- ట్రంప్ ఆకాంక్ష

**వాషింగ్టన్(జనంసాక్షి):** ఇజ్రాయెల్, ఇరాన్ మద్దతు ఉన్న హెజ్‌బొల్లా మధ్య జరుగుతున్న ఘర్షణలు శాశ్వతంగా ముగియాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్షించారు. ఇరుపక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ఆయన పేర్కొన్నారు. హెజ్‌బొల్లా-ఇజ్రాయెల్ మధ్య దాడులు ఆగిపోవడంతో శాంతి చర్చల్లో ఇరాన్ చురుకుగా పాల్గొంటోందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతా 'ట్రూత్'లో ఓ పోస్ట్ చేశారు. 'ఇజ్రాయెల్‌పై కాల్పులు ఆపేందుకు హెజ్‌బొల్లా అంగీకరించింది.

మిగతా 2లో..



## వ్యవసాయ యంత్రాల ఉత్పత్తులపై టారిఫ్‌లు తగ్గించిన ట్రంప్
25% నుంచి 15%కు సవరణ

## అమెరికాలో కాల్పుల కలకలం
మస్కటీన్‌లో చోటుచేసుకున్న ఘటనలో ఏడుగురు మృతి

2లో..

## పోక్సో కేసులో దోషికి 20 ఏళ్ల జైలు శిక్ష

9లో..

# కర్నాటక సీఎంగా నేడు శివకుమార్ ప్రమాణం

కూర్పునకు సంబంధించిన కసరత్తు పూర్తయినట్టు చెబుతున్నారు. కొద్ది రోజుల వ్యవధిలోనే మంత్రివర్గ విస్తరణ కూడా ఉంటుందని ఆ వర్గాలు తెలిపాయి. బెంగళూరులోని లోక్ భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, పలువురు సీనియర్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. డీకే శివకుమార్‌తో పాటు ప్రమాణస్వీకారం చేసేవారిలో..కేజే జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరేగౌడ, యూటీ ఖదెర్, మల్లనగౌడ బసనగౌడ పాటిల్, సతీష్ జార్కిహోళి, ప్రియాంక్ ఖర్గే, యతీంద్ర సిద్ధరామయ్య, లక్ష్మీ బెబ్బాల్కర్‌లు ఉన్నారు.పరిమిత అతిథుల సమక్షంలో నిరాడంబరంగా ఈ కార్యక్రమం నిర్వహించాలనుకుంటున్నట్లు శివుమార్ తెలిపారు. పార్టీ కార్యకర్తగా ప్రస్థానాన్ని మొదలుపెట్టిన తాను సీఎం స్థాయికి ఎదగడం వెనక గాంధీ కుటుంబం ఉందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఒక యువ కార్యకర్తగా తనలోని సామర్థ్యాన్ని దివంగత పీఎం రాజీవ్ గాంధీ గుర్తించారని అన్నారు. జీవితాన్ని ఏవిధంగా ప్రజా సేవకు అంకితం చేయాలి, ప్రజల హక్కుల కోసం ఎలా పోరాడాలి అనే ఎన్నో విషయాలపై తనకు మార్గదర్శనం చేశారన్నారు. రాజకీయ జీవితం క్లిష్ట దశల్లో ఉన్నప్పుడు సోనియాగాంధీ అందించిన మద్దతే తనను ముందుకు నడిపిందన్నారు. రాహుల్ గాంధీ నుంచి ప్రజాస్వామ్య విలువలు, అన్యాయాన్ని వ్యతిరేకించే వైఖరిని నేర్చుకున్నానని పేర్కొన్నారు. నిజమైన నాయకులు కేవలం విజయాలు సాధించిన సమయాల్లోనే అండగా నిలబడరని.. అత్యంత కష్ట సమయాల్లోనూ పక్కనే ఉంటారని అన్నారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేసినా సీఎం బంగ్లాలోనే ఆయన నివాసం ఉండనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సీఎంగా ఎన్నికైన వారికి అధికారిక బంగ్లా అయిన 'కావేరి'ని నివాసంగా కేటాయిస్తారు. అయితే సిద్ధూ-డీకేల మధ్య ఒప్పందం ప్రకారం సిద్ధరామయ్య సీఎం పదవికి రాజీనామా చేసినప్పటికీ 2028 సంవత్సరం వరకు కావేరి బంగ్లాలోనే ఉండనున్నారు. ఈ క్రమంలో నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న డీకేకు వేరే అధికారిక నివాసం ఏర్పాటుచేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అప్పటివరకు డీకే తన ప్రైవేటు నివాసంలోనే ఉంటూ అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# సీడబ్ల్యూసీ సభ్యుడిగా సిద్ధరామయ్య

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఇటీవల కర్ణాటక సీఎంగా రాజీనామా చేసిన సిద్ధరామయ్యను కాంగ్రెస్ అధిష్ఠానం కీలక పదవికి ఎంపిక చేసింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. కర్ణాటక సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయగా.. కొత్త సీఎంగా డీకే శివకుమార్‌ను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. నూతన సీఎంగా డీకేఎస్ బుధవారం సాయంత్రం బెంగళూరులో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# సీబీఎస్ఈ చీఫ్‌గా ప్రశాంత్ సీతారామ్

నేపథ్యంలో సీబీఎస్ఈ ఛైర్మన్ రాహుల్ సింగ్, బోర్డు సెక్రటరీ హిమాంశు గుప్తాలను తక్షణమే ఆయా పదవుల నుంచి బదిలీ చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓఎస్ఎం వ్యవస్థ అమలు, విద్యార్థులు నివేదించిన సమస్యలపై కమిటీ సభ్యులకు వివరించడానికి పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్‌తోపాటు సీబీఎస్ఈ చీఫ్ రాహుల్ సింగ్‌కు పార్లమెంటు స్థాయీ సంఘం సమన్లు జారీ చేసింది.మరోవైపు, ఈ ఘటనపై విచారణకు ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఛైర్‌పర్సన్ ఎస్.రాధాచౌహాన్‌ను ఈ కమిటీకి అధ్యక్షురాలిగా నియమించింది. ఈ మేరకు కేబినెట్ సెక్రటేరియట్ ఓ మెమోరాండం జారీచేసింది. అవసరమైతే ఇతర శాఖల అధికారుల సహాయం తీసుకునే అధికారం రాధా చౌహాన్‌కు కల్పించారు. ఒకనెల రోజుల్లోపు సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖకు ఆమె తన నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ బోర్డు పరీక్షల ప్రక్రియలో ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానం అమలు తీరుపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సాంకేతిక లోపాలు, ఫీజు చెల్లింపుల్లో వైఫల్యాలు, వెరిఫికేషన్, రీ-వాల్యుయేషన్ ప్రక్రియల్లో జాప్యంపై బోర్డు విమర్శలు ఎదుర్కొంటోంది.

### విద్యాశాఖ మంత్రిని తొలగించడమే సరైన న్యాయం

న్యూఢిల్లీ(జనంసాక్షి):మరోవైపు, సీబీఎస్ఈ ఛైర్మన్, కార్యదర్శి బదిలీపై కాంగ్రెస్ కీలక వ్యాఖ్యలు చేసింది. సీబీఎస్ఈ ఛైర్మన్ రాహుల్ సింగ్, కార్యదర్శి హిమాంశు గుప్తాల బదిలీ, రాజకీయ నాయకత్వంపై కాకుండా అధికారులపై జవాబుదారీతనాన్ని మోపే ప్రయత్నమని కాంగ్రెస్ మంగళవారం పేర్కొంది. అయితే, ఈ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించడమే న్యాయమని స్పష్టం చేసింది. అత్యంత అవినీతిమయమైన, అసమర్థమైన, చేతకాని వ్యవస్థకు మంత్రి ధర్మేంద్ర అధ్యక్షత వహిస్తున్నారని, ఇది లక్షలాది మంది యువత జీవితాలను నాశనం చేసిందని ప్రతిపక్షం ఆరోపించింది.ఇదిలా ఉండగా, విద్యార్థుల రీవాల్యూయేషన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతున్న వేళ తమ పోర్టల్‌పై సైబర్ దాడి యత్నాలు జరిగాయని సీబీఎస్ఈ బోర్డు తెలిపింది. దాదాపు 16 వేలమంది విద్యార్థులు రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకుంటున్న సమయంలోనే కొందరు డినయల్-ఆఫ్-సర్వీస్‌అనే విధానంతో దాడికి ప్రయత్నించారని పేర్కొంది. పోర్టల్‌లోకి లాగిన్ అవ్వడానికి దాదాపు 15 లక్షల మంది ప్రయత్నించారని, ఫైళ్లలోకి అనధికారికంగా ప్రవేశించడానికి లక్షకుపైగా సైబర్‌దాడుల ప్రయత్నాలు జరిగినట్లు తమ సిస్టమ్ గుర్తించిందని సీబీఎస్ఈ తెలిపింది.

# వ్యవసాయ యంత్రాల ఉత్పత్తులపై టారిఫ్‌లు తగ్గించిన ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):వ్యవసాయం, పరిశ్రమల్లో వాడే ఉపకరణాల దిగుమతుల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొంత మెత్తబడ్డారు. వాటిపై విధించిన టారిఫ్‌లను 25% నుంచి 15%కు తగ్గించారు. ఈ తగ్గింపు వచ్చే ఏడాది చివరివరకు ఉండనుంది. దీంతో హార్వెస్టర్ల వంటి యంత్రాలు, ఇతర పరికరాలకు వర్తించనుంది. వ్యవసాయ రంగంలో పెట్టుబడికి అండగా ఉండేందుకు.. ఉత్పత్తిదారుల వ్యయాలను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ట్రంప్ కార్యవర్గం పేర్కొంది. దీంతోపాటు తాజాగా సుంకం తగ్గింపు వర్తించే పరికరాల పరిధిని కూడా గణనీయంగా పెంచింది. పారిశ్రామిక రంగంలో వాడే బుల్‌డోజర్లు, ఫోర్క్ లిఫ్ట్‌లు వంటి వాటి దిగుమతులు మరింత చౌక కానున్నాయి. అమెరికాతో ఇప్పటికే వాణిజ్య ఒప్పందాలు చేసుకొన్న దేశాలకు కూడా ఈ తగ్గింపు వర్తిస్తుంది. తమ దేశ లోహరంగంలో ఉత్పత్తి పెంచాలన్న లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అమెరికా మరో తాయిలాన్ని ప్రకటించింది. విదేశీ తయారీ సంస్థలు ఏవైనా మూలధన పరికరాలను దిగుమతి చేసుకొంటే.. వాటి బరువులో 85% అమెరికా నుంచి దిగుమతి చేసుకొన్న స్టీల్, అల్యూమినియం వంటివి వినియోగిస్తే.. 10% సుంకం మాత్రమే వర్తిస్తుంది. ఈ తగ్గింపులు మొత్తం డిసెంబర్ 2027 వరకు కొనసాగుతాయని శ్వేతసౌధం వెల్లడించింది. అమెరికా పారిశ్రామిక రంగం పునర్ నిర్మాణానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని తెలిపింది. అమెరికా జాతీయ భద్రత కోసం అధ్యక్షుడు విదేశాల నుంచి అల్యూమినియం, స్టీల్, కాపర్ దిగుమతిపై టారిఫ్‌లు విధించినట్లు వివరణ ఇచ్చింది. అమెరికా పరిశ్రమలు, వ్యాపారులను విదేశీ చౌకబారు దిగుమతుల నుంచి కాపాడటానికి చర్యలు తీసుకొన్నట్లు వెల్లడించింది. భారత్ నుంచి మహీంద్రా అండ్ మహీంద్రా, టీఏఎఫ్ఈ, శక్తిమాన్, ఫీల్డ్‌కింగ్, జైన్ ఇరిగేషన్ వంటి సంస్థలు అమెరికాకు వ్యవసాయ పరికరాలను ఎగుమతి చేస్తాయి. ట్రంప్ తాజా నిర్ణయంతో భారత పరిశ్రమలకు కొంతమేరకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

# సంక్షేమం,అభివృద్ధికి సమప్రాధాన్యం

చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటే నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వమన్న సీఎం, గత 30



నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళ్తున్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ.11,300 కోట్లు జమ చేశామని తెలిపారు.మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు రేవంత్? రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

కాగా.. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్‌లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. హనుమకొండలో అమరవీరుల స్థూపానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వద్ద నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. నల్గొండ క్లాక్ టవర్ కూడలి వద్ద అమరవీరుల స్థూపానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పుష్పాలతో నివాళి అర్పించారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయపతాకావిష్కరణ చేశారు. నల్గొండలోని కలెక్టరేట్?లో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అమరవీరుల త్యాగ ఫలితమే మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ చరిత్ర గురించి మాట్లాడాలంటే నల్గొండ ప్రస్తావన లేకుండా ఒక్క పేజీ కూడా ముందుకు సాగదన్నారు.

# అమరవీరుల త్యాగాలు, దశాబ్దాల పోరాటాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం

హైదరాబాద్(జనంసాక్షి):అమరవీరుల త్యాగాలకు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాలకు ప్రతీక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఆయన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. ఆధునిక తెలంగాణ నిర్మాణానికి పునాదులు వేసిన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా స్మరించుకోవాలని గవర్నర్ పిలుపునిచ్చారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనే సూక్తిని ప్రస్తావిస్తూ, జన్మభూమి స్వర్గం కంటే గొప్పదని పేర్కొన్నారు. తెలంగాణ శతాబ్దాల నాటి సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వ్యవసాయ వారసత్వం రాష్ట్ర అసలైన జీవనాడిగా నిలిచాయని గవర్నర్ అన్నారు. కాకతీయుల కాలం నాటి గొలుసుకట్టు చెరువుల నుంచి నేటి ఆధునిక సాగునీటి ప్రాజెక్టుల వరకు రైతాంగం చేసిన కృషి తెలంగాణను సస్యశ్యామలం చేసిందని కొనియాడారు. వ్యవసాయ రంగంతో పాటు ఐటీ, ఫార్మా, స్టార్టప్ తదితర రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, 'సర్వే భవంతు సుఖినః' అనే ఆదర్శ స్ఫూర్తితో గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం, నగరాల ఆధునికీకరణ సమపాళ్లలో సాగుతూ సుసం పన్న నిర్మాణం జరగాలని గవర్నర్ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలని గవర్నర్ ఆకాంక్షించారు. వేడుకల్లో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శ్రీ శశికిరణా చారి, లోక్ భవన్ అధికారులు, ఉద్యోగులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## చల్లని కబురు

ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్గొండ జిల్లాలకు వర్ష సూచన ఉందని, ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈరోజు రాత్రి 7గంటల వరకు నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నాగర్ కర్నూల్, రంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే, ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, మహబూబ్ నగర్‌తో పాటు యాదాద్రి భువనగిరి, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు వర్ష సూచన ఉండగా.. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు, ఉమ్మడి నల్గొండ, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, మహబూబ్ నగర్‌తో కామారెడ్డి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు

# మోదీ రాసిచ్చారు.. పవన్ చదివారు

హైదరాబాద్(జనంసాక్షి):
ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి స్పందించారు. పవన్ వ్యాఖ్యలు అర్థరహితంగా ఉన్నాయన్నారు. తెలివితక్కువ మాటలు మాట్లాడటం మంచిది కాదన్నారు. కాంగ్రెస్, జనసేన కలిసి నాటకాలాడుతున్నాయన్న ఆయన.. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకొని డ్రామాలు ఆడుతున్నారంటూ మండిపడ్డారు. మోదీ రాసిచ్చారు.. పవన్‌కల్యాణ్ చదివారంటూ జగదీశ్ రెడ్డి ఆరోపించారు.

# అమెరికాలో కాల్పుల కలకలం

వాషింగ్టన్(జనంసాక్షి):
అమెరికాలో వరుస కాల్పుల ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా అయోవాలో మస్కటీన్‌లోని పలు ప్రాంతాల్లో కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వారిలో అనుమానిత నిందితుడు కూడా ఉన్నట్లు మస్కటీన్ పోలీసులు తెలిపారు. 210 పార్క్ అవెన్యూలోని ఓ నివాసంలో కాల్పులు జరిగాయని పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు, వైద్యసిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొన్నారు. అక్కడ తుపాకీ గాయాలతో ఉన్న నలుగురిని గుర్తించారు. వారిని ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయారు. మస్కటీన్‌కు చెందిన ర్యాన్ విల్లీస్ (52)ను నిందితుడిగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొనేలోపే అతడు అక్కడినుంచి పరారయ్యాడు. అతడి కోసం గాలిస్తుండగా.. మరో ప్రాంతంలో విల్లీస్ తుపాకీతో కాల్చుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఇక, మస్కటీన్‌లోని ఓ నివాసంలో, గ్రాండ్‌వ్యూ అవెన్యూలోని ఓ వ్యాపార సముదాయంలో తుపాకీ గాయాలతో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఒక కుటుంబంలోని వివాదం వల్ల ఈ కాల్పులు జరిగాయని ప్రాథమిక దర్యాప్తులో తెలిసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# కుదిరిన సయోధ్య

అలాగే ఇజ్రాయెల్ కూడా హెజ్‌బొల్లాపై దాడులు నిలిపివేయడానికి ఒప్పుకుంది. ఇది ఎంతకాలం కొనసాగుతుందో చూడాలి. ఇది శాశ్వతంగా కొనసాగాలని ఆశిస్తున్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో చాలా మంచి సంభాషణ జరిగిందని ట్రంప్ చెప్పారు. అయితే పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా మారలేదని అంతర్జాతీయ మీడియా నివేదికలు చెబుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటన వచ్చిన తర్వాత కూడా దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో దాడులు, రాకెట్ ప్రయోగాల వార్తలు వెలువడ్డాయి. దీంతో ఈ ఒప్పందం ఎంతకాలం నిలుస్తుందన్న దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా లెబనాన్‌లో ఉద్రిక్తతలు తగ్గించడం అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చలకు కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలంగాణపై ఆంధ్రా'పవనాల' దాడి

అవతరణ పండుగ రోజే లేచిన కత్తి హైదరాబాద్ వేదికగా రాజకీయ కుట్రలకు యత్నం నాడు, నేడు తెలంగాణపై ఆగని ఆధిపత్య ధోరణి నవ నిర్మాణ సంకల్ప సభ పేరిట రెచ్చగొట్టే చర్యలు గద్దర్‌కు సాయం చేశానని చెప్పుకోవడం నీచమైన రాజకీయ నాటకంపెట్టుకొని తెలంగాణ వేదికపై సానుభూతి వెతుక్కోవడం నీచమైన రాజకీయ నాటకమేనని విశ్లేషకులు చెబుతున్నారు.

**తెలంగాణవాదులే బెదిరించారంట**

దశాబ్దాలుగా తెలంగాణలో తనను బెదిరించారని, తలవంచలేదని పవన్ కళ్యాణ్ వాపోయారు. నిజానికి బెదిరింపులకు గురైనది తెలంగాణ సమాజం. మూలిగే నెత్తిన మద్దెల అన్నట్టు, అణచివేతకు గురైన వారినే దాడికి దిగినవారిగా చిత్రించే ఈ వక్రభాష్యం చారిత్రక మోసం. తెలంగాణ ఆవిర్భావ సందర్భంగా తాను 11 రోజులు తిండి మానేశానని నాడు పవన్ ప్రకటించడం, 1200 మందికిపైగా అమరులైన



తెలంగాణ ఉద్యమ అమరవీరుల త్యాగాలతో తన కోనసీమ రాజకీయ దీక్షను సమం చేసుకోవడం తెలంగాణ సమాజానికి చేసిన అవమానం. అదేవిధంగా కోనసీమ కొబ్బరి తోటలకు వైరస్ సోకితే "తెలంగాణ దిష్టి తగిలింది" అని పవన్ కళ్యాణ్ బహిరంగంగా ఆడిపోసుకున్నారు. తెలంగాణను ఒక వ్యాధిగా, శాపంగా చిత్రించే ఈ భాష కేవలం అజ్ఞానం కాదు ఉద్దేశపూర్వకమైన విద్వేష రాజకీయం. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి నోటి నుండి వచ్చిన మాటలు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం.

**హైదరాబాద్‌పై కన్నేసే కుట్రలు**

ఉమ్మడి రాజధాని కాలం ముగిసిన హైదరాబాద్‌లో, జూన్ 2న సభ పెట్టుకోవడం ద్వారా "ఈ నగరంపై మాకూ హక్కు ఉంది" అనే సంకేతాన్ని పంపించే ప్రయత్నం చేశారు పవన్. బహిరంగంగా అడగలేరు కాబట్టి రాజకీయ సంకేత భాషలో పాకులాడుతు న్నారు. శాంతిగా ఉన్న హైదరాబాద్‌లో కావాలని చిచ్చు పెట్టాలని చూస్తున్న ఈ పాకులాటకు తెలంగాణ సమాజం స్పష్టమైన జవాబు చెప్పాలి. పవన్ కళ్యాణ్ సభ తెలంగాణకు ఒక హెచ్చరిక. ఉద్యమ కాలంలో అగ్నిలాంటి సమాజం, రాష్ట్రం వచ్చిన తర్వాత సద్దుమణిగింది. ఈ నిశ్శబ్దాన్నే కొందరు అవకాశంగా చూస్తున్నారు. తెలంగాణ అస్తిత్వం కేవలం భూభాగం కాదు, అది ఒక సజీవమైన చేతన. ఆ చేతనను సజీవంగా ఉంచుకోవడమే నిజమైన ఆవిర్భావ దినోత్సవ నివాళి.

# నాలుగు కోట్ల ప్రజల జాగీరు తెలంగాణ

హైదరాబాద్,జూన్2(జనంసాక్షి):ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు.. నీ అయ్యా జాగీరు కాదంటూ జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్ వేదికగా స్పందించారు. మిస్టర్ పవన్ కళ్యాణ్.. ఇది మా అయ్య జాగీరే అని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ ఇక్కడికి వచ్చి పీకేదేంటని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ పెయిడ్ ఆర్టిస్ట్ అని అభివర్ణించారు. తన దగ్గర డబ్బులు ఉంటే తాను కూడా పవన్‌తో ఒక క్యారెక్టర్ చేయిస్తానన్నారు. తెలంగాణపై పవన్ కళ్యాణ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారంటూ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తి పవన్ అని తెలిపారు. గద్దర్‌కు కారు కొనిచ్చా అని చెప్పినందుకు ముందు క్షమాపణ చెప్పాలంటూ పవన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. చనిపోయిన వారి గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటని ఏపీ డిప్యూటీ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. తనకి ఆంధ్రాలోనే దిక్కు లేదని పవన్ చెప్పుకున్నాడని వ్యంగ్యంగా అన్నారు. ఉద్యమ సమయంలో కూడా ఆంధ్రా వాళ్ళని మేం ఏం అనలేదని పేర్కొన్నారు. మేం ఆంధ్రా వాళ్ళని ఏదో అన్నట్టు పవన్ కల్యాణ్ అబద్దాలు చెబుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఏ బిల్లు చేసినా తలుపులు మూసే పాస్ చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. కొండగట్టుకు ఇచ్చిన పైసలు మీ అయ్యా జాగీరా? అని సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీటింగ్ పెట్టడం గెలకడం కాదా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ తిరిగితే జనాలు వస్తారు కానీ ఓట్లు వేయరని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ వచ్చినా, పోయినా మాకేం సంబంధం లేదన్నారు. తెలంగాణ ఎప్పుడైనా ఏపీ ప్రజలను స్వాగతిస్తూనే ఉంటుందని చెప్పారు. సినిమా నటుడిగా పవన్ ఎక్కడ తిరిగినా తమకేం ఇబ్బంది లేదన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ద్వంద్వ వైఖరిని అద్దం పడుతున్నాయని విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌వేదికగా పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పవన్ కళ్యాణ్‌ది 'జనసేన' పార్టీ అని.. తెలంగాణలో బీజేపీ 'భజన సేన' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో నిరుద్యోగంపై కొట్లాడుతానని అన్న పవన్ కళ్యాణ్‌కి.. కేంద్ర ప్రభుత్వం కారణంగా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పేపర్ లీక్ ఘటనలు కనిపించడం లేదా? అని నిలదీశారు. ఒకవేళ కనిపించినా నిలబడి కొట్లాడటానికి కాళ్ళు లేవట్లేవా?? అంటూ ఘాటుగా స్పందించారు. పవన్ ద్వంద్వ వైఖరికి ఎందుకని ప్రశ్నించారు. 'ఇది తెలంగాణ జాతి.. అమ్మలా ఆదరించడం తెలుసు.. తెలంగాణలో కుట్రలు చేస్తే అమ్మోరులా దహించడమూ తెలుసు' అంటూ పవన్‌ను హెచ్చరిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# 2028లో మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి

చేశారు.అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో పాటలు రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ అనేక పాత్రలు పోషించారని, తెలంగాణ సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. కేసీఆర్ జీవిత గాథపై సినిమా తీయాలని ఒక దర్శకుడు తనను కలిసిన సందర్భాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆలోచిద్దామని కేసీఆర్ చెప్పారని, తెలంగాణ ఆవిర్భావం అనేది అన్ని ప్రతికూల పరిస్థితులను ఛేదించి సాధించిన చారిత్రక విజయమని ఆ దర్శకుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. కేసీఆర్ అనే మూడు అక్షరాల ముందు 'ముఖ్యమంత్రి' అనే పదవి చాలా చిన్నదిగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్.. 'పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల తెలంగాణగా మారిపోయింది. నిష్ఫల తెలంగాణగా మారిపోయింది' అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం పదవిని మాత్రమే కాదు.. అవసరమైతే ప్రాణత్యాగానికీ సిద్ధపడ్డ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడిన ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వేలాది కుటుంబాల కష్టాలను తీర్చిన నాయకుడు కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొందరు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ.. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే విజయం సాధించిందని, 2023 ఎన్నికల్లో కూడా ఒంటరిగానే పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని ఆరోపిస్తూ, ప్రస్తుతం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టే విధంగా పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తూ.. గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. 'వడ్డించిన విస్తరి లాంటి తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిగా మార్చుతున్నారు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంక్షేమం, అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ అన్నారు. అయితే ఈ పరిస్థితులు శాశ్వతం కాదని, 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పిడుగు పడి 35 జీవాలు మృతి

- ఆపస్మారక స్థితిలో బాధితులు



**నూగూర్ వెంకటాపురం జూన్ 1(జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లోని అలుబాక అటవీ ప్రాంతం లో మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పిడుగు పడటం తో 35 మేకలు మృత్యువాత పడ్డాయి. రైతులు మేకలు మేతకు మేపెందుకు తీసుకెళ్లిన సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడటం తో ఈ ప్రమాదం జరిగింది.మేకలు కాపారులు ఇరువురు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు. మేకల కాపారులను ఇరువురి వెంటనే ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. వెంటనే ఆసుపత్రి కి చేరిన గొర్రెల కాపారులు ఇరువురి ఆరోగ్య పరిస్థితి కొంచెం మెరుగు పడిందని సమాచారం అందజేశారు.ఈ సంఘటనతో ఇద్దరి రైతులకు సుమారు రెండున్నర లక్షల ఆర్థిక నష్టం వాటిల్లిందని, భారీ వర్షం పడటం తో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఇ లాంటి ఊహించని ప్రకృతి వైపరీత్యాల వల్ల మేకలు మృతి చెంది తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నా రైతులకు నష్టం పరిహారం ప్రభుత్వం తమకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

# రాజకీయాలు అతీతంగా తెలంగాణ అభివృద్ధి

- ఉద్యమకారులను గుర్తించి గౌరవిస్తాం
- తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో మంత్రి పొన్నం



**సిద్దిపేట, జూన్2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి రాజకీయ పార్టీలకు అతీతంగా కృషి చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. త్వరలోనే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారిని గౌరవిస్తామని మాటిచ్చారు. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొని రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను చదివి మంత్రి వినిపించారు. అలాగే, హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను మంత్రి ఎగురవేశారు. హుస్నాబాద్ అంబేద్కర్ సర్కిల్ దగ్గర జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ నంబర్ 3 ద్వారా తెలంగాణ ఏర్పాటైందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. తె తెలంగాణ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదని, కోట్లాదిమంది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని చెప్పుకొచ్చారు. త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణ, నేడు అభివృద్ధి సంక్షేమానికి చిరునామాగా నిలిచిందని ఉద్ఘాటించారు. తెలంగాణను ప్రజాపాలన ప్రభుత్వంలో మరింత సమానత్వంతో, మరింత ప్రగతితో ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## తెలంగాణ అస్తిత్వంపై జరిగే దాడులను ప్రజలు తిప్పి కొట్టాలి


- కేకే కమిటీ కాలయాపన చేయకుండా ఉద్యమకారులను గుర్తించి, ప్రభుత్వం గౌరవించాలి
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అనంతుల మధు



**సూర్యాపేట (జనంసాక్షి) :** తెలంగాణ అస్తిత్వంపై జరిగే దాడులను ప్రజలు తిప్పి కొట్టాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అనంతుల మధు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ రాష్ట్ర కో -ఆర్డినేటర్ అనంతుల మధు అమర వీరులకు నివాళు లు అర్పించి, జాతీయ జెండా ఎగుర వేసి మాట్లాడుతూ ఆరు దశబ్దాల ఆత్మ గౌరవ అస్తిత్వ పోరాటం, అమర వీరుల స్వప్నం నెరవేరిన రోజు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొలి, మలి దశ ఉద్యమకారులను కాలయాపన చేయకుండా గుర్తించి గౌరవించాలని డిమాండ్ చేసారు. తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసే విధంగా తెలంగాణ ప్రాంతంపై,సీమాంధ్ర పెట్టుబడి దారుల కనుసన్నల్లో దోపిడీ పాలకులు మరోసారి తెలంగాణపై పెత్తనం చేసే కుట్రలు జరుగుతున్నాయని, ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండి వారి తెలంగాణ అస్తిత్వంపై జరిగే దాడులను తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనిగా సంతోష్ రెడ్డి, భాషపింగు సునీల్, కొలిక పంగు వాసు, గుగులోత్ సురేష్ నాయక్, గుద్దేటి మధు, కోట్ల సంజీవ్ రెడ్డి, బద్రి, వెంకటేష్ నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్

- కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం
- ఆవిర్భావ వేడుకల్లో మంత్రి వివేక్ విమర్శలు



**మెదక్, జూన్ 2 (జనంసాక్షి) :** జిల్లాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్న శంకరంపేట్ లో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి అమర వీరుల స్తూపం దగ్గర నివాళు లర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు అమరవీరుల గుర్తు చేసుకుంటూ ప్రదదర్శించిన కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ ఎస్ పదేళ్ల బీఆర్ ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు జేశారని అన్నారు. కమిషన్ల కోసమే లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని విమర్శించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవం సంబురాలు ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి జెండావిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అంతకు ముందు గన్ పార్కు దగ్గర అమర వీరుల స్తూపానికి నివాళు లర్పించారు సీఎం రేవంత్ రెడ్డి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లాలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో? మంత్రులు, అధికారులు, ప్రజలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ ఆటాపాటలతో సంబురాలను జరుపుకున్నారు.

## ఈతకు వెళ్లి యువకుడు మృతి

**హుస్నాబాద్, జూన్ 2 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ పచ్చునూర్ గ్రామానికి చెందిన దాసారపు కార్తీక్ ఉపాధి నిమిత్తం హుస్నాబాద్‌కు వచ్చాడు. మంగళవారం తన స్నేహితులతో కలిసి పట్టణ శివార్లలోని ఎల్లమ్మ చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లిన కార్తీక్ నీటిలో మునిగి చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## మహిళను మాటల్లో పెట్టి గొలుసు చోరీ

**హైదరాబాద్, జూన్2 (జనంసాక్షి) :** నగరంలో చైన్ స్నాచర్ రెచ్చిపోయాడు. కూరగాయాల కోసం బయటకు వెళ్లిన మహిళతో ఓ వ్యక్తి మాటలు కలిపి అకస్మాత్తుగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగి ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. రత్నమాల అనే మహిళ కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వెళ్తోంది. దుర్గాబాయి దేశ్ముఖ్ కాలనీలోని వేద్రశ్రీ అపార్ట్‌మెంట్‌లో తన నివాసంలోకి అడుగు పెట్టగానే ఓ గుర్తు తెలియని వ్యక్తి కాలినడకన ఆమె వద్దకు వచ్చాడు. మహిళతో కాసేపు మాట్లాడిన నిందితుడు.. ఒక్కసారిగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. దుండగుడి చర్యతో మహిళ షాక్‌కు గురైంది. దొంగలించిన గొలుసు సుమారు రెండున్నర తులాలు ఉంటుందని అంచనా. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగిన సమయంలో నిందితుడు హెల్మెట్ ధరించి ఉన్నట్లు తెలుస్తోంది. దుండగుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# అభివృద్ధి పథంలో తెలంగాణ

- అమరుల స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధి
- ఆవిర్భావ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్2 (జనంసాక్షి) :** ప్రజాపాలనతో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. అమరుల త్యాగాల పునాదులు మీద తెలంగాణ అవతరించిందని తెలిపారు. అమరుల త్యాగాల స్ఫూర్తిగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనను అందిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రగతి మైదానంలో జాతీయ జెండాను మంత్రి తుమ్మల ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సశ్యశ్యామలంగా మారేలా సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో ఉద్యాన పంటల సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అగ్ర స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. దేశానికే తలమానికంగా మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెంలో స్థాపించామని ప్రస్తావించారు. ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసి ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశామని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధి పారిశ్రామిక ప్రగతి కోసం రహదారులు నిర్మిస్తున్నామని మంత్రి తుమ్మల వెల్లడించారు. భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యం ఉండేలా రైల్వే కనెక్టివిటీ కోసం కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదన చేశామని అన్నారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు కోసం కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలు పాటిస్తామని చెప్పారు. కొత్తగూడెం పట్టణం మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయడంతో అభివృద్ధి బాటలో పయనిస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## శ్రీకాంతా చారి త్యాగం మరవలేనిది

- టీపీసీసీ ప్రధాన కార్యర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వద్ద తెలంగాణ ఉద్యమ అమరవీరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన శ్రీకాంతాచారి త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో వేలాది మంది యువత, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి శ్రీకాంతాచారి వంటి అమరవీరులు అందించిన త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటికి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, అమరవీరులు కలలు కన్న సమాజ నిర్మాణమే వారికి నిజమైన నివాళి అవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమరవీరులందరికీ ఘన నివాళులు అర్పిస్తూ, వారి త్యాగాలను ఎప్పటికీ మరువబోమని, తెలంగాణ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు సెల్వ చారి తదితరులు పాల్గొన్నారు

# బహ్రెయిన్‌లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బహ్రెయిన్ ఎన్నారై బీఆర్ఎస్ సెల్ అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నారై బీఆర్ఎస్ శాఖ అధ్యక్షులు రాధారపు సతీష్ కుమార్ అధ్యక్షతన అండాలస్ గార్డెన్‌లో జరిగిన ఈ వేడుకల్లో కేకును కట్ చేసి ఆనందోత్సాలతో ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శాఖ అధ్యక్షులు సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ బొలిశెట్టి మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో అరవై ఏండ్ల పాటు తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని చూడలేక అహింసా మార్గాన ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపించి, చావునోట్లో తలపెట్టి మరీ కేసీఆర్ తెలంగాణను సాధించారని తెలిపారు. డిసెంబర్ 9 న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష లేకుంటే నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవమే లేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా.. రెండుసార్లు ముఖ్యమంత్రిగా సేవలందించి కేసీఆర్ అన్ని రంగాల్లో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దారని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ సుపరిపాలన అందించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతిని పరుగులు పట్టించారన్నారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చూడాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ అన్నారం సుమన్, చెన్నమనేని రాజేందర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శాఖ అధ్యక్షులు సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేష్, జనరల్ సెక్రటరీలు అన్నారం సుమన్, చెన్నమనేని రాజేందర్ , కార్యదర్శులు సంగేపు దేవన్న, సంకోజీ రాణాప్రతాప్, మల్లెల ప్రమోద్, పుప్పలవాయి వంశీ , రాము గౌడ్, కిరణ్ కస్తూరి, నర్సింహా చారి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

- కేకే కమిషన్‌కు చట్టబద్ధతేది
- అడ్వకేట్ జేఏసీ నేత మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు అధికారంలోకి వచ్చిన వెంటనే 250 గజాలు ఇంటి స్థలం ఇస్తామని నెలకు 25 వేల రూపాయలు పెన్షన్ ఇస్తామని హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు ఇస్తామని ఐడి కార్డులు ఇచ్చి బస్సు ప్రయాణం ఫ్రీగా కల్పిస్తామని అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచిపోతున్న ఈ ఒక్కరికి కూడా ఎలాంటి హామీ నెరవేర్చని ఈ కాంగ్రెస్ పార్టీని ప్రజాక్షేత్రంలో చీల్చి చెండాడుతామని ఉపేంద్ర అన్నారు ఉద్యమకారులు జైలుకుపోయి అరెస్టులై ఉద్యమంలో గాయపడి ఆసుపత్రుల పాలై అకాడమిక్ ఇయర్ లు కోల్పోయిన విద్యార్థులు భవిష్యత్తును కోల్పోయిన న్యాయవాదులు ఉద్యోగస్తులు జర్నలిస్టులు కుల ప్రజా సంఘాల నేతలు ఎంతోమంది పోరాటం చేసి సాధించిన తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు మాయమాటలతో అధికారంలోకి వచ్చి కేకే కమిటీ పేరుతో (కాంగ్రెస్ చీటింగ్ కమిటీ) కాలయాపన చేస్తూ జీవో 679 విడుదల చేసి ఉద్యమకారులను మరొకసారి మోసం చేయడానికి నాటకం మారుతున్నదని ఇలాంటి నాటకాలు ఉద్యమకారుల ముందు సాగవని ఆయన హెచ్చరిక చేశారు కేకే కమిటీ ఎన్ని రోజుల్లో రిపోర్ట్ ఇస్తుందని ఇచ్చిన రిపోర్టును ప్రభుత్వం అమలు చేయకపోతే ఉద్యమకారుల పరిస్థితి ఏమిటని ఆయన అన్నారు కమిటీని వేయటానికి 30 నెలలు సమయం తీసుకున్న కాంగ్రెస్ పార్టీ ఒకవేళ కమిటీ రిపోర్ట్ ఇస్తే దాన్ని అమలు చేయటానికి ఎంత సమయం తీసుకుంటుందో అంతుచిక్కదని కేవలం ఉద్యమకారులను మోసం చేయడానికి ఈ కుట్ర అని ఆయన అన్నారు ఉద్యమకారుల త్యాగాలు లేనిదే ఈరోజు ఈ నాయకులకి ముఖ్యమంత్రి పదవి మంత్రి పదవులు మరియు ఇతర పదవులు వచ్చేవి కాదని వెంటనే ఈ ప్రభుత్వం ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించి అమరుల కుటుంబాలకు కోటి రూపాయలు ఉద్యమంలో గాయపడ్డ వారికి కోటి రూపాయలు జైలు జీవితం గడిపిన వారికి హార్దిక సాయంతో పాటు 250 గజాలు జాగా పెన్షన్ 25 వేల రూపాయలు ఇచ్చి ఐడి కార్డును ఇచ్చి బస్సు ప్రయాణంలో ఉచిత సౌకర్యం కల్పించి ప్రభుత్వ నిర్వహించే కార్యక్రమాలలో వీరిని గౌరవిస్తూనే వీరికి ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు.

# చెరువులో వందల సంఖ్యలో చేపలు మృత్యువాత

- 5లక్షల వరకు నష్టపోయాం.. .ప్రభుత్వమే ఆదుకోవాలి
- గంగ పుత్ర సంఘం సభ్యుల డిమాండ్





**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ఎండ వేడికి మనుషులే కాదు నీటిలో ఉన్న పెద్ద పెద్ద చేపలు నేల రాలుతున్నాయి. తాజాగా ఆదిలాబాద్ జిల్లా మావాల మండలంలోని కొత్త చెరువులో ఉన్న చేపలు ఉన్నట్టుండి మృత్యువాత పడ్డాయి. మంగళవారం యధావిధిగా ఉదయం వేళలో గంగా పుత్ర సభ్యులు చేపలను పట్టడానికి చెరువు వద్దకు వెళ్ళి చూడగా చెరువులో చేపలు నీటిపైన తేలియాడుతూ మృతిచెంది కనిపించాయి. ఒక్కో చేప బరువు కిలో నుంచి 10కిలోల వరకు ఉంటుంది. చనిపోయిన చేపలను చూసి గంగ పుత్ర సంఘం సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో దిగి చేపలను పట్టుకుని కన్నీరు మున్నీరయ్యారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు సంధల గంగాధర్ మాట్లాడుతూ వందల సంఖ్యలో చేపలు మృతి చెందటంతో తమ కుటుంబాలు పూర్తిగా నష్టపోయాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము తమ కుటుంబాలు ఈ చెరువుపైనే ఆధారపడి ఉపాధి పొందుతున్నామని ఇక ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. చనిపోయిన చేపల విలువ సుమారు 5లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నామన్నారు. గత కొద్ది రోజుల నుంచి జిల్లాలో ఎండతోపాటు తీవ్రంగా వడగాలులు వీస్తుండడంతోనే చెరువులో ఉన్న నీరు వేడెక్కి, పూర్తిగా ఇంకిపోయి చేపలు మృతి చెంది ఉంటాయని వారు తెలిపారు. చేపలు మృతి చెందడంతో వీటిపైనే ఆధారపడి జీవిస్తున్న తమ 56 కుటుంబాలు ఆకలితో అలమటించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫిషరీస్ డిపార్ట్ మెంట్ వెంటనే దీనిపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట సంఘం సభ్యులు సెక్రటరీ చంద్రకాంత్, దత్తు,నారాయణ, చిట్టి, సభ్యులు ఉన్నారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే స్వేచ్ఛ

- ఎమ్మెల్సీ కోదండరాం కీలక వ్యాక్యాలు
- పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు




**హైదరాబాద్, జూన్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ జన సమితి కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జరిగాయి. ఎమ్మెల్సీ కోదండరాం రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. '60 ఏళ్ల నిరీక్షణ ఫలించిన రోజు జూన్ 2, మేం ఎప్పుడూ ఆంధ్ర ప్రజలకు వ్యతిరేకం కాదు. తెలంగాణపై ఆంధ్ర పాలకుల పెత్తనాన్ని మాత్రమే వ్యతిరేకించాం' అని కోదండరాం మాట్లాడారు. సోనియా గాంధీ, సుష్మాస్వరాజ్ తెలంగాణ కోసం కృషి చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశ వైఖరితో వ్యవహరించిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛ వచ్చిందని కోదండరాం తెలిపారు. మరోవైపు హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా జరిగాయి. లోక్‌భవన్‌లో గవర్నర్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, వివిధ రాష్ట్రాల సమ్మిళిత సంస్కృతికి హైదరాబాద్ ప్రతీక అని గుర్తు చేసుకున్నారు. వసుధైక కుటుంబం భావనకు హైదరాబాద్ సాక్ష్యమన్నారు. వికసిత్ భారత్‌లో తెలంగాణ మరింత కీలకంగా ఎదుగుతుందని కొనియాడారు.

# తెలంగాణ గుండెపై కత్తి

*తెలంగాణ ఏర్పడిన రోజు జూన్ 2. కోట్లాది తెలంగాణ ప్రజలకు కేవలం పండుగ కాదు, అది ఒక చారిత్రక గాయం మానిన రోజు. దశాబ్దాల నిర్లక్ష్యం, వివక్ష, రాజకీయ ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటం సాధించిన విజయానికి ప్రతీక. అలాంటి రోజున, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో సభ నిర్వహించడం యాదృచ్ఛికం కాదు. అది ఒక రాజకీయ సందేశం. జాగ్రత్తగా రూపకల్పన చేసిన సంకేతం.*

సంపాదకీయం

సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడిన తీరు స్పష్టత కంటే సంకేతాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. తెలంగాణలో దశాబ్దాలుగా తనను బెదిరించారని, అయినా తాను తలవంచలేదని చెప్పారు. కానీ ఎవరు బెదిరించారు? ఎప్పుడు బెదిరించారు? ఏ అంశంలో బెదిరించారు? అన్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. అస్పష్టతనే ఆయుధంగా మార్చుకుని, నిర్దిష్టంగా చెప్పకుండా తెలంగాణ సమాజంపై అనుమానపు నీడను విసరడం రాజకీయ వ్యూహంగా కనిపించింది.

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున తన 11 రోజుల నిరాహార దీక్షను ప్రస్తావించడం కూడా అనేక ప్రశ్నలకు తావిచ్చింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాదు, కోనసీమ జిల్లా పేరు మార్పు వివాదం నేపథ్యంలో చేపట్టిన దీక్షను తెలంగాణ పుట్టినరోజు వేదికపై గుర్తు చేసుకోవడం ద్వారా, తెలంగాణ ఉద్యమ త్యాగాల చారిత్రక ప్రాధాన్యాన్ని తన రాజకీయ అనుభవాలతో సమాంతరంగా నిలబెట్టే ప్రయత్నం చేసినట్టుగా కనిపించింది. అయితే తెలంగాణ ప్రజల మనోభావాలను ఎక్కువగా గాయపరిచిన విషయం ఆయన గత వ్యాఖ్యలే. కోనసీమలో కొబ్బరి తోటలకు వైరస్ సోకిన సందర్భంలో "తెలంగాణ దిష్టి తగిలింది" అనే వ్యాఖ్యను పవన్ కళ్యాణ్ ఉపయోగించారు. ఒక ప్రాంతం పేరును అపశకునానికి, దురదృష్టానికి ప్రతీకగా వాడటం కేవలం రాజకీయ చమత్కారం కాదు. తెలంగాణ అనే పదాన్ని ప్రతికూల భావనతో ముడిపెట్టే ప్రయత్నం. ఒక రాష్ట్ర అస్తిత్వాన్ని, దాని ప్రజల స్వాభిమానాన్ని అవమానించే భాషగా చాలామంది దానిని భావించారు. ఇదే తరహాలో, కొండగట్టు ఆంజనేయస్వామి మొక్కు చెల్లింపుల నేపథ్యంలో ప్రభుత్వం కేటాయించిన నిధులపై కూడా ఆయన వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజల విశ్వాసాలు, స్థానిక ఆధ్యాత్మిక సంప్రదాయాలు, ప్రాంతీయ భావోద్వేగాలపై ఎద్దేవా ధోరణి ప్రదర్శించడం ప్రజాస్వామ్య రాజకీయాలకు తగిన విధానం కాదు. ప్రజల నమ్మకాలతో ఏకీభవించకపోవచ్చు. కానీ వాటిని హేళన చేయడం ప్రజల ఆత్మగౌరవాన్ని గాయపరుస్తుంది.

ఉమ్మడి రాజధాని హోదా ముగిసి చాలా కాలమైంది. అయినప్పటికీ హైదరాబాద్‌పై భావోద్వేగ, రాజకీయ హక్కుల చర్చను కొనసాగించాలని కోరుకునే శక్తులు ఇంకా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున హైదరాబాద్‌లో సభ నిర్వహించడం కేవలం యాదృచ్ఛిక రాజకీయ కార్యక్రమంగా కనిపించడం లేదు. "ఈ నగర రాజకీయ కథనంలో మేమూ భాగమే" అనే సంకేతాన్ని పంపే ప్రయత్నంగా దీనిని చాలామంది విశ్లేషిస్తున్నారు. తెలంగాణ అస్తిత్వవాదానికి అతిపెద్ద ప్రమాదం బాహ్య దాడి కాదు; అంతర్గత నిర్లిప్తత. ఉద్యమ కాలంలో అగ్నిలా రగిలిన సమాజం, రాష్ట్రం వచ్చిన తర్వాత సహజంగానే శాంతించింది. కానీ అదే నిశ్శబ్దాన్ని కొందరు రాజకీయ అవకాశంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ చరిత్ర, తెలంగాణ స్వాభిమానం, తెలంగాణ అస్తిత్వం పట్ల అప్రమత్తత తగ్గితేనే అలాంటి రాజకీయ సంకేతాలు బలపడతాయి.

**పవన్ కళ్యాణ్ సభ తెలంగాణ సమాజం ముందుకు ఒక ప్రశ్నను విసిరింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమ స్ఫూర్తి ఇంకా సజీవంగానే ఉందా? తెలంగాణ తన చరిత్రను, తన త్యాగాలను, తన రాజకీయ అస్తిత్వాన్ని ఇంకా అంతే జాగ్రత్తగా కాపాడుకుంటుందా? తెలంగాణ కేవలం ఒక భూభాగం కాదు. అది ఒక చరిత్ర. ఒకస్వాభిమాన ఉద్యమం. ఒక సామూహిక చేతన. ఆ చేతనను సజీవంగా ఉంచుకోవడమే నిజమైన ఆవిర్భావ దినోత్సవం. తెలంగాణను అర్థం చేసుకోవాలంటే దాని భౌగోళిక సరిహద్దులను కాదు, త్యాగాల రూపం గుర్తెరగాలి.**

# బిఆర్ఎస్ భవిష్యత్‌కు కీలక దశ

**పదవుల పంపకం కాదు...**
**పార్టీ పునర్నిర్మాణానికి చారిత్రాత్మక అవకాశం**



తెలంగాణ రాజకీయాల్లో ఒక దశాబ్దం పాటు అప్రతిహత శక్తిగా ఎదిగిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రస్తుతం తన రాజకీయ ప్రస్థానంలో అత్యంత కీలకమైన మలుపు వద్ద నిలిచింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత పార్టీ ఎదుర్కొంటున్న పరిస్థితులు కేవలం ఓటమి ప్రభావంతో పరిమితం కావడం లేదు. ప్రజల్లో విశ్వాసం తగ్గిపోవడం, కేడర్‌లో నిరుత్సాహం పెరగడం, నాయకత్వంపై ప్రశ్నలు తలెత్తడం, భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు పార్టీకి పెద్ద సవాళ్లుగా మారాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న సంస్థాగత ఎన్నికలు బీఆర్ఎస్‌కు సాధారణ అంతర్గత ప్రక్రియ కాదు. ఇవి పార్టీ భవిష్యత్తును నిర్దేశించే కీలక పరీక్ష. గ్రామ కమిటీ నుంచి రాష్ట్ర కమిటీ వరకు కొత్త నాయకత్వాన్ని ఎంపిక చేసే ఈ ప్రక్రియను బీఆర్ఎస్ ఎంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తుందన్న దానిపైనే రాబోయే రోజుల్లో పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, రైతు రుణమాఫీ, ఉద్యోగ నియామకాలు, సంక్షేమ పథకాల అమలు, పరిపాలనా వేగం వంటి అంశాలపై ప్రజల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, యువతలో పెరుగుతున్న నిరుద్యోగ ఆందోళన, మహిళల్లో హామీల అమలుపై ఉన్న అనుమానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సాధారణ రాజకీయ సూత్రం ప్రకారం అధికార పార్టీపై వ్యతిరేకత పెరిగితే ప్రధాన ప్రతిపక్షానికి లాభం కలగాలి. కానీ తెలంగాణలో ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. కాంగ్రెస్‌పై కొంత అసంతృప్తి ఉన్నప్పటికీ, ప్రజలు బీఆర్ఎస్ వైపు పెద్దఎత్తున మొగ్గు చూపడం లేదు. ఇదే బీఆర్ఎస్ నాయకత్వం అత్యంత లోతుగా ఆలోచించాల్సిన అంశం.

ఎందుకు ప్రజలు తిరిగి బీఆర్ఎస్‌ను నమ్మడం లేదు? ఈ ప్రశ్నకు సమాధానం వెతకకుండా భవిష్యత్తు రాజకీయ వ్యూహాలు ఫలించవు. అధికారాన్ని కోల్పోయిన తర్వాత ప్రజల్లోకి వెళ్లి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఆ దిశగా పార్టీ నుంచి పెద్దగా ప్రయత్నాలు కనిపించలేదు. ఎన్నికల ఓటమికి గల కారణాలను క్షేత్రస్థాయిలో విశ్లేషించడం, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం, కేడర్‌ను మళ్లీ చైతన్యవంతం చేయడం వంటి చర్యలు ఆశించిన స్థాయిలో జరగలేదు. బీఆర్ఎస్ పాలన చివరి దశలో ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తికి ప్రధాన కారణాల్లో ఒకటి అధికార అహంకారం అనే భావన. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన నాయకత్వం క్రమంగా ప్రజలకు దూరమైందనే అభిప్రాయం బలపడింది. గ్రామస్థాయి కార్యకర్తల కంటే కొద్దిమంది ప్రభావశీల నాయకులకే ప్రాధాన్యం పెరిగిందనే విమర్శలు వచ్చాయి. విమర్శలను స్వీకరించే సంస్కృతి తగ్గిపోయిందనే భావన కూడా ప్రజల్లో ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో ప్రజలు సంక్షేమ పథకాలను మాత్రమే చూడరు. నాయకత్వం వ్యవహరించే తీరు, వినయం, స్పందన కూడా ముఖ్యమే. ఆ అంశాల్లో ఏర్పడిన లోపాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపాయి. తెలంగాణ ఉద్యమ కాలంలో బీఆర్ఎస్ కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు. అది కోట్లాది మంది ప్రజల భావోద్వేగం. తెలంగాణ రాష్ట్ర సాధన అనే మహోన్నత లక్ష్యం చుట్టూ పార్టీ ప్రజలను ఏకం చేసింది. ఉద్యమం ద్వారా వచ్చిన శక్తి పార్టీకి అపారమైన రాజకీయ బలాన్ని ఇచ్చింది. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించడంలో పార్టీ విఫలమైందనే విమర్శలు వచ్చాయి. ప్రజా సమస్యలపై ఉద్యమించే పార్టీ నుంచి పరిపాలన నిర్వహించే అధికార పార్టీగా మారిన తర్వాత ఉద్యమ భావజాలం క్రమంగా బలహీనపడింది.

ఇప్పటికీ తెలంగాణ ప్రజలు తమ సమస్యలపై పోరాడే ప్రతిపక్షాన్ని కోరుకుంటున్నారు. రైతు సమస్యలు, నిరుద్యోగం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై ప్రజలతో కలిసి నిలబడే నాయకత్వం కోసం ఎదురుచూస్తున్నారు. కానీ బీఆర్ఎస్ ఆ పాత్రను పూర్తిస్థాయిలో పోషించలేకపోతోందనే అభిప్రాయం ఉంది.

పార్టీపై ఉన్న మరో ప్రధాన విమర్శ కుటుంబ ఆధారిత రాజకీయాల అంశం. నిర్ణయాలు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయనే భావన ప్రజల్లోనే కాకుండా పార్టీలో కూడా పెరిగింది. జిల్లా స్థాయి నాయకత్వానికి తగిన స్వేచ్ఛ లేకపోవడం, కొత్త నాయకులు ఎదగడానికి అవకాశాలు పరిమితంగా ఉండటం వల్ల యువతలో నిరుత్సాహం పెరిగింది. ఒక రాజకీయ పార్టీ నిరంతరం బలంగా ఉండాలంటే కొత్త తరం నాయకత్వాన్ని తయారు చేయాలి. కానీ ఆ ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగలేదనే విమర్శలు ఉన్నాయి.

ఈ పరిస్థితుల్లో జరుగుతున్న సంస్థాగత ఎన్నికలు బీఆర్ఎస్‌కు కొత్త అవకాశాన్ని అందిస్తున్నాయి. ఈ ఎన్నికలు కేవలం పదవుల పంపకం కోసం కాకుండా పార్టీ పునర్నిర్మాణానికి వేదిక కావాలి. గ్రామ కమిటీల నుంచి రాష్ట్ర కమిటీ వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో నాయకత్వాన్ని ఎంపిక చేయాలి. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకుల కంటే క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేసిన వారిని గుర్తించాలి.

ప్రత్యేకంగా యువతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో యువత ప్రధాన రాజకీయ శక్తిగా మారుతోంది. ఉద్యోగాలు, పోటీ పరీక్షలు, భవిష్యత్తు అవకాశాలపై యువతలో తీవ్ర ఆందోళన ఉంది. ఈ వర్గాన్ని ఆకర్షించాలంటే యువ నాయకత్వాన్ని ముందుకు తేవాలి. సోషల్ మీడియా ప్రచారంతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసే యువ నేతలను ప్రోత్సహించాలి.

అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు పార్టీ నిర్మాణంలో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి. కేవలం పదవులు ఇవ్వడం సరిపోదు. నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించాలి. తెలంగాణ సామాజిక వాస్తవాలను ప్రతిబింబించేలా పార్టీ నిర్మాణం ఉండాలి. ఇది రాజకీయ అవసరమే కాకుండా సామాజిక న్యాయం కూడా.


కేడర్‌ను మళ్లీ చైతన్యవంతం చేయడం మరో ప్రధాన బాధ్యత. ప్రస్తుతం గ్రామస్థాయిలో అనేక మంది కార్యకర్తలు నిరుత్సాహంలో ఉన్నారు. పార్టీ భవిష్యత్తుపై వారికి నమ్మకం కల్పించాలి. పార్టీ కోసం పనిచేస్తే గుర్తింపు ఉంటుందనే విశ్వాసాన్ని పెంచాలి. కేడర్ బలపడితేనే పార్టీ బలపడుతుంది.

భవిష్యత్తులో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం చేయాల్సిందే. ప్రెస్‌మీట్లు, సోషల్ మీడియా పోస్టులు, అసెంబ్లీ ప్రసంగాలు మాత్రమే సరిపోవు. రైతు సమస్యలపై దీక్షలు, నిరుద్యోగుల కోసం ఉద్యమాలు, మహిళా సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటనలు, విద్యార్థి అంశాలపై ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించాలి. ప్రజల్లో ఉండే ప్రతిపక్షంగా మారాలి.

అంతేకాకుండా "మేమే తిరిగి అధికారంలోకి వస్తాం" అనే ధోరణిని విడనాడాలి. ప్రజలు ఇప్పుడు మరింత చైతన్యవంతంగా ఉన్నారు. గత విజయాలు భవిష్యత్తు విజయాలకు హామీ కావు. ప్రజల విశ్వాసం మళ్లీ పొందాలంటే వినయం అవసరం. తప్పులు జరిగితే అంగీకరించే ధైర్యం ఉండాలి. వాటిని సరిదిద్దుకునే సంకల్పం చూపాలి.

స్థానిక నాయకత్వానికి స్వేచ్ఛ ఇవ్వడం కూడా అత్యంత అవసరం. ప్రతి జిల్లా రాజకీయ పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయి. స్థానిక నాయకులు పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించాలి. అన్ని నిర్ణయాలు ఒకే కేంద్రం నుంచి రావడం వల్ల కిందస్థాయి నాయకత్వం బలహీనపడుతుంది. ఇక పార్టీకి కొత్త రాజకీయ కథనం అవసరం. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్ర సాధన బీఆర్ఎస్ ప్రధాన కథనం. ఇప్పుడు కొత్త తరం అవసరాలకు అనుగుణంగా ఉద్యోగ తెలంగాణ, రైతు భద్రత, యువత భవిష్యత్తు, పరిశ్రమల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం వంటి అంశాలపై స్పష్టమైన విజన్‌ను ప్రజల ముందుంచాలి.

చివరగా చెప్పాలంటే, తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ పూర్తిగా ముగిసిపోయిన శక్తి కాదు. ఇంకా పార్టీకి బలమైన సామాజిక, రాజకీయ పునాది ఉంది. కానీ ప్రజలు ఇప్పుడు కేవలం గతాన్ని గుర్తుచేసుకుని ఓటేయరు. మార్పు కనిపిస్తేనే మరో అవకాశం ఇస్తారు. ప్రస్తుతం జరుగుతున్న సంస్థాగత ఎన్నికలు బీఆర్ఎస్‌కు చివరి హెచ్చరికతో పాటు చివరి అవకాశంగా కూడా నిలిచాయి. ఇవి పదవుల పంపకానికి పరిమితం కాకుండా పార్టీ పునర్నిర్మాణానికి, ఆత్మపరిశీలనకు, కొత్త దిశా నిర్దేశానికి వేదికగా మారితేనే బీఆర్ఎస్ భవిష్యత్తులో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా నిలబడగలదు. లేదంటే తెలంగాణ రాజకీయాల్లో తన స్థానాన్ని క్రమంగా కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే ముందు పార్టీ తనను తాను మార్చుకోవాల్సిందే.



జి. మధు గౌడ్
ఎం.ఏ, ఎం.సి.జె (జర్నలిస్ట్)
మొబైల్ : 9533551188

## అమరులకు జోహార్లు

పల్లవి:
ఎన్నెన్ని ఎన్నెన్ని ఉద్యమ ఘట్టాలు
ఎన్నెన్ని ఎన్నెన్ని ప్రాణ త్యాగాలు (2)
పుట్టి పెరిగిన గడ్డ మీద వలసవాదుల
ఆధిపత్యం సహించని ప్రతి మట్టిబిడ్డ చేసెనయ్యో
పోరుగానం
||ఎన్నెన్ని - త్యాగాలు||

చరణం 1:
ధూందాం పాటలే ఉద్యమ పాఠాలు
సాంస్కృతిక ఆటలే జాగృతికి మార్గాలు (2)
నిరసనోద్యమ నిప్పులే పాలకుల పై చల్లిరే
మానుకోట రాళ్ళయి మండి ఎగిసి పడితిరే
కాళరాత్రులనే కాలదన్ని
వేగుచుక్కలుగా మారిపోయి (2)
వెలుగు దివ్వెలనే పూయించిరే
||ఎన్నెన్ని - పోరుగానం||

చరణం 2:
లాఠీలు, తూటాలు, భాష్పవాయువులు
ముళ్ళకంచెలు, బారికేడ్లు, సంకెళ్ళు (2)
ముప్పుతిప్పలు పెట్టినా మడమ తిప్పని వీరులు
నెత్తుటేరులు పారినా జడుసుకోని ధీరులు
అస్తిత్వ పోరు సలిపినారే
అమరులయ్యి నిలిచినారే (2)
అంతిమ విజయాన్ని చాటినారే
జోహార్లు జోహార్లు ఆ అమరవీరులకు
జోహార్లు జోహార్లు త్యాగమూర్తులకు (2)

కార్తీక రాజు,
హనుమకొండ జిల్లా, 8977336447

## మేమున్నాం!

అచ్చం సూద్రులకు
రాజ్యాధికారం
సాధ్యం కానివ్వం!
ఈ దేశం ఎప్పుడూ
మా అదుపాజ్ఞల్లో
ఉండటం ఖాయం!
చాతుర్వర్ణాలతో
ఎప్పుడో
మిమ్మల్నితొక్కేసాం!
మేం ఆర్యులం!
భూమార్గంగుండా
ఈ దేశం వచ్చాం!
ఆర్య ద్రావిడ
యుద్దాలు చేసి
విజేతలమయ్యాం!
ఇప్పటికీ
మేమే
విజేతలం!
ఎస్సీ ఎస్టీ బిసీ
వర్గాలకు
రాజ్యాధికారమా?
ఇలాంటిరోజు
రాకూడదనే విద్యా
హీనుల్ని చేసాం!
ముస్లింలు
క్రిస్టియన్లు వచ్చి
కలుపుకున్నారు!
చదువులు చెప్పి
మీకు బుద్ధిజ్ఞానం
నేర్పారు!
నాడు జరిగిన
తప్పును
నేడు సరిచేస్తాం!
'మానవులంతా
ఒక్కటే 'సిద్ధాంతం
పచ్చి అబద్ధం!
యజ్ఞాలుయాగాలు
పూజలు వ్రతాలు
మీపాపపరిహారాలు!
మేం రాజగురువుల
స్థానాల్లో కూర్చుని
దేశాన్ని పాలిస్తాం!
బి సి ల గణన!
రాజ్యాధికారం!
ఈ లొల్లి మానండి!
కూటికోసం కోటి
ముష్టి విద్యలు!
అడుక్కుతినండి!
అజ్ఞానానికి మించిన
హాయి లేదు!
అలా బతికేయండి!
'ఓటు' కూడా వద్దు!
'దొంగఓటు'తో
అధికారం మాదే!
పైన దేవుడు
క్రింద మేము
మీకుభయంలేదు

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# "బీజేపీ పాలనలో నేరస్థులు - భారత్‌లో వాషింగ్ మెషిన్ సంస్కృతి"



2014 తర్వాత భారతదేశంలో కేవలం ప్రభుత్వం మాత్రమే మార లేదు. "నేరం" అనే పదానికి రాజకీయ అర్థం కూడా పూర్తిగా మారిపోయిందన్న విమర్శ ఇప్పుడు దేశవ్యాప్తంగా వినిపిస్తోంది. ఒకప్పుడు అవినీతి పరులు, ఆర్థిక నేరస్థులు, మైనింగ్ మాఫియా, చిట్‌ఫండ్ కుంభకోణాల సూత్రధారులు, హత్య-అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు రాజకీయ నాయకులు... భారతీయ జనతా పార్టీలో చేరిన వెంటనే వాషింగ్ మెషీన్‌లో "శుద్ధి" చెంది పవిత్రులుగా మారిపోతున్నారన్న ఆరోపణలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎన్నడూ లేనంత తీవ్రంగా చర్చకు వచ్చాయి. ప్రతిపక్షంలో ఉన్నంతకాలం ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్, ఎన్ఐఏ, యూఏపీఏ కేసులతో వెంటాడి, అధికార పక్షానికి లంచాలు, చందాల రూపంలో, ఎన్నికల బాండ్ల పేరుతో దాసోహం అన్న వెంటనే కేసులు చల్లబడటం లేదా పూర్తిగా కనుమరుగవడం ప్రజల ముందే జరుగుతున్న రాజకీయ నాటకంగా మారిపోయింది. ఈ విషయంలో భారత్ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా సుమోటోగా కేసులు నమోదు చేసి విచారణ చేసే అధికారం ఉండికుండా చేష్టలుడిగి చోద్యం చూస్తుంది. పరోక్షంగా ఎవరికి సహకరిస్తున్నట్లు? ప్రజలు మౌనంగా ఉన్నా...ప్రధాన మీడియాలో చర్చ జరగకున్నా...అన్ని విషయాలను సమగ్రంగా అర్థం చేసుకుంటున్నారు.

దేశంలో ఇప్పుడు ఒక కొత్త రాజకీయ సామెత పుట్టింది – "బీజేపీ వాషింగ్ మెషిన్". అంటే అవినీతి ఆరోపణలతో ఉన్న నేతలు బీజేపీలో చేరగానే అతనిపై ఉన్న మచ్చలు మాసిపోతాయి. ఈ విమర్శను ప్రతిపక్షాలే కాదు, పలువురు మాజీ న్యాయమూర్తులు, జర్నలిస్టులు, అంతర్జాతీయ మీడియా సంస్థలు కూడా ప్రస్తావించాయి. అమెరికా పత్రిక "వాషింగ్టన్ పోస్ట్", బ్రిటన్‌కు చెందిన "బీబీసీ", "ది గార్డియన్", "అల్ జజీరా", "ది ఎకనమిస్ట్" వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు భారత దర్యాప్తు సంస్థల రాజకీయ వినియోగంపై పలు కథనాలు ప్రచురించాయి. "ప్రజాస్వామ్యంలో విచారణ సంస్థలు అధికార పార్టీకి రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయా?" అన్న ప్రశ్న ప్రపంచస్థాయిలో చర్చకు వచ్చింది.

మహారాష్ట్రలో అజిత్ పవార్‌పై వేల కోట్ల రూపాయల కోఆపరేటివ్ బ్యాంక్ కుంభకోణం కేసులు నమోదయ్యాయి. ఈడీ దాడులు, విచారణలు, మీడియా లీకులు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. కానీ రాజకీయ సమీకరణాలు మారి ఆయన బీజేపీతో చేతులు కలిపిన తర్వాత కేసుల వేడి ఒక్కసారిగా తగ్గిపోయిందన్న విమర్శలు వచ్చాయి. ఇదే రాష్ట్రంలో నారాయణ్ రాణే, భావనా గవ్లీ వంటి నేతలపై కూడా దర్యాప్తు సంస్థల చర్యలు రాజకీయ ఒత్తిడికి అనుగుణంగా మారుతున్నాయన్న ఆరోపణలు వచ్చాయి.

అస్సాంలో హిమంత బిశ్వ శర్మ కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు శారదా చిట్‌ఫండ్ కేసులో ఆయన పేరు వినిపించింది. బీజేపీలో చేరిన తర్వాత ఆ కేసు రాజకీయంగా కనిపించకుండా పోయిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి, ముకుల్ రాయ్, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన పలువురు నేతలు బీజేపీలో చేరిన తర్వాత వారి మీద ఉన్న విచారణలు చల్లబడటం "రాజకీయ పునర్జన్మ"లా మారింది.

కర్ణాటకలో గాలి జనార్దన్ రెడ్డి పేరు అక్రమ గనుల దోపిడీకి చిహ్నంగా మారింది. సుప్రీంకోర్టు నియమించిన కమిటీలు వేల కోట్ల నష్టం జరిగిందని పేర్కొన్నాయి. అయినప్పటికీ, ఆయన రాజకీయ ప్రభావం తగ్గలేదు. ఇదే రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పపై భూకుంభకోణాలు, అవినీతి ఆరోపణలు వచ్చినా రాజకీయ పరిరక్షణ వల్ల ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కుర్చీ అధిరోహించగలిగారు.

ఇక ఆర్థిక నేరాల విషయానికి వస్తే దేశ ప్రజల డబ్బు దోచుకొని విదేశాలకు పారిపోయిన నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా వంటి వ్యక్తులు భారత బ్యాంకింగ్ వ్యవస్థను కుదేలు చేశారు. లక్షల కోట్ల రూపాయల నిరర్థక ఆస్తుల భారాన్ని సాధారణ ప్రజలపై మోపి, కార్పొరేట్ నేరస్థులు విదేశీ విలాస జీవితాలు గడపడం దేశ ఆర్థిక వ్యవస్థకు అవమానకర ఘట్టంగా మారింది. "దేశభక్తి" పేరుతో రాజకీయ ప్రచారం చేసిన పాలకులు ఈ స్థాయి ఆర్థిక నేరాలను ఎందుకు అడ్డుకోలేకపోయారన్న ప్రశ్నకు ఇంకా సమాధానం లేదు.

అదానీ గ్రూప్‌పై అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ చేసిన ఆరోపణలు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. షేర్ మార్కెట్ మోసాలు, షెల్ కంపెనీలు, విదేశీ అక్రమ పెట్టుబడులపై వచ్చిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా పార్లమెంటులో చర్చనే తప్పించుకుందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. భారత ప్రభుత్వానికి, కార్పొరేట్ దిగ్గజాలకు మధ్య ఉన్న సాన్నిహిత్యం ప్రజాస్వామ్యాన్ని "కార్పొరేట్ రాజ్యం"గా మారుస్తోందని విమర్శలు వచ్చాయి.

దర్యాప్తు సంస్థల ఎంపిక చేసిన దాడుల జాబితా కూడా చిన్నది కాదు. ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ, శివసేన నేత సంజయ్ రౌత్ – వీరిపై ఈడీ, సీబీఐ దాడులు పెద్ద ఎత్తున జరిగాయి. మీడియా ముందే వారిని "అవినీతి చిహ్నాలు"గా చూపించిన తర్వాత, కోర్టుల్లో విచారణలు సాగినపుడు సాక్ష్యాల బలహీనత బయటపడిన సందర్భాలు అనేకం. సుప్రీంకోర్టు కొన్ని సందర్భాల్లో ఈడీ అధికార దుర్వినియోగంపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అయినప్పటికీ, విచారణ సంస్థల రాజకీయ వినియోగంపై కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ఆత్మపరిశీలన చేయలేదు.ఆ దర్యాప్తు సంస్థలు కూడా తమ లోపాలను సరిదిద్దుకోలేదు.

ఇంకా భయంకరమైన విషయం ఏమిటంటే – ఉగ్రవాదం, కుట్ర కేసుల పేరుతో అమాయకులను జైళ్లలో కుళ్లబెట్టడం. కేవలం మతం ఆధారంగా ముస్లిం యువకులపై పేలుళ్ల కేసులు మోపి 10-15 సంవత్సరాల తర్వాత "సాక్ష్యాలు లేవు" అంటూ కోర్టులు విడుదల చేసిన ఉదాహరణలు భారత న్యాయవ్యవస్థ చరిత్రలో మచ్చలుగా మిగిలాయి. వారి జీవితాలు, కుటుంబాలు, భవిష్యత్తు నాశనం అయిన తర్వాత "నిర్దోషి" అన్న తీర్పు ఎలాంటి న్యాయం చేస్తుంది? భీమా కోరేగావ్ కేసులో రచయితలు, మేధావులు, కార్యకర్తలు విచారణ పూర్తికాకుండానే సంవత్సరాల తరబడి జైళ్లలో ఉండాల్సి వచ్చింది. 84 ఏళ్ల స్టాన్ స్వామి జైలులోనే మరణించడం ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల సంస్థలను కుదిపేసింది. బీజేపీకి దగ్గరగా ఉన్న బాబాలు, మత గురువుల వ్యవహారాలు కూడా దేశంలో చట్టవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీశాయి. గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌పై అత్యాచారం, హత్య కేసుల్లో శిక్ష పడినా ఎన్నికల సమయంలో వరుస పరోళ్లు రావడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఆసారాం బాపూ కేసులో కూడా అనుచర వర్గం రాజకీయ ప్రభావం చూపిందన్న ఆరోపణలు వచ్చాయి.

నిత్యానంద దేశం విడిచి పారిపోయినా అతని సామ్రాజ్యం కొనసాగడం విచిత్రంగా మారింది. "బాబా రాజకీ యాలు" ఇప్పుడు ఓటు బ్యాంకు రాజకీయాలుగా మారిపోయాయి. గుజరాత్ అల్లర్లకు సంబంధించిన బిల్కిస్ బానో కేసు భారత దేశ చరిత్రలో అత్యంత బాధాకర ఘట్టాల్లో ఒకటి. సామూహిక అత్యాచారం, చిన్నారుల హత్యల వంటి ఘోర నేరాల్లో శిక్షపడిన దోషులను ముందస్తుగా విడుదల చేసి, వారిని పూలమాలలతో స్వాగతించడం దేశ నైతిక విలువలకు అవమానంగా నిలిచింది. తర్వాత సుప్రీంకోర్టు ఆ విడుదలను రద్దు చేసినప్పటికీ, అప్పటికే ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్ఠ దెబ్బతింది.ఇంకోవైపు ప్రభుత్వాన్ని విమర్శించిన జర్నలిస్టులు, యూట్యూబర్లు, విద్యార్థులు, కార్యకర్తలపై దేశద్రోహం, యూఏపీఏ వంటి కఠిన చట్టాలు ప్రయోగించబడ్డాయి. కానీ ద్వేష ప్రసంగాలు చేసిన పలువురు పాలకపక్ష నేతలపై చర్యలు తీసుకోవడంలో విచిత్రమైన మౌనం కనిపించింది. "చట్టం అందరికీ సమానమా? లేక అధికారానికి దగ్గరగా ఉన్నవారికి ప్రత్యేక రక్షణ ఉందా?" అన్న ప్రశ్న దేశ ప్రజల మనస్సుల్లో బలంగా నిలిచిపోయింది. ఈ పరిస్థితి కేవలం ఒక (బీజేపీ) పార్టీకి మాత్రమే సంబంధించినదే కాదు. భారత ప్రజాస్వామ్య భవిష్యత్తుకు సంబంధించినది. విచారణ సంస్థలు ప్రభుత్వానికి సేవకులుగా మారితే రాజ్యాంగం బలహీనపడుతుంది. న్యాయం ఆలస్యం కావడం మాత్రమే కాదు, న్యాయం రాజకీయ బందీగా మారుతుంది. ఒకప్పు డు "దేశద్రోహి", "అవినీతిపరుడు" అని పిలిచిన వ్యక్తి బీజేపీలో చేరగానే "దేశభక్తుడు" అవుతుంటే ప్రజలు చట్టాన్ని ఎలా నమ్మాలి? ఇదే ప్రశ్న ఇప్పుడు దేశాన్ని వెంటాడుతోంది.

ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికలతో మాత్రమే బతకదు. రాజ్యాంగ వ్యవస్థల, సంస్థల స్వేచ్ఛా, స్వతంత్రాలతో బతుకుతుంది. కానీ దర్యాప్తు సంస్థలు అధికార పార్టీకి అనుకూలంగా రాజకీయాలకు కత్తులుగా మారితే ప్రజాస్వామ్యం బయటకు జీవించి ఉన్నట్టు కనిపించినా, లోపల నెమ్మదిగా కుళ్లిపోతుంది. నేడు భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రమాదం ఇదే.

చివరకు మన దేశంలో పరిస్థితులు చూస్తుంటే, ఆందోళనకరంగా ఉంది. దేశం స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీని, జవహర్లాల్ నెహ్రూ లాంటి దిగ్గజ నేతలను సైతం అడుగడుగునా బీజేపీ శ్రేణులు అవమానిస్తున్నాయి. వాళ్ళను దారుణంగా హత్యలు చేసిన వారిని సన్మానించి పూజిస్తున్నారు. అత్యాచారానికి గురైన మహిళలకు అండగా ఉండకుండా...ఆత్యాచారం చేసిన నేరస్థులను బీజేపీ వాళ్ళు హారతులు పట్టి స్వాగత సత్కారాలు చేస్తున్నారు. రేపులు చేసిన రాజకీయ నాయకులు, బాబాలను జేళ్ళలో పెట్టకుండా న్యాయస్థానాలు పెరోల్ ఇస్తే వారు దేశ భక్తులవలే బయట ఊరేగుతున్నారు. ఇవి అన్నీ చూస్తూ ఉంటే ... అంతర్జాతీయ సమాజం ముందు మనం దేశం నాగరిక సమాజమేనా అని ఈ దేశ పౌరులు సిగ్గుతో తల దించుకోవాల్సి వస్తుంది. ఈ ప్రశ్నలు దేశ , విదేశాల్లో జర్నలిస్టులు ప్రశ్నిస్తారు అనే భయంతోనే మోదీ మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వకుండా, పార్లమెంటులో విపక్షాల నేతల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకొని తిరుగుతుంటారు అనే ముద్ర పడిపోయింది. ఇది నేటి భారత దేశ చరిత్రలో నెలకొన్న చీకటి పరిస్థితి. అంతర్జాతీ యంగా మోదీ హయాంలో మన దేశం పరువు, ప్రతిష్టలకు కళంకం చేకూరిందా? వెలిగిపోతుంది ఆ !?.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.




## ఫలించిన తెలంగాణం

సొంత పరిపాలనకై ఆరాటం
చేతులు కలిపి మన పోరాటం
తొలిదశలో మొదలైన యుద్ధం
మలిదశలో అయ్యింది ఉధృతం
నీళ్ళు నిధులు నియామకాల నినాదం
ఉద్యమానికి ఊపిరినందించింది నిజం
ఆరువందల పది జి.ఓ.కైన అన్యాయం
ఎంత మొత్తుకున్నా జరగని న్యాయం
ఉద్యోగుల ఉవ్వెత్తు నిరసనలు
పోలీసులతో విద్యార్థి యుద్దాలు
హోరెత్తిన పలు ప్రజాసంఘాలు
పన్నెండు వందల బలి దానాలు
ఆశ నిరాశల మధ్య ఊగిసలాట
అంతులేకుండా సాగిన పోరుబాట
రాజకీయ పార్టీల మధ్య రభసలు
వేదికలపై వేడెక్కించిన ప్రసంగాలు
మనుషుల మధ్యన విభేదాలు
ఒకరిపై ఒకరికి అపనమ్మకాలు
ప్రత్యేక, సమైక్యతా నినాదాలు
రగిలించిన అభద్రతా భావాలు
సమాజమంతా ఒక్కటై కదిలింది
సకలజనుల సమ్మెకు దారి తీసింది
రాజధాని ఢిల్లీకి తగిలింది వేడి సెగ
అరవై ఏళ్ల నిరీక్షణకు పడింది తెర
ఇరవై తొమ్మిదవ రాష్ట్రానికి అంకురార్పణం
తెలంగాణ రూపంలో అయ్యింది ఆవిర్భావం
రెండు తెలుగు రాష్ట్రాలుంటే తప్పేంటి మరి
భారత దేశపు బౌండరీలోనేగా ఉండిపోతిమి
ప్రాంతాల మధ్య కనపడని గీత ఒకటి
విడదీయునా తెలుగు హృదయాలను
పరిపాలన వేరు వేరుగా ఉంటే ఏమిటి
ఆపేనా కలవకుండా అన్నాదమ్ములను

**Dr. Ravi Shankar Prajapathi**
Professor & HOD, ENT Dept
Vice-Principal, GMC-Medak

# రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపద ప్రజలందరికీ పంపిణీ జరగాలి

- చీఫ్ విప్, తెలంగాణ శాసనమండలి పట్నం మహేందర్



**వనపర్తి బ్యూరో, జూన్ 2 (జనంసాక్షి) :** రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా ప్రజలందరికీ పంపిణీ జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తూ, సకలజనుల సంక్షేమానికి పాటుపడుతున్నదని చీఫ్ విప్, తెలంగాణ శాసనమండలి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. జూన్ 2, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వనపర్తి జిల్లాలోని ఐ.డి.ఓ.సి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ వేడుకలకు పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అంతకుముందు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యఅతిథి పోలీస్ శాఖ ద్వారా ఇచ్చిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాల పై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా ప్రజలందరికీ పంపిణీ జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తూ, సకలజనుల సంక్షేమానికి పాటుపడుతున్నదన్నారు. ప్రణాళికాబద్దమైన విధానాలు, ఆర్థిక క్రమ శిక్షణ, అందరి సహకారంతో అన్ని రంగాలలో ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. మన రాజ్యాంగంలో పొందుపర్చినట్లు మన తెలంగాణ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో 6 గ్యారెంటీలను ప్రకటించడం జరిగింది. ఆ దిశగా ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలను అమలుపరుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల చిన్నారుల ద్వారా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా పర్యావరణ అవగాహన లో ప్రతిభ చాటిన వనపర్తి జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్, కొత్తకోట జడ్పీహెచ్ఎస్ బాలికల, పెబ్బేరు కేజీబీవీ పాఠశాలలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి మున్సిపాలిటీ ఛైర్పర్సన్ మాధవి, జిల్లా అధికారులు, వనపర్తి మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు



**పెద్దశంకరంపేట, జూన్ 2 (జనం సాక్షి) :** పెద్దశంకరపేటలో మంగళవారం నాడు వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలను మన రైతు నేస్తం, రైతు మిత్ర తనిఖీ చేయడం జరిగింది. దీనిలో భాగంగా నూతనంగా వచ్చినటువంటి తహసిల్దార్ నారాయణ, మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు చేయడం జరిగింది. దీనిలో భాగంగా మండల తాసిల్దార్ మాట్లాడుతూ ఎరువులు సకాలంలో రైతులకు అందించాలి అని అదేవిధంగా నకిలీ విత్తనాలను అమ్మితే చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వివరించడం జరిగింది. అదేవిధంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈపాస్ మెషిన్ లో ఎరువులు ఎప్పటికప్పుడు క్లియర్ చేసు కోవాలని, స్టాక్ బోర్డ్ లో వివరాలు ఎప్పటికప్పుడు పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటి విద్యార్థులకు అభినందనల వెల్లువ

- నలుగురు విద్యార్థులకు నగదు అందజేత



**న్యాల్‌కల్, జూన్ 2 (జనం సాక్షి) :** రాష్ట్రస్థాయి ఐఐఐటీలో ప్రతిభ చాటిన పలువురు విద్యార్థులకు అభినందనలను తెలుపుతూ కొంత నగదును అందజేస్తూ ప్రోత్సహాన్ని అందించారు పలువురు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు. మండలంలోని రేజింతల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పవిత్ర, భార్గవి, అబ్బు, అక్షరలు అదిలాబాద్ జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉమారాణి అరవింద్ రెడ్డి ఎంపికైన నలుగురు విద్యార్థులకు రూ:5000 చొప్పున నగదును అందజేశారు. మహీంద్రా అండ్ మహీంద్రా కర్మాగారం మేనేజర్ ఎంపికైన నలుగురు విద్యార్థులకు రూ:2000 చొప్పున నగదును అందజేశారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల అభినందిస్తూ, సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుర్నాథ్, ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, జయసింగ్ కృష్ణ, నరేందర్, సరిత, పాఠశాల చైర్మన్ రామేశ్వరి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ నేతలకు ఘన సన్మానం



**నారాయణపేట, జూన్ 2 (జనం సాక్షి) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు సకల జనుల సమ్మెలో నిరంతరం పోరాడిన తెలంగాణ ఉద్యమ నాయకులు నాగురావు నామజీ ,ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజులను వేరు వేరుగా మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సంద ర్భంగా ఎస్పి బాలసుబ్ర హ్మణ్యం అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువ జ్ఞాపికతో ఘనంగా సన్మానిం చారు. మిఠాయిలు పంపిణి చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తు ఎందరో వీరుల త్యాగం ఫలంతో కవు లు కళకారులు పాత్రికేయు లు ప్రతి ఒక్కరి సమిష్టి కృషి వల్లనే జాతి కుల మత బేధం లేకుండా ఉద్యమం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామనిఅన్నారు. ఈకార్యక్రమంలో మత్స్య శాఖ జిల్లా అధ్యక్షులు కాంత్ కుమార్ మాజీ కౌన్స్ లర్ మారుతి సంగనర్సింహులు వసంత్ కిరణ్ డగె జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

- గుడ్డేందొడ్డి రిజర్వాయర్ వద్ద హెలీప్యాడ్ ఏర్పాట్లు



**గద్వాల నడిగడ్డ, జూన్ 2 (జనం సాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 4న పర్యటిస్తున్న గుడ్డేందొడ్డి రిజర్వాయర్ వద్ద అవసరమైన ఏర్పాట్లన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈనెల 4న సీఎం రేవంత్ రెడ్డి ధరూరు మండలంలోని గుడ్డేందొడ్డి రిజర్వాయర్ పరిశీలించడానికి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి గుడ్డేందొడ్డి రిజర్వాయర్ వద్ద హెలిపాడ్ నిర్మాణం, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెలిపాడ్ నుంచి పంపు హౌస్ కు వెళ్లే దారిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీస్ బందోబస్తు నియమించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి సమగ్ర వివరాలతో ఫోటో ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. హెలిపాడ్ పరిసర ప్రాంతాలు, ఫోటో ఎగ్జిబిషన్ స్థలంను చదును చేయించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బారికేడ్లతో పాటు ఇతర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో అదనపు ఎస్పి శంకర్,ఆర్డీవో శ్రీనివాసరావు డిఎస్పి మొగిలయ్య,ఇరిగేషన్ ఎస్సీ రహీముద్దీన్, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులున్నారు.

## జర్నలిస్టులకు హెల్త్, ఇన్సూరెన్స్ పాలసీ పత్రాల పంపిణీ



**నారాయణపేట జిల్లా బ్యూరో జూన్ 2 (జనం సాక్షి) :** నారాయణపేట నియోజకవర్గ లో ఉన్నటువంటి జర్నలిస్టులకు 30 లక్షల విలువగల హెల్త్, యాక్సిడెంట్ పాలసీ పత్రాలను బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం బి ఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో అర్హులైన నియోజకవర్గ జర్నలిస్టులకు ఆరోగ్యం మరియు ప్రమాద పాలసీ పంపిణీ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి పత్రిక విలేకరులు నిరంతరం తమ యొక్క వృత్తిరీత్యా ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే పత్రిక విలేకరులకు ఎలాంటి ఆరోగ్యము మరియు ప్రమాద బీమా సౌకర్యం లేకపోవడం వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా చితికి పోవడం పత్రిక విలేకరులను ప్రభుత్వాలు పట్టించకపోవడం వల్లనే తన సొంత ఆలోచనతో పత్రికా విలేకరులకు సంవత్సరానికి మూడు వేల చొప్పున ఆరోగ్యం మరియు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని పత్రికా విలేకరుల కుటుంబాల్లో ప్రమాదవశత్తు ఏదైనా జరిగిన వారికి 15 లక్షల వరకు ఇన్సూరెన్స్ పాలసీ వర్తిస్తుందని ఆయన అన్నారు నియోజకవర్గంలో ఉన్నటువంటి జర్నలిస్టులకు హెల్త్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతో టిఆర్ఎస్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డికి పలువురు జర్నలిస్టులు సంఘాల నాయకులు ఐజేయు జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి,టి యు డబ్ల్యు జే (హెచ్ 143) జిల్లా అధ్యక్షులు కలల్ ఆనంద్ కుమార్ గౌడ్, వారధి నవీన్ కుమార్, ఎస్ రాజేందర్ రెడ్డి కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు విజయ సాగర్ సుదర్శన్ రెడ్డి మాజీ ఎంపీపీ అమ్మ కొల్ల శ్రీనివాస్ రెడ్డి కౌన్సిలర్లు భరత్, నారాయణమ్మ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి బుల్లెట్ రాజు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**పెద్దశంకరంపేట, జూన్ 2 (జనం సాక్షి) :** పెద్దశంకరంపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల పరిధిలోని బుజ్రాన్ పల్లి గ్రామానికి చెందిన శంకర్,అలాగే గొట్టిముక్కల గ్రామానికి చెందిన కృష్ణవేణి-శ్రీనివాస్ గౌడ్ మరియు గంగామణి-సత్య గౌడ్ దంపతుల నూతన గృహప్రవేశాల పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొన్నారు. నాయకులతో కలిసి నూతన గృహాలను పరిశీలించిన ఎమ్మెల్యే, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. నూతన గృహాలలో ఆయా కుటుంబాలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండలానికి సంబంధించిన సర్పంచ్లు బోండ్ల రవీందర్, కుంట్ల సుజాత రాములు, నాయకులు దానం పల్లి నారాగౌడ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ అందజేత



**న్యాల్‌కల్, జూన్ 2 (జనం సాక్షి) :** మండలంలోని గుంజేటి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ కూలీలకు ఓ ఆర్ ఎస్ ద్రావణాన్ని అందజేశారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని కూలీలు వడదెబ్బ వారిన పడకుండా ముందస్తు చర్యగా గ్రామ సర్పంచ్ దేశెట్టి పాటిల్ చేతుల మీదుగా ఉపాధి హామీ సిబ్బంది పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, ఉపాధి హామీ క్షేత్రస్థాయి అధికారి, పలువురు కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం చేయాలి



**మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 2 (జనం సాక్షి) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) విజయ కుమారి గారికి ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ మరియు విద్యార్థుల హక్కుల పరిరక్షణకు సంబంధించి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ పాలమూరు విభాగ్ కన్వీనర్ సాతర్ల అర్జున్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తాగునీటి సమస్య, మరుగుదొడ్లు, ఫర్నిచర్ మరియు ఇతర విద్యా సౌకర్యాల లోపంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు మరియు ఇతర విద్యా సామగ్రి అందేలా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పై సమస్యలపై జిల్లా విద్యాశాఖ వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ తరపున కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పాలమూరు జిల్లా కన్వీనర్ సౌమ్య, నగర కార్యదర్శి శివ, మణి శంకర్, వేణు, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్




**గద్వాల నడిగడ్డ, జూన్ 2 (జనం సాక్షి) :** ఈ నెల 4, 6, 8, 10వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పలు శాఖల ఉన్నతాధికారులతో కలిసి గ్రామ, వార్డు సభల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ సభలను విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు ప్రజలు సహకరించేలా అవగాహన కలిగించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న పర్యావరణ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం విజయవంతం చేయాలని సూచించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సభల్లో మహిళా సంఘాల సభ్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా కృషి చేస్తామన్నారు. విసి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ సభల నిర్వహణకు షెడ్యూల్ తయారు చేసి దాని ప్రకారం ముందుకెళ్లాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఎంఏఓలను నోడల్ అధికారులుగా నియమించి నిర్దేశిత రోజుల్లో ఆయా గ్రామపంచాయతీలలో గ్రామసభలను నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలలోనూ వార్డుల వారీగా కౌన్సిలర్లను సభలకు ఆహ్వానించి ప్రభుత్వం సూచించిన అంశాలపై చర్చించాలన్నారు. రెండు వార్డులకు కలిపి ఒకచోట సభను నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించాలని పేర్కొన్నారు. ఈ సభల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, వర్షపు నీరు హార్వెస్టింగ్, తదితర అంశాలపై అవగాహన కలిగించాలన్నారు. గ్రామ సభల్లోనూ రైతులకు ఆయిల్ ఫామ్, హార్టికల్చర్, ఫార్మర్ రిజిస్ట్రీ, నానో యూరియా, తదితర అంశాలపై పిపిటి ద్వారా తెలియజేయాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలోనూ కరెంటు షాక్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాల గురించి ఈ సభల్లో అవగాహన కల్పించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేసి సభలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డీఎవో వీరప్ప, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సుషిత, మత్స్యశాఖ అధికారి షకీలా భాను, డిపిఓ శ్రీకాంత్, సిపిఓ పాపయ్య, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## ప్లాస్టిక్ నిర్మూలన పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 2 (జనం సాక్షి) :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన పోస్టర్ను మంగళవారం జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక మంగళవారం కలెక్టరేట్లో ఆవిష్కరించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా దీన్ని రూపొందిం చారు. ప్లాస్టిక్ రహిత అడవులు, పర్యాటక ప్రాంతాల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత నగరాలుగా మార్చాలని బట్ట సంచులు కాగితపు సంచులలో వస్తువులు తీసుకెళ్లాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్ఆర్వో కమాలుద్దీన్, పద్మారావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

**ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**




**హనుమకొండ, ప్రతినిధి జూన్ 2 (జనంసాక్షి) :** పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ లోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే గృహాల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు గృహాల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఖాజీపేట మండలంలోని న్యూ షాయంపేటలో నూతనంగా నిర్మించిన 2బీహెచ్‌కే గృహ సముదాయాన్ని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ప్రారంభించారు అనంతరం లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, వారికి శుభాకాంక్షలు తెలియజేసి గృహప్రవేశ కానుకలను అందజేశారు. గృహ సముదాయ ప్రాంగణంలో మంత్రి మొక్క నాటి నీరు పోశారు. కాళోజి కళాక్షేత్రంలో లబ్ధిదారులకు గృహ కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో ఇంకా వేలాది మంది పేద కుటుంబాలు గృహాల కోసం ఎదురు చూస్తున్నాయని, ఈ అంశాన్ని మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య పలు సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో అమలు చేస్తున్న నమూనాను అనుసరించి, ప్రజలు నివసిస్తున్న నియోజకవర్గాల పరిధిలోనే అనుకూలమైన ప్రభుత్వ భూములను గుర్తించి గృహ నిర్మాణాలు చేపట్టే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ఇందిరమ్మ కమిటీ సిఫారసుల అనంతరం వార్డు అధికారులు, గెజిటెడ్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో ధృవీకరణ చేపట్టి అర్హులైన వారినే తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి. అజీజ్ ఖాన్, జిల్లా అదనపు కలెక్టర్ రవి, ఆర్డిఓ వెంకటేష్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్, డిఈ రవీందర్, అదనపు కమిషనర్ జోనా, కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ఇతర అధికారులతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధి పథంలో పయనిస్తుంది

- **వరంగల్ పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు**
- **రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**
- **కిలా వరంగల్ లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**
- **ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల స్టాల్స్**



**వరంగల్ బ్యూరో / వరంగల్ ఈస్ట్, జూన్ 02 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుంది, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టారని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిలా వరంగల్ కుష్‌మహల్ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారి తో పాటు కలెక్టర్ డాక్టర్ సత్య శారద ,డిసిపి అంకిత్ కుమార్, డీ ఎఫ్ ఓ నికిత, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. ఖుషి మహల్ లో ఏర్పాటుచేసిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని పోలీసుల గౌరవ వందన శ్రీకారం అనంతరం పతాకావిష్కరణ గావించి జిల్లా ప్రగతి సందేశానికి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ఆశయాల నెరవేరుస్తుందన్నారు. అర్హులైన ప్రజలందరికీ ఇందిరమ్మ ఇంట్లో మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడమే కాకుండా. ట్రాన్స్ జెండర్స్ కు కూడా నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారని వారికి డబల్ బెడ్రూమ్స్ ఇవ్వనున్నట్లు చెప్పారు. వరంగల్ కు ఎయిర్పోర్టు రావడం సంతోషకరమైన విషయం అన్నారు. వరంగల్ కు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం వేల కోట్ల నిధులు మంజూరు చేయడం గొప్ప విషయం అన్నారు. పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు డ్రస్సులు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేసి విద్యావ్యవస్థను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. రైతుల నుంచి ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులకు పంట మార్పిడి పై అవగాహన కలిగిస్తున్నట్లు చెప్పారు. సరస్వతీ పుష్కరాలను గొప్పగా నిర్వహించామని అదేవిధంగా గోదావరి పుష్కరాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి సురేఖ తెలిపారు ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు చెందిన వారి పిల్లలకు సైకిల్ పంపిణీ చేశారు. అలాగే సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన స్టాల్స్ ను సందర్శించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కిలా వరంగల్ మండల తహసిల్దార్ ఇక్బాల్ తో పటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు



జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వనున్నట్లు రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖిలా వరంగల్లో విలేకరులతో మంత్రి మాట్లాడారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో ఉన్నటువంటి జర్నలిస్టులకు మాత్రమే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశాయిపేటలో జర్నలిస్టుల కోసం నిర్మించిన ఇండ్లు నీరుప్రయోగంగా ఉండటమే కాకుండా ధ్వంసం అవుతున్నాయని మంత్రి తోపాటు పక్కనే ఉన్నటువంటి కలెక్టర్ దృష్టికి కూడా విలేకరులు తీసుకొచ్చారు. ఈ విషయంలో మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టులకు గృహాలు ఇచ్చేముందు గృహాలను పూర్తిగా రిపేర్ చేసి ఇవ్వనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులకు ఇచ్చే ఇండ్ల విషయంలో బిపిఎల్ కింద ఇవ్వాలని ఆలోచన ఏమీ లేదని, సీనియారిటిని బట్టి ఇండ్ల మంజూరు అనేది జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. త్వరగా జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని ఈ సందర్భంగా విలేకరులు అందరూ మంత్రి తో పాటు కలెక్టర్ ను కోరారు.

# నా ప్రాణం పోయినా సరే..
# నా పొలం నుండి విద్యుత్ లైన్ వేయనివ్వను

- **కుబీర్ మండలం రైతు లింగన్న ఆవేదన..**
- **అన్యాయంగా ఎకరంన్నర చేలో స్తంభాలు పాతారని వాపోయిన అన్నదాత**



**కుబీర్, జూన్ 02 (జనంసాక్షి) :** తన తోడ బుట్టిన అన్నను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఒక పేద రైతుపై విద్యుత్ శాఖ అధికారులు కనికరం లేకుండా వ్యవహరించారు. కనీస సమాచారం ఇవ్వకుండా, రైతు అనుమతి లేకుండానే పంట పొలంలోకి చొరబడి చెట్టు నరికివేసి విద్యుత్ స్తంభాలను పాతడంపై కుబీర్ మండల కేంద్రానికి చెందిన రైతు పడిపెల్లి లింగన్న తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కుబీర్ మండల పరిధిలోని రాజురా గ్రామ క్షేత్రంలో లింగన్నకు ఎకరంన్నర వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల తన అన్న చనిపోవడంతో ఆ బాధలో ఉన్న రైతును విద్యుత్ శాఖ అధికారులు ఏమాత్రం సంప్రదించకుండానే ఆయన పొలంలో విద్యుత్ స్తంభాలు వేశారు. ఇప్పటికే ఆ రైతు పొలం గుండా రెండు విద్యుత్ లైన్లు వెళ్తున్నాయి. ఇప్పుడు మూడవ లైన్ కోసం మళ్ళీ తన పొలంలోనే స్తంభాలు వేయడం, అందుకోసం ఏళ్ల తరబడి పెంచుకున్న చెట్టును నరికివేయడంపై లింగన్న కన్నీరుమున్నీరయ్యాడు. "అన్న చనిపోయిన బాధలో నేనుంటే, అధికారులు నా పొలంలో చెట్టు నరికి స్తంభాలు వేశారు. ఇప్పటికే రెండు లైన్లు ఉండటంతో సాగుకు ఇబ్బంది అవుతోంది. ఇప్పుడు మళ్ళీ స్తంభాలు వేస్తే నా గతేం కావాలి? నా ప్రాణం పోయినా సరే, నా చేనులో నుండి కొత్త విద్యుత్ లైన్ వేయనివ్వను" అని లింగన్న తెగేసి చెప్పాడు. తనకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని, తన పొలం నుండి ఆ స్తంభాలను తొలగించాలని ఆయన వేడుకుంటున్నారు.

# ఉత్తమ కంటెంట్ క్రియేటర్‌గా అవార్డ్ అందుకున్న శ్రావణ్



**మంగపేట, జూన్ 02(జనంసాక్షి) :** జిల్లాలోని పర్యాటక రంగ అభివృద్ధికి, ఇక్కడి అందాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్న యువ కంటెంట్ క్రియేటర్‌కు ప్రభుత్వ అధికారిక పురస్కారం దక్కింది. ములుగు జిల్లా ఉత్తమ కంటెంట్ క్రియేటర్‌గా గాజుల శ్రవణ్ కుమార్ జూన్ 02 తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన అధికారిక వేడుకల్లో ఒక ప్రత్యేకమైన గౌరవం లభించింది. మండలంలోని చెరుపల్లి (కొత్తపేట) గ్రామానికి చెందిన గాజుల శ్రవణ్ కుమార్ గౌడ్ పర్యాటక రంగంలో చేసిన విశేష కృషికి గాను జిల్లా ఉత్తమ కంటెంట్ క్రియేటర్ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు చేతుల మీదుగా శ్రావణ్ కుమార్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ముఖ్యంగా అవార్డుకు దారితీసిన శ్రావణ్ కుమార్ క్రియేటివిటీ అంత ములుగు అందాలను ప్రపంచానికి చాటడం ప్రకృతి రమణీయతకు, దట్టమైన అడవులకు, చారిత్రక కట్టడాలకు ములుగు జిల్లా కేరాఫ్ అడ్రస్. లక్నవరం సరస్సు, బొగత జలపాతం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, మేడారం సమ్మక్క–సారలమ్మ వంటి ఎన్నో అద్భుతమైన ప్రాంతాల విశిష్టతను శ్రావణ్ తన డిజిటల్ కంటెంట్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆధునిక సాంకేతికతను, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకుంటూ.. ములుగు జిల్లాలోని అన్వేషించని పర్యాటక ప్రాంతాలను సైతం తన వీడియోలు, ఫోటోల ద్వారా ప్రపంచానికి పరిచయం చేశారు. స్థానిక పర్యాటక రంగానికి శ్రావణ్ చేసిన కంటెంట్ క్రియేషన్ వల్ల జిల్లాకు పర్యాటకుల రాక పెరగడమే కాకుండా, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంలో పరోక్షంగా దోహదపడింది.

**మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ప్రత్యేక అభినందనలు**

అవార్డు ప్రధానం చేసిన అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ములుగు జిల్లా లాంటి గిరిజన, అటవీ ప్రాంతాల్లో దాగి ఉన్న పర్యాటక సంపదను వెలికితీసి, డిజిటల్ ప్రపంచంలో జిల్లా కీర్తిని పెంచడంలో శ్రావణ్ కుమార్ లాంటి యువకులు పోషిస్తున్న పాత్ర అభినందనీయమని కొనియాడారు. జిల్లా కలెక్టర్ సైతం శ్రవణ్ సేవలను అభినందిస్తూ, భవిష్యత్తులో జిల్లా పర్యాటక శాఖకు మరింత మద్దతుగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు మంత్రి సీతక్క కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం నా జీవితంలో మరువలేని అనుభూతి అని అలాగే నా సొంత జిల్లా ములుగులోని అందాలను, సంస్కృతిని ప్రపంచానికి చూపించడమే నా లక్ష్యం. ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది అని శ్రవణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, చెరుపల్లి కొత్తపేట గ్రామస్తులు పాల్గొని శ్రావణ్‌కు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక గ్రామీణ ప్రాంత యువకుడు తన ప్రతిభతో జిల్లా స్థాయి గుర్తింపు తెచ్చుకోవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.



# ఇందిరమ్మ ఇల్లు కన్నతల్లితో సమానం

- **బచ్చన్నపేట సర్పంచ్ అలువాల నర్సింగరావు**

**బచ్చన్నపేట జూన్ 2 ( జనం సాక్షి):** పేదవారికి తన సొంతిల్లు కన్న తల్లితో సమానమని జీవన విధానంలో కూడు. గూడు. గుడ్డ చాలా ముఖ్యమని బచ్చన్నపేట సర్పంచ్ అల్వాల నర్సింగరావు అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు కోడూరు మహాత్మాచారి తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇల్లు లేని ప్రతి నిరుపేదకు కచ్చితంగా ఇల్లు ఇస్తామని ఇంతకుముందు కూడా ఇల్లు లేని ప్రతి ఒక్క నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులతోపాటు నాయకులు నల్లగోని బాలకిషన్ గౌడ్. బొమ్మెర్ల వేణు వందన. అవధూత శ్రీనివాస్. దత్రపు నరేష్. ఎండి మసూద్. బొట్టు గణేష్. కర్రె మహేష్. వెంకట్ రెడ్డి. దేవరకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



- **రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాలరావు**

**మంచిర్యాల జూన్ 2 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాలరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య లతో కలిసి మంచిర్యాల పట్టణంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మినిమం వేజ్ బోర్డు ఛైర్మన్ జనక్ ప్రసాద్, రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య లతో కలిసి హాజరై హాజరై పోలీసు గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూల సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ప్రగతి సందేశాన్ని అందించారు. ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమిస్తుందని, రైతులు, మహిళల సంక్షేమాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్య, వైద్య రంగాల బలోపేతానికి కృషి చేస్తూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యం కొరకు సకల సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మంజూరైన మోటారు సైకిళ్ళు, ల్యాప్ టాప్ లు, వీల్ చైర్లు ఇతరత్ర అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ జిల్లాపై సీఎం ప్రత్యేక దృష్టి

- **సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు**
- **డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 02(జనంసాక్షి ):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటన, కొత్తగూడ కొఠారి గ్రామంలో నిర్వహించిన సామూహిక గృహప్రవేశ కార్యక్రమం, రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుల ప్రారంభోత్సవం, భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు, అధికార యంత్రాంగానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేశారని పేర్కొన్నారు. భారీ ఎత్తున సభకు హాజరై ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు మద్దతు తెలిపిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐసీసీ నేషనల్ మహిళా సెక్రటరీ అధిత, నియోజకవర్గ ఇంచార్జి శ్యామ్ నాయక్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ ఇరుకుల మంగ, వైస్ చైర్మన్ గాజుల రవీందర్,డీసీసీ ఉపాధ్యక్షులు తారిఖ్, భీమ్ రావ్, ప్రధాన కార్యదర్శి గాదెవేణి మల్లేష్ సెక్రటరీ నాంపల్లి శంకర్ , మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా భాయ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు జక్కన్న, మారుతి పటేల్,రాంచందర్,ఆత్మ చైర్మన్ సత్తన్న,కౌన్సిలర్ లు భారతి, కృష్ణమ్మ, సప్న రాణి,మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, మాజీ సర్పంచ్ కాసాయ్య, కాంగ్రెస్ నాయకురాలు ఇందిరా బాయి,ఇల్లూరి రాము, మహ్మద్ సఫి,శంకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# రాచాపూర్‌లో 'ఆర్' సినిమా చిత్రీకరణ

- **పల్లే వాతావరణం లో కెమెరామెన్ అశోక్ కంకల్ల నేతృత్వంలో...**



**లక్ష్మణ చందా, జూన్ 2 (జనం సాక్షి) :** మండలంలోని గత మూడు రోజుల కిందట వడ్యాల్ గ్రామంలో ప్రారంభమైన ఆర్ మూవీ చిత్రికరణ ఇప్పుడు రాచాపూర్ గ్రామంలో కొనసాగుతుంది. కొప్పుల చిన్నయ్య, ద్యావత్ రాజు వారి ఆధ్వర్యంలో పల్లెటూరి ప్రకృతి అందాలు, పచ్చని వాతావరణం, పంట పొలాల్లో ఈ చిత్రీకరణ జరుగుతుంది. గ్మా ఎంటర్టైన్మెంట నేతృత్వంలో దర్శక నిర్మాత గోలి రామకృష్ణ, కెమెరామెన్ అశోక్ కంకల్ల, కో డైరెక్టర్ రవికుమార్, కో ప్రొడ్యూసర్ గాలి బాల కిరణ్ వారి నేపథ్యంలో ఆర్ మూవీ చిత్రీకరణ జరుగుతుంది. ఈ సినిమాకి నటినటులుగా సంతోష్ కృష్ణ, శిరీష కుమారి, భాగ్యరెడ్డి, బాల కిరణ్, భాను, స్వాతి ప్రధాన పాత్రల్లో పోషిస్తున్నారు. అయితే ఇదే మండలానికి చెందిన కెమెరామెన్ అశోక్ కంకల పారిపెల్లి గ్రామవాసి. ఈ చిత్రీకరణ ఈ మండలం కి రావడానికి ఇక్కడ ఉన్న ప్రకృతి మరియు అతనే కారణమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రాఘవపట్నం రహదారి విస్తరణతో ట్రాఫిక్ నియంత్రణ

- **మంత్రి సీతక్క**



**గోవిందరావుపేట, జూన్ 2(జనంసాక్షి) :** మండలంలోని రాఘవపట్నం రహదారి విస్తరణతో మేడారం ట్రాఫిక్ నియంత్రణ జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మండలంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎం ఆర్ ఆర్ 8 కోట్ల రూపాయ నిధులతో 163. జాతీయ రహదారి నుంచి రాఘవపట్నం రోడ్డు విస్తరణ , జంపన్న వాగు వంతెన నిర్మాణ అభివృద్ధి పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ ఈ రహదారి విస్తరణ మరియు జంపన్న వాగు వంతెన నిర్మాణం అభివృద్ధి తో జాతర సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు సహకారంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,రాఘవపట్నం సర్పంచ్ రామ్మోహన్,డి పి ఓ వెంకయ్య,హౌసింగ్ పిడి,స్థానిక ప్రజాప్రతినిధులు,సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కష్టమైన విధుల్లో మెరిసిన జానయ్యకు 'కఠిన సేవా పతకం'

● ఖమ్మం జిల్లా పోలీసు అధికారికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు




**ఖమ్మం, జూన్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించిన అధికారులకు ప్రతిష్ఠాత్మక పతకాలను ప్రకటించింది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం చిన్నతండ గ్రామానికి చెందిన బానోత్ జానయ్య, పోలీసు ఇన్‌స్పెక్టర్‌కు "కఠిన సేవా పతకం" ప్రకటించడం జిల్లాకు గర్వకారణమైంది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వహించడం, ఉగ్రవాదం మరియు నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించడం, ఏజెన్సీ ప్రాంతాల్లో ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేసింది. రెండువేల పద్నాలుగు బ్యాచ్‌కు చెందిన బానోత్ జానయ్య తన సేవా ప్రస్థానాన్ని ఉగ్రవాద వ్యతిరేక ప్రత్యేక దళంలో ప్రారంభించారు. అక్కడ సుమారు ఐదేళ్ల పాటు సమర్థవంతంగా పనిచేశారు. అనంతరం నక్సలిజం వ్యతిరేక ప్రత్యేక దళంలో సేవలందిస్తూ ప్రమాదకర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం కృషి చేశారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావం ప్రదర్శిస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో విశేష పాత్ర పోషించిన జానయ్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించింది. క్లిష్ట ప్రాంతాల్లో ఆయన చూపిన సమర్థత, బాధ్యతాయుతమైన పనితీరు కారణంగానే ఈ ప్రతిష్ఠాత్మక "కఠిన సేవా పతకం" వరించింది. జానయ్యకు ఈ గౌరవం దక్కడం పట్ల చిన్నతండ గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, మిత్రులు, సహచర పోలీసు అధికారులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

● జిల్లా ఎస్పీ నరసింహ

**తుంగతుర్తి, జూన్ 2 (జనం సాక్షి) :** జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఎంతటి వారి పైన అయినా చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు, మంగళవారం జిల్లాలో పోలీస్ స్టేషన్లో వార్షిక తనిఖీల్లో భాగంగా తుంగతుర్తి పోలీస్ స్టేషన్ సందర్శించి తనిఖీ చేశారు, ముందుగా స్టేషన్ సిబ్బంది గౌరవ వందనంతో ఎస్పీ కి స్వాగతం తెలిపారు, పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. పోలీస్ కవాతు, పోలీస్ సామాగ్రి పరిశీలించి సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు, సిబ్బందితో కలిసి స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్లో సిబ్బంది పనితీరును తనిఖీ చేశారు, ఫిర్యాదుల నిర్వహణ అంతర్జాలం నమోదు పరిశీలన చేసి ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని ఫిర్యాదులపై వేగంగా దర్యాప్తు చేయాలని సూచించారు. అనంతరం స్టేషన్లో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డ్స్ ను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు సలహాలు సూచనలు అందించారు. స్టేషన్ పరిధిలో ఉన్న సస్పెక్ట్ షీట్స్, రౌడీ షీట్స్ విలేజ్ హిస్టరీ సీట్స్ ను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో జరుగుతున్న పనితీరుపై డిఎస్పి సీఐ స్థాయి అధికారులు నిరంతరంగా పర్యవేక్షణ చేయాలి అన్నారు. నేనుసైతం కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాలు పెట్టుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని, కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహిస్తూ ఎల్లప్పుడూ ప్రజలకు బాధితులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. తప్పుడు ప్రవర్తన, నేర ప్రవృత్తి ఉన్న వారి




పట్ల పోలీస్ శాఖ ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించదని హెచ్చరించారు. ఎవరైనా ప్రజలను ఇబ్బందులకు గురి చేసినట్లయితే అలాంటి వారిపై రౌడీషీట్ నమోదు చేసి పిడి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పోలీసు దర్యాప్తులో సాంకేతికత ఆధునికత పద్ధతులు అవలంబిస్తున్నామని అన్నారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగించిన, ప్రజలకు ఇబ్బందులు కలగజేసిన అలాంటి వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటాము అని అన్నారు, సమస్యలపై బాధితులు పోలీస్ సహాయం కోసం డయల్ 100, డయల్ 112 కు ఏ క్షణంలోనైనా ఫోన్ చేయవచ్చును, ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి బాధితుల ఇంటి వద్దకే వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేసి కేసు పత్రాలు అందిస్తున్నాము అని అన్నారు, రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ఉద్యమం కార్యక్రమం తో ప్రతి గ్రామానికి వెళ్లి రోడ్డు భద్రత ప్రమాదాల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాము అని అన్నారు, ప్రస్తుత సమాజంలో గాంజాయి తన యువతను పీడిస్తున్నది దీనిని నిర్మూలించడానికి ప్రత్యేక నిగా ఏర్పాటు చేశామని గతంలో గంజాయి సంబంధిత కేసుల్లో ఉన్న వారిపై నిగా ఉంచాము అని అన్నారు.. సైబర్ మోసాల పై ప్రత్యేక సాంకేతికతతో సైబర్ మోసాలను ఛేదిస్తూ సైబర్ మోసాలకు గురికాకుండా ప్రజలు చైతన్యవంతం అవ్వాలి అని అన్నారు,. ప్రజలకు భద్రత కల్పించడం దొంగతనాలు నివారించడంలో భాగంగా పోలీస్ సిబ్బంది రాత్రింబవళ్లు పటిష్టంగా పనిచేస్తున్నారు అని అన్నారు నకిలీ విత్తనాల పట్ల రైతన్నలు అప్రమత్తంగా ఉండాలి వర్షాభావ పరిస్థితులకు తగ్గట్టుగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు, ఈ సీజన్లో వరి ధాన్యం ఎక్కువగా పండిందని కొనుగోలు కేంద్రాలలో రైతులకు రక్షణ కల్పించామని తెలిపారు. గ్రామాలలోకి వచ్చి విడి విత్తనాలు అమ్మే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, నకిలీ విత్తనాల వల్ల నష్టం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రసన్నకుమార్, నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, తుంగతుర్తి ఎస్సై క్రాంతికుమార్, నూతనకల్ ఎస్సై నాగరాజు, మద్దిరాల ఎస్సై వీరన్న, డిసిఆర్బి ఎస్ఐ యాకూబ్, ఆర్ఎస్ఐ అన్వర్, డి సి ఆర్ బి సిబ్బంది అంజన్ రెడ్డి శేఖర్ రెడ్డి, సిసి సందీప్, టెక్నికల్ టీం కానిస్టేబుల్ సుమన్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## ఎల్లమ్మ అమ్మవారి దేవస్థానాన్ని ఆదర్శ దేవాలయంగా తీర్చిదిద్దుతా

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

● త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని ధర్వేశిపురంకు తీసుకువస్తా..

**కనగల్లు, జూన్ 2 (జనం సాక్షి) :** ధర్వేశిపురం గ్రామంలో వెలసి నిత్యం వేలాదిమంది భక్తుల నుంచి ఆదరాభిమానాలు పొందుతూ కోరిన కోరికలు తీర్చే తల్లి ఎల్లమ్మ అమ్మవారి దేవాలయాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ దేవాలయముగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు భవనముల, సినిమాటగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ధర్వేశిపురం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎల్లమ్మ అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటూ ఒక్కొక్కటిగా అమలు చేయడం జరుగుతుందన్నారు . తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆలయం వద్ద రోడ్డు వెడల్పు చేయించి లైటింగ్ తో సుందరీకరించినట్లు తెలిపారు. నల్లగొండ ఎస్ ఎల్ బి సి నుండి ధర్వేశిపురం వరకు నాలుగు లైన్ల రోడ్డులు మంజూరు చేయించి త్వరలో పనులను ప్రారంభం చేయనున్నట్లు తెలియజేశారు. ధర్వేశిపురం లో ఒక పెద్ద ఇండస్ట్రీ పార్కును ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు త్వరలో ధర్వేశిపురం ఎల్లమ్మ



సన్నిధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తీసుకురా అన్నట్లు వెల్లడించారు. 239 కోట్ల రూపాయలతో ధర్వేశిపురం నుండి వయ్యా గుర్రంపూడ్, కొండమల్లేపల్లి, దేవరకొండ, డిండి వరకు హ్యామ్ రోడ్ నిర్మించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఏ ఎం ఆర్ పి కాలువ లో లైనింగ్ పనులు కొనసాగుతున్నాయని, రెండేళ్లలో ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయించి రెండు పంటలకు నీళ్లు అందేలా చూస్తానని ఈ సందర్భంగా మంత్రి తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి పేదోడికి ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డుల మంజూరి, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి ఇందిరమ్మ రాజ్యం అంటేనే సంక్షేమ ఫలాలు అందించే రాజ్యం గా ముందుకు సాగుతుందని గుర్తు చేశారు.

### పాలకమండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

ధర్వేశిపురం శ్రీ ఎల్లమ్మ అమ్మవారి దేవస్థాన నూతన పాలకమండలి సభ్యులు సమన్వయంతో పనిచేసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి తో పాట ధర్మకర్తలచే ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వై అశోక్ రెడ్డి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్, తహసిల్దార్ పద్మ, ఆలయ ఈవో అంబటి నాగిరెడ్డి, ఇన్స్పెక్టర్ సుమతి, ఆర్టిఏ సభ్యులు కే రాజిరెడ్డి ధర్వేశిపురం సర్పంచ్ రాయల శేఖర్, మాజీ జడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు జి అనుపు రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి సిబ్బంది జె చంద్రయ్య, కే నాగేశ్వరరావు, ఉపేందర్ రెడ్డి, నాగరాజు, రాజయ్య, శ్రీకర్, వెంకటయ్య, పలు గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు వివిధ హోదాలో ఉన్న ప్రజా ప్రతినిధులుపాల్గొన్నారు.

## ప్రత్యక్ష ప్రజా భాగస్వామ్యానికి గ్రామ సభలు నిర్వహించాలి



**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 2 (జనం సాక్షి) :** ప్రత్యక్ష ప్రజా భాగస్వామ్యానికి జూన్ 4, 6, 8, 10 తేదీలలో జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు, వార్డు సభలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ, పర్యావరణ వారోత్సవాల నిర్వహణతో పాటుగా గ్రామ సభల నిర్వహణపై మంగళవారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సివి ఆనంద్ లు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పర్యావరణ వారోత్సవాల నిర్వహణతో పాటుగా రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 4, 6, 8, 10వ తేదీలలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి, ప్రజల్లో అనేక అంశాలపై అవగాహన కల్పిస్తూ, ప్రత్యక్ష ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. జూన్ నెల నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ూ×=)పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే రాష్ట్రంలో రైతాంగం స్థిరమైన వ్యవసాయం కోసం పంటల మార్పిడి దిశగా మారాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాల సన్నద్ధత, విస్తృత స్థాయి మొక్కల నాటకం, ఘన వ్యర్థాల నిర్వహణతో పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం వంటి అంశాల్లో ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, స్థానిక నాయకుల భాగస్వామ్యంతో ప్రజల్లో చైతన్యం కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అదే విధంగా డీజీపీ సివి ఆనంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి, ప్రజలకు విస్తృత స్థాయిలో చేరువ కావాలని సూచించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి,ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వ పరిపాలన

● ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 2 (జనం సాక్షి) :** సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం పెవిలియన్ గ్రౌండ్ వద్ద నున్న అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి నివాళులు అర్పించి, పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు విచ్చేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమా లను శకటాల ద్వారా సమర్థవంతంగా ప్రదర్శించిన అధికారులను అభినందించారు. శకటాల ప్రదర్శన అనంతరం రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన 10 మంది అర్హులైన లబ్ధిదారులకు ఉప ముఖ్యమంత్రి మంజూరు ఉత్తర్వులను అందజేశారు. తదుపరి వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించి ఆయా శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,అమరవీరుల కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు, స్వాతంత్ర్య సమరయోధులలు, వారి కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీలకు ద్రోహం చేసిన మోడీ

● ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 2 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హన్మంత్ రావు మీడియా నిర్వహించారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ బిసి అయి ఉండి బీసీలకు ద్రోహం చేస్తున్నాడన్నారు. దేశానికి మూడు సార్లు నరేంద్ర మోడీ ప్రధాని అయ్యారు. ఆయన బీసీ అయి కూడా బీసీలకు న్యాయం చేయడం లేదని తెలిపారు. అగ్ర కులానికి చెందిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి బీసీల గురించి ఆలోచిస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ 4500 కిలోమీటర్లు పాదయాత్ర చేశా రని పాదయాత్రలో ఎస్సీ, ఎస్టీల కన్నా బీసీలు ఎక్కువగా ఉన్నారని, బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని గమనించారన్నారు. అందుకే బీసీల లెక్క తేల్చాలని నిర్ణయించారని తెలిపారు. దేశవ్యాప్తంగా కులగణన జరగాలని పట్టుబట్టారని జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం జరగాలని కోరడంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణన చేపట్టడానికి నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాసుల బాలరాజ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, మహమ్మద్ నయీమ్, ఐరేని సందీప్, పండ్ల రాజు, గంప ప్రసాద్, కారంగుల అశోక్ రెడ్డి, భూమని బాలరాజ్, పుట్నాల శ్రీనివాస్, గొడుగుల శ్రీనివాస్, కౌన్సిలర్లు అంజాద్, ఇసాక్ షేరు, సుతారి,రమేష్, మహమ్మద్ సలీం, జావిద్, వాజిత్, ఆమీర్ లడ్డు, కల్లెంసత్యం, గోనె శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్, సిరాజ్, కన్నయ్య, కాళ్ల గణేష్, ముబాషిర్, యూనిస్, అన్వర్ అహ్మద్, లక్ష్మీ రాజా గౌడ్, కిరణ్ ,ప్రవీణ్ రాజ గౌడ్, ఖుర్షీద్, టింకు భరత్,సురేష్, సుఫియాన్, జ్యోతి, కార్యాలయ కార్యదర్శి లక్కపత్తిని గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరవీరుల స్థూపాన్ని నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటు

● ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు



**నిజాంపేట్, జూన్ 2 (జనం సాక్షి) :** తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలకు ప్రతీకగా నిలిచిన దుండిగల్ అమరవీరుల స్థూపాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వంటి అత్యంత పవిత్రమైన రోజున కూడా అమరవీరుల స్థూపాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో, ఉద్యమకారులతో కలిసి స్వయంగా స్థూపాన్ని నీటితో శుభ్రం చేసి అమరవీరులకు పుష్పాంజలి ఘటించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి వేలాది మంది విద్యార్థులు, యువకులు, ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన రోజునే అమరవీరుల స్మారక స్థూపం నిర్లక్ష్యానికి గురికావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున కూడా అమరవీరుల స్థూపాన్ని పట్టించుకోకపోతే మరెప్పుడు పట్టించుకుంటారు? తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఇదేనా ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని శంభీపూర్ రాజు ప్రశ్నించారు. అమరవీరుల స్థూపాల సంరక్షణను విస్మరించడం అంటే కేవలం ఒక నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడం కాదు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, అమరవీరుల త్యాగాలను, ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని అవమానపరచడమేనని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను, అమరవీరుల త్యాగాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇకనైనా నిర్లక్ష్య వైఖరిని వీడి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అమరవీరుల స్థూపాల సంరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణను సాధించిన అమరవీరుల త్యాగాలను మరచిపోయే ప్రభుత్వాలను చరిత్ర ఎన్నటికీ క్షమించదని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హెచ్చరించారు.

## విప్లవాల పురిటీగడ్డ నల్లగొండ

**నల్లగొండ ప్రతినిధి, జూన్ 2 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 13వ సంవత్సరంలో అడుగుపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని నల్లగొండలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రోడ్లు ు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, జిల్లా ప్రజలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎందరో అమరవీరుల త్యాగఫలితంగా 4 కోట్ల ప్రజల 60 ఏళ్ల ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ నల్లగొండ జిల్లా విప్లవాల పురిటిగడ్డ అని, సాయుధ పోరాటం నుండి మలిదశ ఉద్యమం వరకు ఈ గడ్డ సింహభాగం పాత్ర పోషించిందని కొనియాడారు. నాడు ప్రజల ఆకాంక్ష కోసం తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా విసిరికొట్టి, ఆమరణ నిరాహార దీక్షకు దిగిన చరిత్ర తనదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రగతి పథంలో దూసుకుపోతోందని, నల్లగొండ జిల్లాను



అభివృద్ధి, సంక్షేమంలో అగ్రభాగాన నిలబెట్టే బాధ్యత తనదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు జరుగుతున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికా" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సాధించిన వివిధ శాఖల ప్రగతి వివరాలను మంత్రి వెల్లడించారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ చూపెట్టిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను మంత్రి అందజేశారు.తెలంగాణ రాష్ట్ర అమరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు.అనంతరం చండూరు మండలం ఉడతలపల్లి గ్రామానికి చెందిన కొరివి శ్రీదేవి–శివ దంపతులకు ఇందిరమ్మ ఇంటి గృహపత్రాన్ని మంత్రి ఈసందర్భంగా అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మెప్మా ద్వారా లబ్ధిదారులకు 6 కోట్ల 46 లక్షల 50 వేల రూపాయల చెక్కును అందజేశారు.అంతేకాక స్త్రీ నిధి రుణాలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించారు.పర్యావరణంలో వేసవి శిబిరం నిర్వహణలో ఉత్తమంగా నిలిచిన జడ్పిహెచ్ఎస్ కట్టంగూరు, టీజీ ఎంఎస్ నిడమనూరు, టీజీ ఎంఎస్ మిర్యాలగూడ విద్యార్థులను జ్ఞాపికలు బహుకరించారు. చండూరు మండలం ,ఉడతలపల్లి చెందిన కొరివి శ్రీదేవికి ఇందిరమ్మ ఇంటి పట్టాను అందజేశారు.డిఆర్డిఏ, గృహ నిర్మాణ , వైద్య ఆరోగ్య, గిరిజన సంక్షేమం, రవాణా, అగ్నిమాపక శాఖ ద్వారా శకటాలను రూపొందించి ప్రదర్శించారు.వివిధ శాఖల ద్వారా స్టాళ్లను ఏర్పాటు చేయడం జరిగింది. బాల భవన్ నాగార్జునసాగర్ విద్యార్థుల నృత్య ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా మంత్రి పోలీస్ సేవ పథకాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్,అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఆర్డీవో వై అశోక్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, స్థానిక కార్పొరేటర్ కవిత, జిల్లా అధికారులు,ఇతర ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు హాజరయ్యరు.

## కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ

● మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 2 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయం నందు జాతీయ జెండాను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పతాకాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ మలిదశ ఉద్యమానికి కేసీఆర్ పిడికిలి బిగించి గులాబీ జెండా ఎత్తారని సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చేందుకు కేసీఆర్ తో కలిసి నడిచామని అన్నారు. తెలంగాణ ఆకాంక్షను సాకారం చేసేందుకు పదవులకు అనేకసార్లు కేసీఆర్ త్యాగం చేశారని సబ్బండ వర్గాలు కేసీఆర్ తో కలిసి నడిచి పోరాటంతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది అని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో మహిళలకూ 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఆనాడు అసెంబ్లీలో తీర్మానం చేశారని మహిళలకు జాతీయ పార్టీలు అన్యాయం చేశాయని రాబోయే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో యువతకు, ఉద్యమకారులకు అవకాశం ఇస్తామని ఖమ్మం కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగరడం ఖాయమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ధీమా వ్యక్తంచేశారు.




## ఈపీఎఫ్ వడ్డీ జమయ్యేది ఎప్పుడు?

**న్యూఢిల్లీ:**కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమై అప్పుడే రెండు నెలలు పూర్తయ్యింది. చిన్న మొత్తాల పొదుపు పథకాలకు సంబంధించిన వడ్డీ ఆ మరుసటి రోజే జమ అయిపోయింది. ఈపీఎఫ్ నిల్వలపై వచ్చే వడ్డీ మాత్రం ఇప్పటి వరకు చందాదారుల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో చందాదారులు వడ్డీ ఎప్పుడు వస్తుందా? అని ఎదురుచూస్తున్నారు. వడ్డీ గురించి సామాజిక మాధ్యమాల్లో ఆరా తీస్తున్నారు. ఇంతకీ వడ్డీ ఎప్పుడు జమయ్యే అవకాశం ఉంది? ఆలస్యం వల్ల వడ్డీ ప్రయోజనం కోల్పోతామా?2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈపీఎఫ్ నిల్వలపై వడ్డీ రేటును 8.25 శాతంగా నిర్ణయించారు. మార్చి నెల 2వ తేదీన సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ (అఖ) సమావేశంలో దీనికి సంబంధించిన నిర్ణయం వెలువడింది. అయితే, సీబీటీ తీసుకున్న నిర్ణయాన్ని నోటిఫై చేయాల్సి ఉంటుంది. ఆపై వడ్డీ ఖాతాలో జమ అవుతుంది. కాబట్టి వడ్డీ ఈపీఎఫ్ ఖాతాలో జమ అవ్వడానికి ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉంది.చిన్న మొత్తాల పొదుపు పథకాలకు వడ్డీ రేటును ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. కాబట్టి ఆర్థిక సంవత్సరం ముగిసిన మరుసటి రోజే వడ్డీ మొత్తం ఖాతాల్లో కనిపిస్తుంది. ఈపీఎఫ్ వడ్డీని సీబీటీ నిర్ణయిస్తుంది. దీనికి ప్రభుత్వం ఆమోదం తెలిపాక, ఆపై ఖాతాల్లో జమ కావడానికి కొన్ని వారాల సమయం పడుతుంది. ఒకప్పుడు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వడ్డీ ఆయా ఖాతాల్లో జమ అయ్యేది. ఇప్పుడు జూన్, జులై నెలల్లో పడుతోంది. కేంద్రం వడ్డీని నోటిఫై చేశాక దీనిపై మరింత స్పష్టత రానుంది. గతేడాది మే 24న వడ్డీని కేంద్రం నోటిఫై చేసింది. ఈసారి ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదు.

ఆలస్యమైతే ప్రయోజనం కోల్పోతామా?

ఆలస్యం వల్ల ఆ మేర చక్రవడ్డీ ప్రయోజనం కోల్పోతామన్న ఆందోళన కొందరు చందాదారుల్లో నెలకొంది. అలాంటి భయాలేవీ అక్కర్లేదంటోంది భవిష్య నిధి సంస్థ. ఈపీఎఫ్ నిల్వలపై ఆర్థిక సంవత్సరం మొదటి తేదీ నుంచి ఆ ఏడాది చివరి తేదీ వరకు ఏ నెలకు ఆ నెల వడ్డీని గణిస్తారు. నెల నెలా లెక్కించినప్పటికీ వడ్డీ మాత్రం ఏడాది చివర్లోనే జమ చేస్తారు. ఒకవేళ విత్‌డ్రాలు ఉంటే ఆ మేర వడ్డీ తగ్గుతుంది. అలాగే, నిలిచిపోయిన ఖాతాలకు ఈపీఎఫ్ఓ ఎలాంటి వడ్డీ చెల్లించదు. కాబట్టి వడ్డీ ఖాతాలో జమ ఆలస్యం అయినా చక్రవడ్డీ ప్రయోజనానికి ఎలాంటి ఢోకా ఉండదు.



# 4 రోజుల నష్టాలకు బ్రేక్

## లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ట్రేడైన సూచీలు.. ఆఖరిలో కొనుగోళ్ల మద్దతు లభించి లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, కన్జ్యూమర్ డ్యూరబుల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో సూచీల నాలుగు రోజుల వరుస నష్టాలకు తెరపడింది.సెన్సెక్స్ ఉదయం 73,945.20 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 73,815.12 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత పుంజుకొంది. ఇంట్రాడేలో 74,862.19 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 382.50 పాయింట్ల లాభంతో 74,649.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 100.95 పాయింట్ల లాభంతో 23,483.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.28గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ టెక్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్,



బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 93.96 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4528 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఓయో రూ.6,650 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం

దిల్లీ: ప్రముఖ ట్రావెల్ టెక్ కంపెనీ ఓయో మాతృ సంస్థ ప్రిజమ్ తొలి పబ్లిక్ ఇష్యూకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. మార్కెట్ నుంచి రూ.6,650 కోట్లు సమీకరించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సుమారు 7-8 బిలియన్ డాలర్ల విలువ వద్ద ఐపీఓకు వచ్చే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.ఐపీఓ కోసం ప్రిజమ్ సంస్థ 2025 డిసెంబర్‌లో కాన్ఫిడెన్షియల్ రూట్‌లో ముసాయిదా ఐపీఓ పత్రాలను సెబీకి సమర్పించింది. సెబీ నుంచి ఆమోదం పొందిన నేపథ్యంలో పబ్లిక్ అప్‌డేటెడ్ ముసాయిదా పత్రాలను సెబీకి కంపెనీ సమర్పించాల్సి ఉంటుంది. జులైలో దీన్ని సమర్పించాలని కంపెనీ భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మార్కెట్ పరిస్థితులు, లిస్టింగ్ టైమ్‌లైన్‌ను బట్టి యూడీఆర్‌హెచ్‌పీని సమర్పించే అవకాశం ఉందని పేర్కొన్నాయి.




### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

## లేఆఫ్‌ల వేళ.. హెచ్1బీ టెకీలకు

# ఎన్విడియా కళ్లు చెదిరే ప్యాకేజీ!

**న్యూఢిల్లీ:**లేఆఫ్‌ల కారణంగా ఉపాధి కోల్పోయి అమెరికాలో నివసిస్తోన్న భారతీయ హెచ్-1బీ వీసాదారులు 60 రోజుల్లో మరో ఉద్యోగాన్ని వెతుక్కోవాల్సి ఉంటుంది. లేకపోతే ఆ దేశం నుంచి వెళ్లిపోవాల్సిన పరిస్థితి. టెక్ దిగ్గజ సంస్థలన్నీ ఉద్యోగాలకు కోత పెడుతూ, పెద్దగా నియామకాలు చేపట్టకపోవడంతో ఈ వీసాదారులు గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో ఎన్విడియా విదేశీ టాలెంట్‌పై దృష్టిసారించింది. అందులోభాగంగా హెచ్-1బీ వీసాదారుల నియామకాల సంఖ్యను పెంచుతోంది.2026లో మొదటి రెండు త్రైమాసికాలకు 1200 మంది హెచ్-1బీ కేటగిరీ కింద ఉద్యోగులను తీసుకునేందుకు కావాల్సిన అనుమతులు పొందింది. గతేడాది ఇదే సమయంలో ఆ సంఖ్య వెయ్యిగా ఉంది. ఫెడరల్ ఫైలింగ్స్ కంపెనీ ఈ వివరాలను పేర్కొంది. అమెరికాకు హెచ్-1బీ టాలెంట్‌ను ఎక్కువగా అందిస్తోన్న దేశం భారత్. ఆ వీసాను పొందుతున్న విదేశీయుల్లో భారతీయుల వాటా 70 శాతానికి పైనే ఉంది. అంటే ఆ వీసా




కింద నియామకాలు పెరిగితే.. లబ్ధిదారుల్లో ఎక్కువమంది భారతీయులే ఉండే అవకాశం ఉంది. ఎన్విడియా నియామకాల సంఖ్యను పెంచడమే కాకుండా.. ఇంజినీరింగ్, ఏఐ నిపుణులను తమ సంస్థలో చేర్చుకునేందుకు భారీగా వేతనాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఒక ఇంజినీరుకు 3,91,000 డాలర్లు (సుమారు రూ.3.72 కోట్లు), రీసెర్చ్ సైంటిస్ట్‌లకు 3,56,500 డాలర్లు (రూ.3.39 కోట్లు), ప్రొడక్ట్ మేనేజర్‌కు రూ.3.61 కోట్లు, హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ మేనేజర్లకు రూ.3.50 కోట్లు, ఇక డైరెక్టర్ స్థాయి పదవులకు అయితే రూ.4.64 కోట్ల వార్షిక వేతనాలను ఇవ్వనుంది. స్టాక్ గ్రాంట్స్, బోనస్ కాకుండానే ఈ వేతనాలు చెల్లించనున్నట్లు ఫైలింగ్స్‌లో వెల్లడించింది. టెక్ రోల్స్‌లో ఏఐ అల్గారిథమ్ ఇంజినీర్లు, ప్రిన్సిపల్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. వారికి రూ.4 కోట్లకు పైగా వేతనాలు లభించనున్నాయి. ఏఐ రేసులో ముందువరుసలో ఉండేందుకు ఎన్విడియా చేస్తోన్న ప్రయత్నాల్లో భాగంగా.. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, చిప్ డిజైన్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కస్టమర్ ఫేసింగ్ టెక్నికల్ రోల్స్‌లో ఈ నియామకాలు ఉండనున్నాయి. ఇదిలాఉంటే.. ఈ ఏఐ యుగంలో డేటా సెంటర్లకు అత్యాధునిక చిప్‌లను అందిస్తూ ప్రపంచంలోనే అగ్రగామి కంపెనీగా ఉన్న ఎన్విడియా.. ఇకపై వ్యక్తిగత కంప్యూటర్లకూ ఏఐ ఆధారిత సూపర్ చిప్‌ను అందించనుంది. మౌస్, కీబోర్డ్ అవసరం లేకుండా ఏఐ ఏజెంట్లే కంప్యూటర్‌ను ఆపరేట్ చేస్తాయి. దాదాపు 40 ఏళ్ల తర్వాత పర్సనల్ కంప్యూటర్ (పీసీ) చరిత్రలో జరుగుతున్న అతిపెద్ద మార్పు ఇది. 'ఆర్‌టీఎక్స్ స్పార్క్' పేరుతో ఈ ఏడాది చివరికి మార్కెట్లోకి రానున్న ఈ చిప్‌ను సోమవారం తైవాన్ రాజధాని తైపీలో ఎన్‌విడియా సీఈవో జెన్సెన్ హువాంగ్ ఆవిష్కరించారు.

# నేను లేకపోతే జైల్లో ఉండేవాడివి..

## నెతన్యాహుపై ట్రంప్ ఫైర్


**వాషింగ్టన్:**ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫైర్ అయినట్లు తెలుస్తోంది. తాను లేకపోతే ఇప్పటికే జైల్లో ఉండే వాడివంటూ నెతన్యాహుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం. లెబనాన్‌లోని హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ సైనిక చర్యల విషయంపై నెతన్యాహును ట్రంప్ మందలించినట్లు అమెరికా అధికారిక వర్గాలను ఉటంకిస్తూ అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి. బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలను ఖాళీ చేయాలని అక్కడి ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. అయితే, లెబనాన్‌పై దాడులు చేస్తే అమెరికాతో చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ (ఎతీజీని) బెదిరించింది. ఈ క్రమంలో నెతన్యాహుతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. టెల్అవీవ్ చర్యలు.. ఇరాన్‌తో దౌత్య ప్రయత్నాలను దెబ్బతీస్తున్నాయని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను పెంచుతున్నాయని ట్రంప్ ఆందోళన



వ్యక్తంచేశారనేది ఆ మీడియా కథనాల సారాంశం. 'నువ్వు పిచ్చివాడివి. నేను లేకుంటే నువ్వు జైలులో ఉండేవాడివి. నేను నిన్ను కాపాడుతున్నా. ప్రస్తుతం అందరూ నిన్ను ద్వేషిస్తున్నారు. నీ చర్యల వల్ల ఇజ్రాయెల్‌ను కూడా ఇష్టపడటం లేదు' అని నెతన్యాహుపై ట్రంప్ మండిపడినట్లు అవి పేర్కొన్నాయి. అదే సమయంలో 'అసలు నువ్వు ఏం చేస్తున్నావు..?' అంటూ ఇజ్రాయెల్ ప్రధానిపై ట్రంప్ గట్టిగా అరిచినట్లు వెల్లడించాయి.

మళ్లీ ఉద్రిక్తం


ఈ సందర్భంగా నెతన్యాహు నిర్ణయాలను కూడా ప్రశ్నించారని పేర్కొన్నాయి. ఒక హెజ్‌బొల్లా కమాండర్‌ను హతమార్చేందుకు టెల్అవీవ్ చేస్తున్న సైనిక చర్యల్లో అనేకమంది లెబనీస్ పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ఆందోళన వ్యక్తంచేసినట్లు కూడా వెల్లడించాయి. ఇక, నెతన్యాహుతో సానుకూలమైన సంభాషణ జరిగిందని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు ద్వారా వెల్లడించారు. బీరుట్ వైపు ఇజ్రాయెల్ దళాలు వెళ్లవని హామీ ఇచ్చారు. ఈమేరకు హెజ్‌బొల్లా నాయకులతోను మాట్లాడినట్లు ట్రంప్ తెలిపారు. ఇజ్రాయెల్‌పై సైనిక కాల్పులను ఆపేందుకు వారు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ కూడా వారిపై కాల్పులకు దూరంగా ఉంటుందని వెల్లడించారు. అయితే, నెతన్యాహు ప్రకటన ఇందుకు భిన్నంగా ఉంది. ఇజ్రాయెల్ నగరాలు, పౌరులపై దాడులు కొనసాగితే హెజ్‌బొల్లాను లక్ష్యంగా చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ట్రంప్‌నకు కూడా తెలియజేసినట్లు పేర్కొన్నారు.




## మనుషులకు ఇంకా మూడేళ్లే.. ఆ తర్వాత ఏఐనే

### గూగుల్ ఎక్స్ మాజీ బిజినెస్ చీఫ్

రోజురోజుకూ కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి, ప్రజల జీవితంలోకి వేగంగా విస్తరిస్తోంది. చాట్‌జీపీటీ, క్లాడ్, జెమినై, గ్రోక్ వంటి ఏఐ టూల్స్ మెయిల్స్ రాయడం, డాక్యుమెంట్లను విశ్లేషించడం వంటి పనుల్లో సహాయం చేస్తున్నాయి. అయితే ఆ టూల్స్ భవిష్యత్తులో ఎలా రూపుదిద్దుకుంటాయనే దానికి ఇదంతా ఒక ఆరంభం మాత్రమేని గూగుల్ ఎక్స్‌లో చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా పనిచేసిన మొ గావ్‌డాట్ హెచ్చరించారు. ఈ టెక్నాలజీ పరిశ్రమలను తలకిందులు చేస్తుందని, లక్షలాది ఉద్యోగాలను తొలగిస్తుందని, ఈ సమాజాన్ని పునర్నిర్మిస్తుందన్నారు. అంతలా ఏఐ శక్తిమంతం కావడానికి మానవాళికి మూడేళ్లు మాత్రమే సమయం ఉందని వ్యాఖ్యలు చేశారు. ది డైరీ ఆఫ్ ఏ సీఈఓ పాడ్‌కాస్ట్‌లో ఈమేరకు హెచ్చరికలు చేశారు. "ఏఐ దానంతట అదే ఈ ప్రమాదాలను సృష్టించదు. దానిని కంపెనీలు, ప్రభుత్వాలు ఎలా వాడతాయన్నదే ఇక్కడ కీలకం. చాట్‌బాట్, వీడియోలతో ఏఐ ఇప్పటికే ప్రజల జీవితంలో భాగమైంది. కానీ ప్రయోగశాలల లోపల జరుగుతున్నది అంతకంటే చాలా ముఖ్యమైంది. సిస్టమ్‌లు సొంతంగా కోడ్‌ను మెరుగుపర్చు కుంటున్నాయి. మార్పులను పరీక్షిస్తున్నాయి. ఎప్పటికప్పుడు మెరుగైన వెర్షన్లను వేగంగా విడుదల చేయడం వంటి పనులు చేస్తున్నాయి. ప్రజల అవగాహనకు, వాస్తవ సామర్థ్యానికి ఉన్న అంతరమే.. రాబోతున్న మార్పు ఏ స్థాయిలో ఉందో చాలామంది గ్రహించలేకపోవడానికి కారణం" అని గావ్‌డాట్ అభిప్రాయపడ్డారు.



## శత్రువులపై కందిరీగల దండు

### రూ.5లక్షల కోట్లతో డ్రోన్లు సిద్ధం చేస్తున్న అమెరికా

ఇరాన్‌తో యుద్ధంలో డ్రోన్ల తాకిడికి ఎదురుదెబ్బలు తిన్న అమెరికా ఇప్పుడు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తన అమ్ములపొదిలోకి భారీఎత్తున చౌకబారు డ్రోన్లను చేర్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఏకంగా రూ.5 లక్షల కోట్ల వరకు వెచ్చించనున్నట్లు ఆ దేశ మీడియా కథనంలో పేర్కొంది. ఈ క్రమంలో వివిధ కంపెనీలు, డ్రోన్ రేసర్లు ప్రారంభించిన స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడంపై దృష్టిపెట్టింది. దీంతోపాటు పెంటగాన్‌కు అవసరమైన డ్రోన్లు తయారుచేసే సంస్థలను ఎంపిక చేసేందుకు పోటీ పెట్టింది. దీనికి 'డ్రోన్ డామినెన్స్' అనే పేరును ఖరారు చేసింది. ఈ పోటీ ద్వారా కంపెనీలకు 1.1 బిలియన్ డాలర్లు సమకూర్చి 3,00,000 డ్రోన్లను తయారుచేయిస్తోంది. కాలిఫోర్నియాకు చెందిన నీరోస్ కంపెనీ, బ్రిటన్‌కు చెందిన స్కైకట్టర్స్ ఈ రకం డ్రోన్ల తయారీ రేసులో ముందంజలో ఉంది. ఇప్పటికే ట్రంప్ కార్యవర్గం 54.6 బిలియన్ డాలర్లు (రూ.5 లక్షల కోట్లకు పైగా) వచ్చే ఏడాది రక్షణ బడ్జెట్ నుంచి సమకూర్చుకొనేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు పెంటగాన్ మొదలుపెట్టిన పోటీల్లో పరీక్షించిన డ్రోన్లు ఒక్కోటి సుమారు 5,000 డాలర్లు మాత్రమే. యుద్ధంలో వీటిని కోల్పోయినా పెద్దగా నష్టం ఉండకుండా చూసుకొంటోంది. ఈ పోటీలకు వచ్చిన డ్రోన్లను సైనిక సిబ్బంది వాస్తవ యుద్ధ రంగ పరిస్థితులకు అనుగుణంగా పరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో సుదూర లక్ష్యాలు, నిర్మాణాల్లో ఉండే టార్గెట్లపై ప్రయోగించారు. ఇప్పటివరకు జరిగిన తొలిరౌండ్‌లో 26 కంపెనీలు పోటీపడగా, బ్రిటన్‌కు చెందిన స్కైకట్టర్ విజేతగా నిలిచింది. దీనికి ఈ కంపెనీకి 2,500 డ్రోన్ల తయారీకి ఆర్డర్ లభించింది.

## పోక్సో కేసులో దోషికి 20 ఏళ్ల జైలు శిక్ష

హైదరాబాద్(జనంసాక్షి):పోక్సో కేసులో 70 ఏళ్ల వృద్ధుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. చాంద్రాయణగుట్టలో 2023లో మైనర్ బాలికపై లైంగిదాడి వ్యవహారంలో వృద్ధుడిపై కేసు నమోదైంది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడు మహ్మద్ జమీరుద్దీన్‌ను అరెస్టు చేశారు. ఆధారాలు పరిశీలించి, వాదోపవాదాలు విన్న కోర్టు.. ఈ కేసులో జమీరుద్దీన్‌ను దోషిగా తేల్చింది. అతడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

## నిరుద్యోగులకు తీపికబరు

సివిల్ ఇంజినీర్ పోస్టులకు ఈ నెల 6 నుంచి జులై 13 వరకు; అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పోస్టులకు ఈ నెల 8 నుంచి జులై 15వరకు; పీసీబీలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులకు జూన్ 10 నుంచి జులై 17వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. పూర్తి నోటిఫికేషన్లను తమ అధికారిక వెబ్‌సైట్‌లో చూడొచ్చని టీజీపీఎస్సీ కార్యదర్శి ఎం.హరిత ఓ ప్రకటనలో తెలిపారు.

## పెళ్లయిన కుమార్తెలకు కారుణ్య నియామకం సబబే..

వివాహితురాలైన కుమార్తె భాగం కాదంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తాజాగా సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. అర్హత ఉన్న కుమార్తెకు.. పెళ్లయిందన్న కారణాన్ని సాకుగా చూపి కారుణ్య నియామకాన్ని నిరాకరించడం సరికాదని బాంబే, కర్ణాటక హైకోర్టులు గతంలో ఇచ్చిన తీర్పులతో ఏకీభవిస్తున్నట్లు వెల్లడించింది. కారుణ్యం ఆధారంగా తనకు ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ లైసెన్స్ ఇప్పించాలంటూ ఒక మహిళా పిటిషనర్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. కుటుంబ నిర్వచనం నుంచి వివాహితురాలైన కుమార్తెను పక్కనపెడుతూ 2019లో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఆమె సవాలు చేశారు. తనకు వివాహం జరిగినప్పటికీ.. దివ్యాంగురాలైన సోదరిని చూసుకుంటూ, తల్లితో కలిసి ఆ దుకాణాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. తల్లి మరణం తర్వాత ఆమె లైసెన్స్‌కు దరఖాస్తు చేయగా.. అధికారులు తిరస్కరించారు. ప్రభుత్వ ఆదేశాలనే అలహాబాద్ హైకోర్టు సమర్థించగా.. ఆ తీర్పును సుప్రీం పక్కనపెట్టింది. ఆమెకు లైసెన్స్ నిరాకరిస్తూ జారీ చేసిన ఆదేశాలను తోసిపుచ్చింది. నాలుగువారాల్లో ఆమెకు లైసెన్స్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

## 'ఆమెను 600 మంది రేప్ చేశారు'

### పాక్ ముఠాల ఆగడాలపై బ్రిటన్ ఎంపీ

లండన్:బ్రిటన్‌లో లైంగిక వేధింపుల ముఠాల అరాచకాలపై అక్కడి చట్టసభ మరోసారి చర్చించింది. అనేక రాష్ట్రాల్లో చిన్నారులు, మహిళల లైంగిక దోపిడీకి సంబంధించి స్వతంత్ర దర్యాప్తు నివేదికలోని సంచలన విషయాలను బాహ్య ప్రపంచం ముందుంచింది. వ్యవస్థీకృత ముఠాల వేధింపులు, అత్యాచారాలు, పోలీసులు వ్యవహరించిన తీరు, తదితర అంశాలపై బాధితులు, సాక్ష్యులు ఇచ్చిన వాంగ్మూలాలను కొందరు చట్టసభ సభ్యులు వివరించారు. అయితే, ఈ దారుణాలకు పాల్పడిన వారిలో ఎక్కువశాతం పాకిస్థాన్ మూలాలున్న ట్యాక్సీ డ్రైవర్లు, వ్యాపారులే ఉన్నట్లు గతంలో తేలిన విషయం తెలిసిందే.బ్రిటన్ పార్లమెంట్ సభ్యుడు రూపెర్ట్ లోవ్ మాట్లాడుతూ.. "లైంగిక దాడులకు గురైన వారిలో ఎంతో మంది చిన్నారులు, మహిళలు ఉన్నారు. మైనర్‌గా ఉన్నప్పుడే తనపై లైంగిక దాడి జరిగిందని ఓ బాధితురాలు చెప్పింది. మూడేళ్లలో ఆమెపై 600-700 మంది అత్యాచారం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. తన ప్రైవేటు భాగాలను తీవ్రంగా గాయపరిచినట్లు మరో మహిళ పేర్కొంది. బాధితులను జంతువుల్లా చూసినట్లు అనేక మంది చెప్పారు. శ్వేతజాతీయులనే లక్ష్యంగా చేసుకొని ఈ ముఠాలు లైంగిక హింసకు పాల్పడ్డాయని మరికొందరు బాధితులు వాంగ్మూలం ఇచ్చారు. కొందరు పోలీసు అధికారులు వ్యవహరించిన తీరుపైనా అనేక ఆరోపణలు ఉన్నాయి" అని వివరించారు. ఇలాంటి దురాగతాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని చట్టసభ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. బ్రిటన్‌లో లైంగిక వేధింపుల ముఠా అరాచకాల విషయం 2002లో తొలిసారి వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ మూలాలున్న అనేక మంది.. దేశవ్యాప్తంగా కొన్ని వర్గాల అమ్మాయిలను లక్ష్యంగా చేసుకొని లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సౌత్ యార్క్‌షైర్‌లో 2010లో కొందరు మైనర్ అమ్మాయిలను వేధించిన కేసులో పాక్



మూలాలున్న ఐదుగురు దోషులుగా తేలడం అప్పట్లో సంచలనం రేపింది. అనంతరం రోచ్‌డేల్, రోథర్‌హ్యామ్, ఓల్డ్‌హ్యామ్, టెల్ఫోర్డ్ తదితర ప్రాంతాల్లో జరిపిన దర్యాప్తులో ఈ వ్యవస్థీకృత ముఠాల దుర్మార్గాలు బయటపడ్డాయి. అయితే, చాలా కేసుల్లో పోలీసు అధికారుల పాత్ర కూడా ఉందని, బాధితుల ఫిర్యాదులపై సరైన చర్య తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

## ప్రైమ్ యూజర్లకు షాక్..

### అమెజాన్ మ్యూజిక్‌లో ఇక యాడ్స్

:ప్రైమ్ యూజర్లకు అమెజాన్ షాకిచ్చింది. ఇన్నాళ్లు వీరికి ఉచితంగా లభిస్తున్న అమెజాన్ మ్యూజిక్‌లో ఇకపై అడ్వర్టైజ్‌మెంట్లు రానున్నాయి. ఒకవేళ యాడ్‌ఫ్రీ మ్యూజిక్, ఆఫ్‌లైన్ డౌన్‌లోడ్, ప్రీమియం క్వాలిటీ ఆడియో ఎక్స్‌పీరియన్స్ కావాలనుకునేవారు పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం 'అమెజాన్ మ్యూజిక్ అన్‌లిమిటెడ్' పేరిట కొత్త ప్లాన్‌ను తీసుకొచ్చింది.అమెజాన్ మ్యూజిక్ సేవలను మూడు కేటగిరీలుగా విభజించింది. అమెజాన్ మ్యూజిక్ అన్‌లిమిటెడ్ అనేది ఇందులో పెయిడ్ ప్లాన్. దీంట్లో ప్రీమియం మ్యూజిక్, హై ఆడియో క్వాలిటీ ఫీచర్లు ఉన్నాయి. 100 మిలియన్ పాటలు, పాడ్‌కాస్ట్‌లు, హెచ్‌డీ, అల్ట్రా హెచ్‌డీ, స్పేషియల్ ఆడియో, డాల్బీ అట్మాస్ వంటి ఫీచర్లు లభిస్తాయి. ఇందుకోసం ప్రైమ్ యూజర్లు నెలకు రూ.99, నాన్-ప్రైమ్ యూజర్లు రూ.119 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి ఈ ప్లాన్‌ను ప్రైమ్ మెంబర్లకు ఆరు నెలల పాటు ఉచితంగా అందిస్తోంది. ఇక అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్‌తో పాటు వచ్చే అమెజాన్ మ్యూజిక్‌కు ఎలాంటి డబ్బులూ చెల్లించనక్కర్లేదు. ఇందులో 100 మిలియన్ పాటలు, పాడ్‌కాస్ట్‌లు లభిస్తాయి. అయితే, అడ్వర్టైజ్‌మెంట్లు దర్శనమిస్తాయి. ఆఫ్‌లైన్ డౌన్‌లోడ్ సపోర్ట్‌ను నిలిపివేశారు. 'అమెజాన్ మ్యూజిక్ ఫ్రీ' పేరుతో ఉచిత ప్లాన్ త్వరలో భారత్‌లో అందుబాటులోకి రానుంది. అయితే, ఇందులో పెయిడ్ ప్లాన్‌తో పోలిస్తే పరిమిత ఫీచర్లు మాత్రమే ఉంటాయి. పైగా మధ్యమధ్యలో యాడ్స్ వస్తాయి. ఇప్పటికే పలు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఫ్రీ, యాడ్ సపోర్ట్, ప్రీమియం ప్లాన్‌లను తీసుకొచ్చాయి. అమెజాన్ కూడా ఇప్పుడు అదే బాటలో పయనిస్తోంది.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
3 జూన్ 2026

# మూలమాడలో భగ్గుమన్న పాతకక్షలు

## ఒక్కరిపై ఒక్కరు కర్రలతో దాడులు

### ఇరు వర్గాలపై కేసు నమోదు : డీఎస్పీ అంజయ్య



**నవాబ్ పేట్ జూన్ 2 (జనం సాక్షి) :** పాత కక్షలు మనసులో పెట్టుకొని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటనతో గ్రామంలో ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది.ఈ ఘటనకు సంబంధించి డిఎస్పి అంజయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.నవాబుపేట మండలం మూలమడ గ్రామానికి చెందిన జిన్నారం యాదయ్య అనుచరులు సోమవారం రాత్రి వాటర్ మెన్ ఆలంపల్లి కిష్టయ్య కుటుంబంపై దాడి చేయగా ఈ విషయాన్ని కిష్టయ్య కుమారుడు లక్ష్మణ్ సర్పంచ్ మామ సుభాన్ రెడ్డికి సమాచారం ఇవ్వగా గొడవ జరుగుతున్న స్థలానికి సర్పంచ్ మామ చేరుకోగా ఆయనపై కూడా యాదయ్య అనుచరులు దాడి చేశారు.సమాచారం తెలుసుకున్న సుభాన్ రెడ్డి కుమారుడు నరేందర్ రెడ్డి మా నాన్ననే కొడతారా అంటూ అనుచరులతో కలిసి ఆవేశంలో బాలరాజు ఇంటిపై ఆయన అనుచరులపై నరేందర్ రెడ్డి ఆయన అనుచరులు కర్రలతో దాడి చేశారు.ఈ దాడితో గ్రామంలో భయానక వాతావరణం ఏర్పడింది.ఇంతటితో ఊరుకోక మరుసటి రోజు ఉదయం నరేందర్ రెడ్డి, అనుచరులు మరోమారు దాడులకు పాల్పడ్డారు.సంఘటన జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు గ్రామానికి చేరుకొని ఇరు వర్గాలను అదుపు చేశారు.ఈ దాడుల్లో ఎస్సీ ఎస్టీ కింద 9 మందిపై,105 బిఎన్ఎస్ కింద 8 మంది పై కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు.చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని దాడులు చేయ డం,వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు ఉంటాయన్నారు.ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.అలర్లు,అలజడులు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.ఈ సమావేశంలో సీఐ వెంకట్, ఎస్సైగిరి,సిబ్బంది ఉన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సేవలను స్మరించుకోవడం ప్రతిపౌరుడు బాధ్యత

## మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, జూన్ 02 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర నిర్మాణం కోసం పోరాడిన ఉద్యమ వీరుల త్యాగాలను ఎప్పటికీ మరువరాదని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే వారికి నిజమైన నివాళి అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ బాగ్లింగంపల్లి సుందరయ్య కేంద్రంలో బండారు విజయలక్ష్మి అధ్యక్షతన అలాయ్ బలాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సన్మాన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిధులుగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,మాజీ గవర్నర్ సి హెచ్ విద్యాసాగర్ రావు, ఎంపీ ఈటెల రాజేందర్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండ రామ్, సీహెచ్ విఠల్, ప్రో. పురపాటి వెంకట నారాయణ, బూర నర్సయ్య గౌడ్, పాశం యాదగిరిలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సేవలను స్మరించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనేది లక్షలాదిమంది ప్రజలు త్యాగాలు, విద్యార్థులు పోరాటాలు ఉద్యోగ సంఘాల కృషి కళాకారుల చైతన్యం మేధావులు మార్గదర్శకత్వం ఉద్యమకారుల అంకితభావ ఫలితం అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని తెలంగాణ సాధన కోసం



నిరంతరం పోరాడి ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులను సన్మానించడం ఆనందదాయకమని అన్నారు. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని రాష్ట్ర సాధనకు తమ వంతు సేవలను అందించిన వివిధ రంగాల ప్రతినిధులను గుర్తించి, వారిని సన్మానించడం వర వారి సేవలను గుర్తించి భావితరాలకు స్ఫూర్తి నిలబడం లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమ కారులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు,పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# అభివృద్ధిలోనే కాదు

## పెద్దపల్లి పార్లమెంటరీ కాంగ్రెస్ నేత ఆసంపల్లి శ్రీనివాస్

**అంతర్గాం, జనంసాక్షి:** తెలంగాణ రాష్ట్రంను అభివృద్ధిలోనే గాకుండా ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్న ఘనత మంత్రి శ్రీధర్ బాబుకే దక్కుతుందనీ, అందుకు కాళేశ్వరం వద్ద జరిగిన సరస్వతీ నది అంత్య పుష్కరాలే నిదర్శనమని పెద్దపల్లి పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ నేత ఆసంపల్లి శ్రీనివాస్(వాసు) అన్నారు. మంథని నియోజక వర్గంలోని కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమంలో సరస్వతీ అంత్యపుష్కరాల ముగింపు ఉత్సవాలకు హాజరైన ఆయన మంత్రి శ్రీధర్ బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాళేశ్వరం ఆలయంను గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తుండటం హర్షణీయమని పేర్కొన్నారు. భక్తుల కోసం తొలిసారిగా టెంట్ సిటీ ఏర్పాటు చేయడం అమోఘమన్నారు.

# 4న సీఎం రేవంత్‌కు జెండాలతో స్వాగతం పలుకుదాం

- మాగనూరు కృష్ణ మండలాల నుంచి ఇంటికొకరు తరలాలి
- మక్తల్ ప్రాంతంలో 8 టీఎంసీల వరకు నీటిని నింపుకునే అవకాశం
- ఎన్నిసార్లు గెలిచామన్నది కాదు... ఒక్కసారి గెలిచినా ఏం చేశామన్నది ముఖ్యం
- ప్రస్తుతం మక్తల్ కోర్టుకు.. పేట నుంచి లాయర్లు వస్తున్నారు
- తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**మక్తల్, జూన్ 02 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ధ్యేయమని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్‌లో ఈ నెల 4 వ తేదీన ముఖ్యమంత్రి పర్యటన పై మంత్రి క్యాంపు కార్యాలయం లో మాగనూరు, కృష్ణ, నర్వ మండలాల నాయకులు, రైతులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడు తూ నారాయణపేట జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. జూన్ 4 వ తేదీన మక్తల్ ప్రాంతం లో సాగునీటి ప్రాజెక్టులపై సీఎం ఏరియల్ సర్వే చేయనున్నట్లు తెలిపారు. కృష్ణా నది పై మూడు చోట్ల బ్రిడ్జి కమ్ బ్యారేజ్ లు కొల్పూర్- కొర్తికొండ వద్ద 1.8 టీఎంసీ, మురారి దొడ్డి - గంజి పల్లి, దేవసూగురు వద్ద బ్రిడ్జి కం బారేజ్ లు అదేవిధంగా భీమా నది పై రెండు చోట్ల బ్రిడ్జి కమ్ బ్యారేజ్ లు సుకుర్ లింగం పల్లి వద్ద ఒకటి, కుసుముర్తి వద్ద మరొకటి బ్రిడ్జి కం బారేజ్ లకు కూడా ముఖ్య మంత్రి ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ల్లో బ్యారేజీలు నిర్మించడం ద్వారా జిల్లాకు సాగు, తాగు నీటి సమస్య తీర్చవచ్చని తెలిపారు.ప్రాజెక్టు పరిధిలో 51 శాతం భూభాగం తెలంగాణకు, 49 శాతం కర్ణాటకకు ఉండటంతో రెండు రాష్ట్రాలకు సమాన ప్రయోజనం కలిగే విధంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్నాటక సాగునీటి మంత్రి బోసు రాజు, కర్ణాటక రాష్ట్ర ప్రతినిధులతో కలిసి జూన్ 4, 5 తేదీల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కీలక సాగునీటి ప్రాజెక్ట్ లపై సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.5 వేల కోట్లతో మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నామని అన్నారు. సీఎం ఏరియల్ సర్వే చేపట్టే చోట బ్రిడ్జ్ కం బ్యారేజీలో పూర్తయి అందుబాటులోకి వస్తే కేవలం మక్తల్ నియోజకవర్గానికి మాత్రమే దాదాపు 8 టీఎంసీల వరకు మీరు అందుబాటులోకి ఉంటుందని మంత్రి తెలిపారు. ఏరియల్ సర్వే నిర్వహించే ప్రాంతాల్లో ఆయా మండలాల నుంచి ప్రతి ఇంటికి ఒకరు చొప్పున తరలివచ్చి జెండాలతో స్వాగతం పలికి.. సీఎం రేవంత్ కు పెద్ద ఎత్తున హర్షధ్వనాలు తెలపాలని సూచించారు. దీంతోపాటు నర్వ మండలంలోని జంగంరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రభుత్వం 175 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా 13 గ్రామాల్లోని సుమారు 7,500 ఎకరాలకు సాగునీరు అందనుందని చెప్పారు. ఎన్నిసార్లు గెలిచామన్నది ముఖ్యం కాదని.. ఒకసారి గెలిచినా ఏం చేశామన్నది ముఖ్యమని... అదే ప్రజల్లో చిరస్థాయిగా గుర్తింపు తీసుకొస్తుందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాలకు నూతనంగా బీటీ రోడ్లు మంజూరు చేసుకున్నామని, అనేక చోట్ల సిసి రోడ్లు డ్రైనేజీల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మక్తల్ ను అభివృద్ధి చేసుకుందామన్నదే తమ లక్ష్యమని వివరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, నాయకులు బాలకృష్ణారెడ్డి, కట్టా సురేష్ గుప్తా, గణేష్ కుమార్, అల్కూరి రవికుమార్, ఆనంద్ గౌడ్, రాజప్ప గౌడ, వార్డు కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు, సర్పంచులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం

## అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, జూన్ 02 (జనంసాక్షి) :**తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చినదని, ప్రజలందరికీ వనరులు అందుబాటులో ఉంటున్నాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, కాలేజెస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి అమరవీరుల, తెలంగాణ తల్లి చిత్రపటం వద్ద చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఎంతోమంది అమరుల త్యాగ ఫలితమేని, పలువురి పోరాటాల ద్వారా తెలంగాణ రాష్ట్రం 2014లో సాధ్యమైనదని, మన దేశంలోని 29 రాష్ట్రంగా పరిగణించడం జరిగిందని వారు చెప్పారు. మన రాష్ట్రం మన వనరుల తో మన అభివృద్ధిని సాధ్యం చేస్తుందని అభిప్రాయపడ్డారు.చాకలి ఐలమ్మ , కొమరం భీమ్ తదితరుల నుండి స్ఫూర్తిని తీసుకొని పోరాటపటిమను కొనసాగించి ఎటువంటి జాప్యం లేకుండా దీటుగా సమాధానాలు ఇచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సాధింపచేసుకున్నామని, కలను సహకారం చేసుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేకమైన ప్రణాళికలతో, కార్యక్రమాలతో మనం అన్ని రంగాలలో రాణిస్తున్నామని హర్షం వ్యక్తం చేస్తూ.. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని వారు చెప్పారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రత్యేకంగా ఉద్యమాల సమయంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల పాత్ర చాలా మరువలేనిదని చెప్పారు. వేడుకలలో భాగంగా ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్ర గేయాలను ఆలపించి రాష్ట్రం పట్ల బాధ్యతను, ఆప్యాయతను పెంపొందించారు.

# భారీ అక్రమ ఇసుక డంపుల పట్టివేత

## రెవెన్యూ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి అక్రమ నిల్వలు

**కథలాపూర్, జూన్ 2 (జనంసాక్షి):** కథలాపూర్ మండలంలో భారీ ఎత్తున అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు గుర్తించి పట్టుకున్నారు. మండలంలోని బొమ్మన గ్రామం ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో, తాండ్రయాల మెయిన్ రోడ్డులోని జీకే గార్డెన్ వద్ద, పోసానిపేట గ్రామంలోని ఎల్లమ్మ గుడి సమీపంలో, కథలాపూర్ మెయిన్ రోడ్డులోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ ఎదుట అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను అధికారులు తనిఖీ చేశారు.
తనిఖీల సందర్భంగా సుమారు 165 ట్రాక్టర్ల ఇసుక నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని వాటికి సంబంధించిన వివరాలను నమోదు చేశారు. ఆర్ఐ రవీందర్, తహసీల్దార్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో అక్రమ నిల్వలకు బాధ్యులైన వ్యక్తులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఇసుకను అక్రమంగా నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.
మండలంలో అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు.



## మహిళలు రవాణా రంగంలో ప్రవేశించడం వల్ల

# మహిళా సాధికారత

### ఎలక్ట్రిక్ ఆటో పంపిణీ

**మెదక్ జూన్ 2( జనం సాక్షి) :** అజివిక గ్రామీణ ఎక్స్ ప్రెస్ యోజన పథకం కింద 3,35,000 రూపాయల ధర కల్గిన మహేంద్ర ఎలక్ట్రిక్ ఆటోను మక్తా భూపతిపూర్ గ్రామానికి చెందిన కే.సంధ్య రాణి కి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గారి చేతుల మీదుగా పంపిణీ చేశారు.
సంధ్య రాణి గత రెండు సం: కిత్రం గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఉపాధి నిమిత్తం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు పరిశీలిన అనంతరం సంధ్య రాణినీ అర్హులు గా గుర్తించి ఆటో ను మంజూరు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా వెనుకబడిన ప్రాంతాలలో నివసించే ప్రజలకు సురక్షితమైన రవాణా అందుబాటులోకి వస్తుందనీ, మహిళలు రవాణా రంగంలోకి ప్రవేశించడం వల్ల మహిళా సాధికారత పెరుగుతుందనీ అన్నారు. ఆజీవిక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన అనేది ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఒక ప్రత్యేకమైన పథకం. గ్రామీణ ప్రాంతాలలో నివసించే స్వయం సహాయక సంఘాల (గాన+) మహిళలకు రవాణా సేవలను నడుపుకునే అవకాశం కల్పించడం ద్వారా, వారికి అదనపు ఆదాయాన్ని మరియు ఉపాధిని అందించడం దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు. మహిళలు సొంతంగా ఆర్థికంగా ఎదగాలన్నారు. మక్తా భూపతిపూర్ లో రవాణాకు సమస్య ఉందని ,ఎలాంటి సౌకర్యం లేదని తన దృష్టికి వచ్చిన వెంబడే ఎలక్ట్రిక్ ఆటో మంజూరు చేశామన్నారు. ఆటో డ్రైవర్ గా మారి అదనపు కలెక్టర్ నగేష్ ఆటో నడిపారు. ఆటోలో ప్రయాణికులుగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రయాణించారు. ఈ సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు,అదనపు గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సరస్వతి,డి పి యం యాదయ్య, ఏ పి యం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ముళ్ళ పొదల్లో.. నవజాత శిశువు



## న్యాల్‌కల్‌లో..మనసు చెలించే ఘటన

**న్యాల్‌కల్, జూన్ 02, (జనం సాక్షి) :** అభం.. శుభం ఎరగని ఓ పసికందు, నవజాత శిశువును ఓ ముళ్ళ పొదల్లో పార వేసిన దయనీయ ఘటన మంగళవారం ఉదయం సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ ల్లో చోటు చేసుకుంది. అ పసికందు కళ్ళు తెరవక ముందే గుర్తుతెలియని ఓ కసాయి తల్లి గుట్టు చప్పుడు కాకుండా ఓ వ్యవసాయ పొలంలోని ముళ్ళ పొదల్లో పారవేసి పరారైంది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది, ఘటనాస్థలిలో స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..



**న్యాల్‌కల్‌ల్లో నవజాత శిశువు ముళ్ళ పొదల్లో....**

న్యాల్‌కల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమీపం, ఓ వ్యవసాయ పొలంలోని ఓ ముళ్ళ పొదల్లో మంగళవారం ఉదయం అప్పుడే జన్మించిన నవజాత శిశువు (మగ బిడ్డ) ఓ గుర్తు తెలియని గర్భిణి ప్రసవ అనంతరం ముళ్ళ పొదల్లో పారవేసి పరారైంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం జెండాను ఆవిష్కరిస్తుండగా.. ఆసుపత్రి సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో నవజాత శిశు ఏడుస్తున్న విషయాన్ని గమనించిన సమీప మాణిక్ నగర్ కాలనీకి చెందిన కొందరు మహిళలు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. ముళ్ళ పదల్లో పడి ఉన్న మగ శిశువును స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇచ్చి తరలించారు.

**చికిత్సలు చేపట్టిన వైద్య సిబ్బంది...**

గుర్తుతెలియని నవజాత శిశువును స్థానిక వైద్యాధికారి డాక్టర్ జైన్ అమృత్ రాజ్, ఆరోగ్య సిబ్బంది అవసరమైన వైద్య చికిత్సలు చేపట్టారు. అనంతరం శిశు సంక్షేమ శాఖాదికారుల పర్యవేక్షణలో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సల అనంతరం అంగన్వాడి మండల పరివేక్షకురాలు సమక్షంలో వైద్య సిబ్బంది సంగారెడ్డిలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నవజాత శిశు ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. జిల్లా శిశు సంక్షేమ అధికారుల ఆదేశం మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు మండల శిశు సంక్షేమ అధికారులు స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై సుజిత్ ఆదేశం మేరకు స్థానిక పోలీసులు న్యాల్ కల్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి విచారణ చేపట్టారు. జిల్లా, మండల శిశు సంక్షేమాధికారులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన అనంతరం విచారణ చేపట్టనున్నట్లు స్థానిక ఎస్సై సుజిత్ తెలిపారు.

**సందడిగా ఆసుపత్రి ఆవరణ...**

ముళ్ళ పొదల్లో పసికందు పార వేసిన సమాచారాన్ని తెలుసుకున్న స్థానికులు ఆస్పత్రికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక సహకార సంఘం చైర్మన్ సిద్ది లింగయ్య స్వామి, బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, చోటు చేసుకున్న ఘటన విషయాన్ని తెలుసుకున్నారు. అవసరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని స్థానిక వైద్యాధికారులు, శిశు సంక్షేమ అధికారులు, పోలీసులకు విన్నవి ంచా రు. ఈ దారుణమైన ఘటన చోటు చేసుకోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు.



# తెలంగాణ కోసం మరో దశ పోరాటం అవసరం

- రాష్ట్రాన్ని దోపిడీ శక్తుల నుంచి కాపాడుకోవాలని కసిరెడ్డి భాస్కర్ రెడ్డి పిలుపు
- నీళ్లు, నిధులు, నియామకాలే అసలు లక్ష్యమని వ్యాఖ్య
- తెలంగాణ వనరుల పరిరక్షణకు యువత ముందుకు రావాలని సూచన
- అమరవీరుల ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపు

**శేరిలింగంపల్లి, జూన్ 2 (జనంసాక్షి):**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం నీళ్లు, నిధులు, నియామకాల సాధనే ప్రధాన లక్ష్యంగా ఏర్పడిందని, ఆ లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరేందుకు మరో దశ పోరాటం అవసరమని 'జనంకోసం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మియాపూర్ పరిధిలోని దీప్తి శ్రీనగర్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ప్రజలు, యువత, విద్యార్థులు, వివిధ వర్గాలు చేసిన త్యాగాలు మరువలేనివని ఆయన అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా స్థానిక ప్రజల ఆకాంక్షలు పూర్తిస్థాయిలో నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వార్థపూరిత రాజకీయాలు, అవకాశవాద ధోరణుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని విమర్శించారు.
తెలంగాణ ఉద్యమం ఆశయాలకు అనుగుణంగా స్థానికులకు నీళ్లు, నిధులు, ఉద్యోగాలు అందేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత, విద్యార్థులు, సబ్బండ వర్గాలు ముందుకు వచ్చి రాష్ట్ర భవిష్యత్తు కోసం పనిచేసే నాయకత్వాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అమరవీరుల



కలలను సాకారం చేసే దిశగా సమాజం కృషి చేయాలని సూచించారు.
ఈ సందర్భంగా 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న హన్మంత్‌రావు మాట్లాడుతూ తెలంగాణ వనరులు పరుల చేతుల్లోకి వెళ్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మాజీ సైనికుడు నాగం రాజశేఖర్ మాట్లాడుతూ చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టేందుకు ప్రజలు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జెండా ఆవిష్కరణ అనంతరం జాతీయ గీతం ఆలపించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అశోక్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కర్లపూడి రాఘవేందర్‌రావు, శివకుమార్ వర్మ, బాలు, సురేష్, నాగరాజు తదితరులతో పాటు దీప్తి శ్రీనగర్ కాలనీవాసులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ సభపై బీఆర్ఎస్ ఆగ్రహం

- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున సభ నిర్వహించడం సరికాదు: జి.వి. రామకృష్ణారావు


**కరీంనగర్ టౌన్, జూన్ 2: (జనం సాక్షి) :**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు జాతీయ పతాకంతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులు, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువత, ఉద్యోగులు, మేధావులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సేవలను ఈ సందర్భంగా స్మరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను గుర్తు చేస్తూ, తెలంగాణ సాధనలో ఆయన పాత్ర చారిత్రాత్మకమని జి.వి. రామకృష్ణారావు పేర్కొన్నారు.
అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున హైదరాబాద్‌లో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సభ నిర్వహించాలని నిర్ణయించడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన ఆంధ్ర ప్రాంత రాజకీయ నాయకులు ఇప్పుడు తెలంగాణలో రాజకీయంగా పాగా వేయాలని ప్రయత్నించడం దురదృష్టకరమని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఎవరూ వ్యవహరించే సాహసం చేయలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్ర రాజకీయ శక్తులకు తెలంగాణలో అవకాశాలు కల్పిస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజల



మనోభావాలను గౌరవించకుండా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున సభలు నిర్వహించడం తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు.
తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన నాయకులు తెలంగాణ ప్రజలకు నీతులు చెప్పే హక్కు లేదని, పవన్ కళ్యాణ్ చౌకబారు రాజకీయాలు మానుకుని తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించాలని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని, తెలంగాణ ప్రజల హక్కులను కాపాడగలిగే శక్తి బీఆర్ఎస్ మరియు కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఎలాంటి రాజకీయ శక్తులనైనా బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసం కృషి చేయాలని జి.వి. రామకృష్ణారావు పిలుపునిచ్చారు.

# రైతుకు భరోసా ఏది?



## వాగ్దానాలు ఘనం.. అమలు శూన్యం

- ప్రభుత్వానికి సవాల్ గా మారిన 'భరోసా'
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు
- పెట్టుబడి సాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు!

**సదాశివనగర్ జూన్ 2 (జనంసాక్షి) :**

*రాష్ట్రంలోని అన్నదాతల పరిస్థితి ఇప్పుడు "ఆశలు అడియాశలు" అన్నట్లుగా తయారైంది. ప్రభుత్వం నుంచి అందాల్సిన 'రైతు భరోసా' పెట్టుబడి సాయం మాత్రం ఇంకా అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఏప్రిల్ నెలాఖరుకల్లా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నీటిమూటగానే మిగిలిపోవడంతో రైతాంగం తీవ్ర నిరాశలో కూరుకుపోయింది.*

**వాగ్దానాలు ఘనం..అమలు శూన్యం!**

ఎన్నికల సమయంలోనూ, ఆ తర్వాత జరిగిన సమీక్షల్లోనూ రైతు భరోసా పంపిణీపై ప్రభుత్వం భారీ ప్రకటనలే చేసింది. "గత నెలాఖరు నాటికి ఒక్క రూపాయి కూడా బాకీ లేకుండా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం వేస్తాం" అని ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా, బహిరంగ సభల్లోనూ స్పష్టం చేశారు. తీరా సమయం గడిచినా, నేటికీ క్షేత్రస్థాయిలో విదిల్చిన దాఖలాలు లేవు.

**అప్పుల ఊబిలో రైతులు**

ప్రభుత్వ సాయం వస్తుందని నమ్మి పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించిన రైతుల దుస్థితి వడ్డీలు కట్టలేక అప్పులు పెరుగుతుండడంతో అప్పుల ఊబిలో కూరుకపోతున్నారు. కౌలు రైతుల గోస: పట్టాదారులకే దిక్కులేకపోతే, తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్న కౌలు రైతులు ప్రశ్నిస్తున్నారు. చెప్పిన తేదీ దాటిపోయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం దారుణం అని రైతు సంఘాలు మండిపడుతున్నాయి. అసలు నిధుల కొరత ఉందా? లేక సాంకేతిక కారణాలా? అన్నది స్పష్టం చేయకుండా కాలయాపన చేయడం వల్ల సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు హెచ్చరిస్తున్నారు. "ప్రభుత్వం చెప్పిన మాట సీఎం ఎప్పుడు ఖాతాల్లో డబ్బులు వేస్తారో స్పష్టంగా చెప్పాలి. వాయిదాల మీద వాయిదాలు వేస్తూ రైతుల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

**ప్రభుత్వానికి సవాల్‌గా మారిన 'భరోసా'**

ఒకవైపు రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాలేదని, మరోవైపు రైతు భరోసా నిధులు విడుదల కాలేదని విపక్షాలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. రైతుల్లో పెరుగుతున్న అసహనాన్ని గమనించైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, పెట్టుబడి సాయంపై ఒక ఖచ్చితమైన తేదీని ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేని పక్షంలో అన్నదాతల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చేయాలని కోరుతున్నారు

# లింగాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజిరెడ్డి హత్య దురదృష్టకరం

- కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్
- రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 02 (జనంసాక్షి) :** కామారెడ్డి పట్టణ పరిధిలోని 9వ వార్డు లింగాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బండారి రాజిరెడ్డి హత్య అత్యంత విషాదకరమైన, బాధాకరమైన ఘటన అని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. మంగళవారం రాజిరెడ్డి నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చిన షబ్బీర్ అలీ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

రాజిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే కాకుండా లింగాపూర్ గ్రామానికే తీరని లోటని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి రాజిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులు ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. రాజిరెడ్డి హత్య ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కుటుంబ సభ్యులకు తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు.

కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. అనంతరం బండారి రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ బాధను తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్, గూడెం శ్రీనివాస్ రెడ్డి, రాజగౌడ్, వైద్య కిషన్ రావు, బండారి యాదవ రెడ్డి, మీసాల రమేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. షబ్బీర్ అలీ వెంట వారు ఉన్నారు.

# ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ కృషి

- ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 02 (జనంసాక్షి) :** ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారులు హనుమంతరావు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన ప్రభుత్వ సలహాదారులు, జిల్లా కలెక్టర్ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ప్రభుత్వ సలహాదారులు (బీసీ సంక్షేమ శాఖ) హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం ఐడీఓసీలో ఏర్పాటు చేసిన రాష్ట్ర అవతరణ దినోత్సవ ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారులు పోలీసు గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరియు సాధించిన ప్రగతిని వివరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వ సలహాదారులు హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మెమెంటోలు అందజేసి అభినందించారు.

అంతర్జాతీయ యోగా పోటీలలో ప్రతిభ కనబరిచిన యోగా విద్యార్థులకు రూ.50 వేల నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికలను అందజేశారు. అలాగే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఏడుగురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను ప్రభుత్వ సలహాదారులు, జిల్లా కలెక్టర్ సందర్శించి శాఖల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, గిరి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు,, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో రైతులకు సబ్సిడీ విత్తనాలు

## ప్రజా సంక్షేమం కోసం అభివృద్ధి పథకాలు పారదర్శకంగా అమలు చేయాలి

- తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ముందుకు
- 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక
- అమర వీరులకు ఘన నివాళులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూన్ 2 (జనం సాక్షి):** ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడానికి అంకితభావంతో జిల్లా అభివృద్ధికి శక్తి వంచన లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ అవతరణ దినోత్సవ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర సంవత్సరాల కాలంలో అనేక ప్రతిష్టాత్మక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. సామాజిక వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తూ సమగ్రాభివృద్ధి సాధిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ దారుణమైన అణిచివేతకు, దోపిడీకి గురైందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తప్ప తమ తలరాతలు మారవనే వాస్తవాన్ని గ్రహించి ఉవ్వెత్తున ఉద్యమించి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులందరికి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత్‌లో ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించి కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు.

ప్రభుత్వం 99 రోజుల 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'ను చేపట్టి మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు గ్రామీణాభివృద్ధి, ప్రజా సేవలు, సంక్షేమం, మౌలిక సదుపాయాల మెరుగుదలే లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్-అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, రక్షణ, మత్తు మందులకు దూరంగా ఉండటం, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళల సాధికారత, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

జనగణన భారతదేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించబడుతుందని, 2021లో జరగాల్సిన జనగణన కరోనా కారణంగా వాయిదా పడిందని, దాదాపు 16 సంవత్సరాల తర్వాత 2026లో జనగణన నిర్వహించబడనుందని ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

జిల్లాలో ఇప్పటివరకు 3 లక్షల 27 వేల నివాసాలకు, 2 లక్షల 66 వేల గృహాల గణన పూర్తయ్యిందని (81.01 శాతం) తెలిపారు. 2 లక్షల 65 వేల ప్రజాపాలన దరఖాస్తులు అందగా 2 లక్షల 51 వేల దరఖాస్తుల సర్వే పూర్తయిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత రవాణా, గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, రైతుబంధు, రైతు భీమా వంటి సంక్షేమ పథకాల వివరాలను కూడా ఆయన వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు, శాసనసభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్, మార్కెట్ కమిటీ చైర్మన్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# రాష్ట్రవ్యాప్తంగా 91 మంది ఖైదీలకు స్వేచ్ఛ

## సత్ప్రవర్తనకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

- 42 మందికి ఉపాధి అవకాశాలు, మహిళలకు కుట్టు మిషన్లు
- కొత్త జీవితాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని సూచన
- ఖైదీల పునరావాసానికి జైళ్లశాఖ ప్రత్యేక చర్యలు

**కాప్రా, జూన్ 2 (జనంసాక్షి):** సత్ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన క్షమాబిక్ష జీవో మేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 91 మంది ఖైదీలను విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి ఖైదీలు స్వేచ్ఛను పొందారు. విడుదల కార్యక్రమాన్ని జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా (ఐపీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించారు. విడుదలైన వారిలో 6 మంది మహిళలు, 85 మంది పురుషులు ఉన్నారు. ఖైదీల పునరావాసానికి ప్రాధాన్యం ఇస్తూ 38 మంది పురుషులకు వివిధ జైలు పెట్రోల్ బంకుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నియామక పత్రాలు అందజేశారు. అలాగే జైలులో శిక్షణ పొందిన నలుగురు మహిళా ఖైదీలకు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మొత్తం 42 మంది ఖైదీలకు ఉపాధి కల్పనకు సంబంధించిన సహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ, క్షమాబిక్షతో విడుదలైన ఖైదీలు సమాజంలో ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా జీవితాన్ని మలుచుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జైలు నుంచి విడుదలైన ఖైదీలకు ఉపాధి అవకాశాలు కల్పించడం సంతోషకరమని పేర్కొన్నారు. జైళ్లశాఖ చేపట్టిన సంస్కరణల ఫలితంగా అనేక మంది ఖైదీలు విద్యను అభ్యసించి డిగ్రీలు, పీజీలు పూర్తి చేయడంతో పాటు గోల్డ్ మెడల్స్ సైతం సాధించారని తెలిపారు.

ప్రతి ఖైదీకి సత్ప్రవర్తనతో పాటు ఉపాధి కల్పించే నైపుణ్యాలను నేర్పిస్తున్నామని చెప్పారు. స్టీల్ ఫ్యాబ్రికేషన్, వడ్రంగి పనులు, కుట్టు శిక్షణ తదితర రంగాల్లో శిక్షణ అందజేస్తున్నామని వివరించారు. విడుదల అనంతరం స్వయం ఉపాధి లేదా ఉద్యోగ అవకాశాల కోసం జైళ్లశాఖను ఎప్పుడైనా సంప్రదించవచ్చని తెలిపారు. అవసరమైన ప్రతి ఖైదీకి ఉపాధి కల్పించేందుకు శాఖ సిద్ధంగా ఉందన్నారు. విడుదలైన ఖైదీలు తమ స్వగ్రామాలకు చేరుకునే వరకు ప్రయాణ ఖర్చులను కూడా జైళ్లశాఖ భరిస్తుందని సౌమ్య మిశ్రా వెల్లడించారు. సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతూ కొత్త జీవితానికి శ్రీకారం చుట్టాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజీలు వై. రాజేష్, మురళిబాబు, డీఐజీలు శ్రీనివాస్, సంపత్, సూపరింటెండెంట్లు సంతోష్ కుమార్ రాయ్, శివకుమార్ గౌడ్, కళాసాగర్, వెంకటలక్ష్మి, ప్రమోద్, భరత్, అశోక్ కుమార్, డిప్యూటీ జైలర్లు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం

## వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, జూన్ 2 (జనంసాక్షి):** జూన్ 3 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామసభల ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ వీడియో సమావేశంలో గ్రామసభల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి గ్రామసభల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, వివిధ శాఖలు చేపట్టాల్సిన చర్యలు, ప్రజల సమస్యల స్వీకరణ, పరిష్కార ప్రక్రియ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పురోగతి తదితర అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గ్రామసభలను ప్రజలకు ఉపయోగకరంగా నిర్వహిస్తూ ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాలు నేరుగా లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించే విధంగా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామసభలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలి

- లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభించాలి
- పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు నీటి కేటాయింపు
- అక్రమ పనులు ఆపి, స్థానిక ప్రజల ఆకాంక్షలు తీర్చాలి
- జేఏసీ ఆధ్వర్యంలో సీఎంకు బహిరంగ లేఖ



**షాద్‌నగర్, జూన్ 2 (జనంసాక్షి):** పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు తక్షణం ప్రారంభించాలని పెండింగ్ ప్రాజెక్టుల జేఏసీ నాయకులు ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖను షాద్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట విడుదల చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు పోరాడి సాధించుకున్న 72 జీవో ప్రకారం జూరాల ఎగువ నుండి పీఆర్ఎల్ఐ లిఫ్ట్ పనులు చేపట్టాలని, ప్రస్తుతం జరుగుతున్న డిండి లిఫ్ట్ అక్రమ పనులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కృష్ణానది నుండి గొట్టిముక్కుల లిఫ్ట్ ద్వారా నల్గొండ జిల్లా భూములకు నీరు అందించాలని, 2005లో చేపట్టిన కల్వకుర్తి-నెట్టెంపాడు లిఫ్ట్ ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలని కోరారు.

ఆర్‌డీఎస్, జూరాల, బీమా-1, బీమా-2, కొయిల్‌సాగర్ పథకాలను పూర్తి చేసి నీటిని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, చంద్రశేఖర్ అమ్రాబాద్ ఎత్తిపోతల, జూరాల గట్టు ఎత్తిపోతల పథకాలను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ ప్రాంత ప్రజల కోసం రామగిరి రిజర్వాయర్ నిర్మించాలని, రసూల్ చెరువు, బల్మూర్ చెరువులను బాగు చేసి స్థానిక నీటిని కాపాడాలని కోరారు.

కర్ణాటక ప్రభుత్వంతో కృష్ణ-భీమా నదుల నీటి ఉమ్మడి వినియోగం కోసం చేపట్టిన చర్యలను కొనసాగించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్, మందారం నరసింహులు, టీజీ శ్రీనివాస్, నర్సింహులు గౌడ్, సత్యం, తిరుమలయ్య, రవికుమార్, కృష్ణ, వెంకటేష్, రామారావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా.. రాష్ట్ర అవతరణ వేడుకలు

- వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని వినతి
- అవతరణ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష
- గోదావరి పుష్కరాలు-2027 కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశం
- జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజే-ఐజేయూ వినతిపత్రం



**పెద్దపల్లి, జూన్ 2 (జనంసాక్షి):**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో వైభవంగా నిర్వహించడంతో పాటు గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అవతరణ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం, గోదావరి పుష్కరాల సన్నాహకాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదే రోజు వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై టీయూడబ్ల్యూజే-ఐజేయూ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జూన్ 2న జరిగే వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఉదయం గౌరవ వందనం, అమరవీరులకు నివాళులు, జాతీయ పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపన, తెలంగాణ గీతాలాపన, పరేడ్, ప్రశంసాపత్రాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సౌండ్ సిస్టం, విద్యుత్ సరఫరా, డయాస్, టెంట్లు, బ్యారికేడ్లు తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ, పుష్కరాల కోసం ఎండోమెంట్స్ శాఖ నిధులు విడుదల చేసిన నేపథ్యంలో ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. రహదారులు, ఘాట్లు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆర్ అండ్ బీ శాఖకు కేటాయించిన నిధులతో చేపట్టాల్సిన పనుల అంచనాలు, ప్రతిపాదనలు త్వరితగతిన సమర్పించాలని అధికారులకు నిర్దేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతం చేయాలని కోరారు. ఇదే సందర్భంగా టీయూడబ్ల్యూజే-ఐజేయూ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కార్డులను వెంటనే విడుదల చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మండల రిపోర్టర్లకు న్యాయం చేయాలని, బస్‌పాస్‌లు, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమాల్లో అదనపు డీసీపీ రామ్‌రెడ్డి, ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్ రాజయ్య, ఆర్ అండ్ బీ ఈఈ భావ్‌సింగ్, ఎండోమెంట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సుప్రియ, వివిధ శాఖల అధికారులు, టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మల్లావర్జుల వంశీ విద్యానంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ ఇసుక రవాణాపై కరీంనగర్ రూరల్ పోలీసుల కొరడా

## నాలుగు ట్రాక్టర్లు సీజ్

**కరీంనగర్ రూరల్, జూన్ 2 (జనం సాక్షి) :** అక్రమ ఇసుక రవాణాపై కరీంనగర్ రూరల్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. మంగళవారం గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, నగునూర్ గ్రామానికి చెందిన సూర రాజమౌళి, ఒర్సు నర్సయ్యలు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ కరీంనగర్ వైపు వెళ్తుండగా నగునూర్ గ్రామం వద్ద పోలీసులు వారిని పట్టుకున్నారు. అలాగే సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన నాగపూరి అజయ్, ఎలవేణి సంపత్‌లు మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శెడ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనల్లో ఉపయోగించిన నాలుగు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసి, నిందితులపై కేసులు నమోదు చేశారు. అనంతరం తదుపరి చర్యల కోసం వారిని కోర్టుకు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే సస్పెక్ట్ షీట్లు కూడా తెరిచే చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

# శంషాబాద్ జోనల్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**శంషాబాద్:** జీహెచ్‌ఎంసీ శంషాబాద్ జోనల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంషాబాద్ జోన్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ బి. సుమన్ రావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కె. సుష్మా మహేందర్ రెడ్డి, సంజయ్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్‌కు బ్రెస్ట్ ఇంప్లాంటేషన్‌కు సీఎంఆర్ఎఫ్!



హైదరాబాద్ (జనంసాక్షి) : చరిత్రలో తొలిసారిగా ఒక ట్రాన్స్‌జెండర్ మహిళకు బ్రెస్ట్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సహాయం అందించబడింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఒక ట్రాన్స్‌జెండర్ మహిళ శస్త్రచికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సహాయం అందించారు. తెలంగాణలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు అందరితో సమానమైన అవకాశాలు కల్పిస్తుండగా, తాజాగా ఆరోగ్య సేవలను కూడా అందుబాటులోకి తెచ్చి గౌరవప్రదంగా జీవించే హక్కులను మరింత బలోపేతం చేసే దిశగా మరో అడుగు పడిందని క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్ పేర్కొంది. శస్త్రచికిత్స విజయవంతమైన నేపథ్యంలో క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఎం. ముకంద మాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఓఎస్ డీ వేముల శ్రీనివాసులుని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభ సందర్భంగా, ట్రాన్స్‌జెండర్ సమాజం సంక్షేమం, సాధికారత, సామాజిక సమగ్రత కోసం అంకితభావంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌జెండర్‌లు, ఇతర ఎల్‌జీబీటీక్యూ సమాజ సభ్యుల సంక్షేమం కోసం, ముఖ్యంగా వారి ఆరోగ్య అవసరాల పరంగా, ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఇదివరకే ప్రకటించారు.

# 91 మంది ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష

**వారి ఉపాధికి తోడ్పాటు అందిస్తామన్న జైళ్లశాఖ డీజీ**



హైదరాబాద్, జూన్2 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది. దీంతో ప్రకటించిన ఖైదీలు జైళ్ల నుంచి విడుదల కానున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి వెంటనే నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. అలాగే విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విడుదల అవుతున్న వారు బాధ్యతాయుతంగా జీవించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటే.. జైళ్ల శాఖ చేసిన కృషి ఫలించినట్లవుతుందని సౌమ్యా మిశ్రా పేర్కొన్నారు. గత ఏడాది కొత్త ప్రభుత్వం 213 మంది ఖైదీల విడుదలకు అనుమతి ఇవ్వగా, ఈసారి మరో 91 మందికి క్షమాభిక్ష మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రత్యేక జీవో జారీ చేసిన ప్రభుత్వం, అర్హులైన ఖైదీలకు ఏడాదిలో మూడు సార్లు క్షమాభిక్ష ఆధారంగా విడుదల అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు.

# తెలంగాణ ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేదా పవన్?

- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్




హైదరాబాద్, జూన్ 2 (జనంసాక్షి) : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యక్రమం నిర్వహించాలన్న నిర్ణయంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్య ద్వారా తెలంగాణ, ఆంధ్ర ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు అత్యంత పవిత్రమైన రోజున సభ పెట్టడం ద్వారా పవన్ కల్యాణ్ ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని నిలదీశారు. తెలంగాణ ప్రశాంతంగా ఉండటం పవన్‌కు ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. జనసేన తలపెట్టిన కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించిన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు.

# సమగ్ర, సమ్మిళిత అభివృద్ధికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది

- అమరుల త్యాగాల ఫలమే తెలంగాణ స్వరాష్ట్రం
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, జూన్ 2 (జనంసాక్షి) : సమగ్ర, సమ్మిళిత అభివృద్ధికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందనీ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. 'జై తెలంగాణ' అనేది కేవలం నినాదం మాత్రమే కాదని, అది ఆత్మగౌరవం, ఐక్యత, స్వీయ గుర్తింపు కోసం సాగిన ఉద్యమానికి ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ అన్నారు. ఆ స్ఫూర్తి నేటికీ తెలంగాణ ప్రజల హృదయాల్లో సజీవంగా ఉందని చెప్పారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్" కార్యక్రమంలో భాగంగా సంస్కృతి కమ్యూనిటీ హాల్ లో లోక్ భవన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, వారి సతీమణి జానకి శుక్లా తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా వేడుకలకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అమరుల త్యాగాలు, ధైర్యసాహసాలు, ఆకాంక్షల ఫలితంగానే తెలంగాణ స్వరాష్ట్ర కల సాకారమైందన్నారు. దక్కన్ పీఠభూమిపై ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం తన సుసంపన్నమైన నాగరిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆధునిక అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోందని ఆయన పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధి, సామాజిక న్యాయం, సాంస్కృతిక పునరుజ్జీవనానికి తెలంగాణ నేడు ప్రతీకగా నిలిచిందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని గవర్నర్ చెప్పారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా కృషి కొనసాగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరం సంప్రదాయం, ఆధునికతల సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. భిన్న ప్రాంతాలు, భాషలు, మతాలకు చెందిన ప్రజలు సామరస్యంగా జీవిస్తున్న హైదరాబాద్ భారతదేశ వైవిధ్యానికి అద్దం పడుతోందన్నారు. 'వసుధైవ కుటుంబకం' అనే భారతీయ తాత్విక భావన తెలంగాణలో ఆచరణ రూపం దాల్చిందని గవర్నర్ అన్నారు. తెలంగాణ సాంస్కృతిక సంబరాలు భిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య సౌహార్దాన్ని, జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు, చారిత్రక వారసత్వం స్ఫూర్తితో తెలంగాణ మరింత ముందుకు సాగుతూ సమతుల్య, సమ్మిళిత, సుస్థిర అభివృద్ధికి దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా అవతరిస్తుందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సందేశాలు పంపిన వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ఇతర ప్రముఖులకు గవర్నర్ కృతజ్ఞతలు తెలిపారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' లక్ష్య సాధనలో తెలంగాణ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు, అలాగే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి తెలంగాణను తమ నివాసంగా మార్చుకుని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములైన వారందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ దక్షిణ రీజియన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి.

# రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరుగు లేదు

- తమతో పోటీకి దిగే ప్రత్యర్థులే లేరు
- రాష్ట్ర అభివృద్ధికి కేబినేట్ జట్టుగా పనిచేస్తోంది
- తామంతా నూరుశాతం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం
- ధాన్యం సేకరణ వైఫల్యం మమ్మాటికీ బిజెపిదే
- మీడియాతో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



ఖమ్మం, జూన్ 2 (జనంసాక్షి) : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై మీడియా దృష్టి పెట్టాలని.. ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రతి ఒక్కరూ సర్ మ్యాపింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణ అవతరణ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులే లేరని వ్యాఖ్యానించారు. రైతు వ్యతిరేక పార్టీ భాజపానే. పని చేసే పార్టీలకు ప్రచారం అవసరం లేదు. అసెంబ్లీ, ఎంపీ, మున్సిపల్ ఎన్నికల్లో మా సత్తా చూపించాం. జిల్లా పరిషత్ ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించే అంశంపై ప్రభుత్వం చాలా బలంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రస్తుత తెలంగాణ మంత్రివర్గం రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక టీమ్‌లా అద్భుతంగా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం కొనియాడారు. అందరి లక్ష్యం తెలంగాణ అభివృద్ధి మాత్రమేనని, క్షేత్రస్థాయిలో పనిచేసే పార్టీలకు ఎలాంటి ఆర్భాటపు ప్రచారాలు అవసరం లేదని, ప్రజలకు సేవ చేయడమే తమ మొదటి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. అసెంబ్లీ, లోక్‌సభ , మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటుకుందని గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వ పాలనకు తాను వంద శాతం మార్కులు వేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇదే ఊపుతో రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలపై కూడా ప్రభుత్వం త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటుందని, 2028 లో జరిగే తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులే ఎవరూ లేరని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు, రాజకీయ పరిణామాలు , ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా అధికారులు పనిచేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకం అత్యంత అద్భుతంగా నడుస్తోందని, ప్రజలందరూ ఈ ఉచిత వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఈ పథకం సజావుగా సాగడం కోసం ప్రభుత్వం ప్రతి నెలా 150 కోట్ల నిధులను కేటాయిస్తోందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా పేదలకు 10 లక్షల వరకు వైద్య బీమా కవరేజ్ లభిస్తుందని, ప్రభుత్వంలో పూర్తి బాధ్యతాయుతమైన విధివిధానాలు ఉన్నాయని చెప్పారు. వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి వీలుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో కొత్తగా 10 వేల బెడ్‌లను పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంట్ మీటర్లు పెట్టబోమని, ఉచిత కరెంట్ అందించి తీరుతామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడమే భవిష్యత్తులో తమ విజయానికి నిదర్శనమని భట్టి విక్రమార్క అన్నారు. అలాగే, సమాజంలో ఓట్ల గల్లంతు వ్యవహారంపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఓటర్ల మ్యాపింగ్ , అన్-మ్యాపింగ్ ప్రక్రియలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న 'ఇందిరమ్మ జీవిత బీమా పథకం' రాష్ట్రంలోని లబ్ధిదారులందరికీ ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ నాయకులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. దేశంలో మొదటి నుండి గోదాములలో స్టాక్ ఉంచడం నేరమైనప్పటికీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం అదానీ, అంబానీ లాంటి పెద్ద కార్పొరేట్ సంస్థలకు గోదాములు పెట్టుకునేలా లబ్ధి చేకూర్చిందని ఆరోపించారు. తెలంగాణ బీజేపీ నేతలు ఇక్కడ రాజకీయాలు మాట్లాడటం మానేసి.. కేంద్రం ద్వారా ముందుగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని, ఆ తర్వాతే ఇతర విషయాల గురించి మాట్లాడాలని డిప్యూటీ సీఎం గట్టిగా హితవు పలికారు.

# బెంగాల్‌లో మమత భారీ ధర్నా

- పోరాటమో.. మరణమో తేల్చుకుంటామని హెచ్చరిక
- మెజార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ధర్నాకు డుమ్మా



కోల్‌కతా, జూన్2 (జనంసాక్షి) : 'పోరాటమో.. మరణమో' తేల్చుకుంటామంటూ టీఎంసీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హెచ్చరించారు. మంగళవారంనాడు కోల్‌కతాలో భారీ ధర్నాకు దిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారి రోడ్లపైకి వచ్చారు. పార్టీ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, కల్యాణ్ బెనర్జీపై దాడులకు నిరసనగా ఈ ధర్నా చేపట్టారు. అయితే ఇంత పెద్ద కార్యక్రమానికి ఆరుగురు ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎంపీలు మాత్రమే హాజరుకావడం తాజాగా చర్చనీయాంశమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ అధికారం కోల్పోయినప్పటికీ 80 మంది ఎమ్మెల్యేలను గెలుచుకుంది. అయితే పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారనే కారణంగా ఇద్దరు ఎమ్మెల్యేలను మమతా బెనర్జీ ఇటీవల సస్పెండ్ చేశారు. దీంతో ఎమ్మెల్యేల సంఖ్య 78కి చేరింది. వీరిలో ఆరుగురు ఎమ్మెల్యేలు... నయన దాస్ బెనర్జీ, మదన్ మిత్రా, ఫిర్హాద్ హకీమ్, బిమన్ బెనర్జీ, అశోక్ దేబ్, సోవన్‌దేబ్ చటోపాధ్యాయ్ మాత్రమే మమతా బెనర్జీ నిరసన దీక్షలో పాల్గొన్నారు. టీఎంసీకి పార్లమెంటు ఉభయ సభల్లో 41 మంది ఎంపీలు ఉన్నారు. అయితే ఐదుగురు ఎంపీలు.. డెరిక్ ఒబ్రెయిన్, సమీరుల్ ఇస్లామ్, దోలా సేన్, మాలా రాయ్, కల్యాణ్ బెనర్జీ మాత్రమే నిరసన వేదిక వద్ద కనిపించారు. ఎన్నికల్లో ఓటమి పాలైన చాంద్రిమ భట్టాచార్య, అఖిల్ గిరి, తన్మయ్ ఘోష్‌లు పార్టీ అధినేత్రి పక్కనే నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.కాగా, అభిషేక్ బెనర్జీపై దాడి అనంతరం మమతాబెనర్జీ నివాసంలో గత ఆదివారం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేల సమావేశంలో 80 మంది ఎమ్మెల్యేలకు గాను కేవలం 20 మందే హాజరయ్యారు. దీంతో ఆ సమావేశం రద్దయింది. ఎంపీలపై దాడి నేపథ్యంలో చాలామంది ఎమ్మెల్యేలు అందుబాటులో లేరంటూ పార్టీ వివరణ ఇచ్చింది. అయితే పార్టీలో పెరుగుతున్న విభేదాలు, అసంతృప్తులే మెజారిటీ ఎమ్మెల్యేల గైర్హాజరుకు కారణమని చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే టీఎంసీ రెబల్ ఎమ్మెల్యేలు మంగళవారంనాడు కోల్‌కతాలోని ఎమ్మెల్యే హాస్టల్‌లో సమావేశం కావడం ఈ వాదనలకు బలం చేకూరుస్తోంది. తమదే అసలు పార్టీ అంటూ 'అస్లీ తృణమూల్' పేరిట కొత్త పార్టీ ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చించినట్టు తెలుస్తోంది. టీఎంసీ అధికారిక సమావేశానికి గైర్హాజరైన 60 మంది ఎమ్మెల్యేలలో 50 మందికి పైగా ఎమ్మెల్యేలు 'అస్లీ తృణమూల్' వైపు మొగ్గుచూపుతున్నారని చెబుతున్నారు. తాజాగా మమతా బెనర్జీ నిరసన దీక్షలో కేవలం వేళ్లపై లెక్కపెట్టుకునే సంఖ్యలో ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

# పరారీలో వైసిపి మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

హైదరాబాద్, జూన్ 2 (జనంసాక్షి) : గండిపేట వందల కోట్ల రూపాయల ల్యాండ్ నకిలీ జీవోల కేసులో సైబరాబాద్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పరారీ అయ్యారని పోలీసులు తెలిపారు. ఏపీలోని నరసరావుపేటలో బ్రహ్మనాయుడు ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అండ్ గ్యాంగ్ కేరళ, కర్ణాటకలో చక్కర్లు కొడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వీరి కోసం గాలిస్తున్నారు. అక్రమ జీవోలను సృష్టించి రూ.వందల కోట్ల విలువైన ల్యాండ్‌ను కాజేసే కుట్రలో మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు. భూ కబ్జా చేసిన బ్రహ్మనాయుడు అండ్ గ్యాంగ్ వెంటనే భూమిని విక్రయించేందుకు ప్రయత్నాలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సోషల్ మీడియాలో ఈ నకిలీ జీవోలను బ్రహ్మనాయుడు అండ్ గ్యాంగ్ వైరల్ చేశారని పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో నకిలీ జీవోలు వైరల్ కావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు.. బ్రహ్మనాయుడు అండ్ గ్యాంగ్‌పై నిఘా పెట్టారు.

# బంగ్లాదేశ్‌కు లక్షల మంది చొరబాటుదారులు

- బెంగాల్ నుంచి వెళ్లిపోతున్న అక్రమదారులు

సోనార్‌పూర్, జూన్ 2 (జనంసాక్షి) : బంగ్లాదేశ్ నుంచి మన దేశంలోకి అక్రమంగా వలస వచ్చిన వారు తిరిగి వెళ్లడంపై దేశవ్యాప్తంగా భిన్నమైన చర్చ జరుగుతోంది. పాతికేళ్లకిందట వచ్చి ఇక్కడే కుటుంబాలను ఏర్పాటు చేసుకున్న వారిపై సానుభూతి చూపించాలని కొంత మంది అంటున్నారు. అయితే వారిని వెనక్కి పంపేయాలని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. బంగ్లాదేశ్ ఏర్పడిన 1971 యుద్ధం తర్వాత మొదలైన వలసల పరంపర నేటికీ ఆగలేదు. వివిధ ప్రభుత్వ నివేదికలు . అంతర్గత విశ్లేషణల ప్రకారం, భారతదేశంలో ప్రస్తుతం సుమారు 1.5 కోట్ల నుండి 2 కోట్ల మంది అక్రమ బంగ్లాదేశ్ పౌరులు నివసిస్తున్నారని అంచనా. కేవలం పశ్చిమ బెంగాల్‌లోనే ఏటా లక్షలాది మంది సరిహద్దులు దాటుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దశాబ్దాల క్రితం వచ్చిన వారు ఇక్కడి స్థానిక రాజకీయ అండదండలతో రేషన్ కార్డులు, ఓటర్ ఐడీలు, ఆధార్ కార్డులు వంటి ఫోర్జరీ పత్రాలు సృష్టించుకుని భారతీయ పౌరులుగా చలామణి అవుతుండటం ఇప్పుడు అసలు చిక్కుగా మారింది. ఇంత పెద్ద ఎత్తున చొరబాట్లు జరుగుతున్నా ఇన్నాళ్లూ ఎందుకు ఉపేక్షించారన్న దానికి ప్రధాన కారణం ఓటు బ్యాంక్ రాజకీయం. సరిహద్దు రాష్ట్రాల్లోని కొన్ని రాజకీయ పార్టీలు ఈ చొరబాటుదారులను తమ శాశ్వత ఓటు బ్యాంకులుగా మార్చుకోవడానికి వారికి రక్షణ కల్పించడమే కాకుండా, భారతీయ గుర్తింపు పత్రాలు లభించేలా సహకరించాయి. 4,096 కిలోమీటర్ల పొడవైన భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో చాలా ప్రాంతం నదీ తీరాలు, చిత్తడి నేలలు కావడం కూడా చొరబాటుదారులకు వరంగా మారింది. ఆర్థిక ఇబ్బందులు, మతపరమైన వేధింపులు , మెరుగైన ఉపాధి కోసం బంగ్లాదేశీయులు భారత్‌ను లక్ష్యంగా చేసుకున్నారు.మన దేశంలోని వనరులు మన పౌరులకే సరిపోని తరుణంలో, కోట్లాది మంది అక్రమ వలసదారులకు ఉచిత రేషన్, వైద్యం, విద్య, గృహనిర్మాణ పథకాలు కల్పించడం దేశ ఆర్థిక వ్యవస్థకు పెను భారం. సామాన్య భారతీయుడు చెల్లించే పన్నుల ద్వారా లభించే సంక్షేమ ఫలాలు చొరబాటుదారుల పాలవ్వడం ప్రజాస్వామ్య విరుద్ధమనే వాదన ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, అస్సాం వంటి రాష్ట్రాల్లో జనాభా మార్పిడి జరిగి, స్థానిక భూమిపుత్రులు మైనారిటీలుగా మారుతున్నారనే ఆందోళన పెరుగుతోంది. మానవతా దృక్పథం పేరుతో సానుభూతి చూపే వారు.. వీరు పాతికేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నారని, వారి పిల్లలు ఇక్కడే పుట్టారని వాదిస్తున్నారు. అయితే, చట్టపరంగా చూస్తే అక్రమ ప్రవేశం ఎప్పటికీ అక్రమమే అవుతుంది. అక్రమంగా వచ్చిన వారు మన దేశం పట్ల విధేయులుగా ఉంటారని గ్యారెంటీ లేదు. దేశ భద్రతా కోణంలో చూస్తే, ఉగ్రవాద మూలాలున్న శక్తులు ఈ చొరబాటుదారుల ముసుగులో దేశంలోకి ప్రవేశించే ప్రమాదం ఉంది. జాతీయ భద్రత, పౌరుల ప్రయోజనాల ముందు వ్యక్తిగత సానుభూతికి తావు లేదని ఢిల్లీ పెద్దలు డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్ విధానాన్ని వేగవంతం చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన హోల్డింగ్ సెంటర్ల ఏర్పాటు చేయడంతో బంగ్లాదేశీయులు.. స్వదేశానికి వెళ్లిపోతున్నారు.

# పవన్ కల్యాణ్ ఖబడ్దార్..

- ఎమ్మెల్యే మందుల సామేల్



హైదరాబాద్, జూన్ 2 (జనంసాక్షి) : తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఆంధ్రా నేతల పెత్తనమేంటి? ఇంకా మీరు పెత్తనం చలాయించాలని చూస్తే మేం చేతగాని వాళ్లమా?' అని ఆయన పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. పవన్ కల్యాణ్‌ను 'ఖబడ్దార్.. తాట తీస్తా' అంటూ మండిపడ్డారు. 'దోచుకోని దాచుకున్నది సరిపోలేదా?' అంటూ మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

# అదుపుతప్పి బోల్తాపడ్డ కారు

- ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

నాగర్ కర్నూల్, జూన్ 2 (జనంసాక్షి) : జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. వంగూరు గ్రామానికి చెందిన బాలు, ప్రవీణ్ మరో వ్యక్తి కారులో జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై వెళుతున్నారు. కల్వకుర్తి మండలం తాండ్ర గేటు సమీపంలో కారు ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో బాలు, ప్రవీణ్ ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వ్యక్తిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు బాలు, ప్రవీణ్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# 'కట్‌మనీ' వసూళ్లు వెనక్కి..

**తిరిగి ఇచ్చేస్తున్న టీఎంసీ నేతలు**

కోల్‌కతా, జూన్ 2 (జనంసాక్షి) : పశ్చిమబెంగాల్‌లో పదిహేనేళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలన ఎన్నో అవినీతి ఆరోపణలను మూటగట్టుకుంది. ముఖ్యంగా సామాన్య ప్రజల నుంచి తృణమూల్ నేతలు, కార్యకర్తలు 'కట్ మనీ' పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఎప్పట్నుంచో ఉన్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ అధికారం కోల్పోయింది. దీంతో తృణమూల్ అగ్ర నేతలపై కూడా ప్రజలు దాడులు చేస్తున్నారు. ఈ దాడుల భయంతో కొందరు తృణమూల్ నేతలు ప్రజాగ్రహాన్ని చల్లబరిచేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలో తాము వసూలు చేసిన డబ్బును తిరిగి ఇచ్చెయ్యాలని నిర్ణయించు కున్నారు. బెంగాల్‌లోని కూచ్ బెహార్ జిల్లాలోని మాతాభంగాలోని తృణమూల్ నేతలు గతంలో తాము వసూలు చేసిన డబ్బును ప్రజలకు తిరిగి ఇచ్చేశారు. గ్రామస్తులను ఒక మైదానంలో సమావేశానికి పిలిచి, అక్కడ డబ్బులను పంపిణీ చేశారు. కూచ్ బెహార్ జిల్లాలోని ఓ తృణమూల్ నేత గ్రామస్తుల నుంచి రూ.80 లక్షలు వసూలు చేశాడని, తాజాగా అందులో సగం డబ్బును వెనక్కి తిరిగి ఇచ్చేశాడని స్థానిక బీజేపీ నేత తెలిపారు. చాలా గ్రామాల్లో ఇలా 'కట్ మనీ'ని వెనక్కి ఇచ్చేశారట. ప్రజాగ్రహానికి భయపడి తృణమూల్ నేతలు బయటకు రాలేని చోట్ల.. వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు డబ్బును పంపిణీ చేశారట.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370